

నూరేళ్ల అమరత్వం నింగినంటే చైతన్యం

లెనిన్.. !

ఎవరూ లేని ఎవరూ రాని ఎడారిలోకపు పరాధీనతలో
ఎగసిపడే మానవతాఝురి పరుగు నీ ఆలోచనల సారం

కలలు కళలు స్వరాలు నరాలు తడారి ఆవిరులై పొగచూరిన క్షణాన
పచ్చని చివుళ్ల కళావరణాన్ని వర్షించిన మేఘం నీ అక్టోబరు విప్లవం

నీ నీడను పడగొట్టిన శిథిల సమాజపు ఘోర విధ్వంసాన
హృదయం నిండా నీవై ఎగురుతున్న జెండావై
మా చూపులకు రూపం కడుతూనే ఉన్నావు
లెనిన్! నువు మసోలియమ్‌లో కాదు... మా మనసుల్లో..!

నవతెలంగాణ

అనుదినం... జనస్వరం సమగ్ర తెలుగు దినపత్రిక ఆదివారం 21-1-2024

సంపుటి : 9 సంచిక : 333 | Published from Karimnagar, Rangareddy, Hyderabad, Khammam | www.navatelangana.com | 12 పేజీలు + (వెబ్‌లో సోపతి) వెల : 8.00

కరెంటు బిల్లులు కట్టొద్దు

అధికారులు అడిగితే సీఎం మాటలు గుర్తు చేయండి...



- ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచన
- రేవంత్ ఓ అహంకారి, కాంగ్రెస్‌కు ఓ ఏక్‌నాథ్ షిండే అంటూ ఎద్దేవా
- ఆయనలాంటి వారిని వేల మందిని చూశామంటూ ఆగ్రహం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గృహజ్యోతి పథకం కింద ప్రజలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామంటూ కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందనీ... అందువల్ల ఈనెల (జనవరి)లో ఎవరూ కరెంటు బిల్లులు కట్టొద్దంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సూచించారు. అధికారులెవరైనా వచ్చి బిల్లుల గురించి అడిగితే, ఎలక్షన్లలో సీఎం రేవంత్ చెప్పిన మాటలను వారికి గుర్తు చేయాలంటూ కోరారు. 'ఉచిత విద్యుత్తును అమలు చేయకపోతే మా నాయకురాలు సోనియా గాంధీయే బిల్లులు కడతారు...' అంటూ సీఎం మొన్నటి ఎన్నికల్లో చెప్పారనీ, ఇప్పుడు అవే మాటలను తిరిగి కాంగ్రెస్‌కు వినిపించాలంటూ ఆయన ఎద్దేవా చేశారు.

పార్లమెంటు సన్నాహక సమావేశాల్లో భాగంగా శనివారం తెలంగాణ భవన్‌లో హైదరాబాద్, సికింద్రాబాద్ లోక్‌సభ స్థానాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నియోజకవర్గాల నాయకులు, కార్యకర్తలనుద్దేశించి కేటీఆర్ ప్రసంగిస్తూ... కాంగ్రెస్ ప్రభుత్వంపైనా, సీఎం రేవంత్‌పైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. 'బీఆర్ఎస్‌ను వంద మీటర్ల లోతులో బొంద పెడతామని సీఎం మాట్లాడుతున్నారు.. ఈ సంగతిని

...11లో

ఆ పులి కోసం

మా దగ్గర బోనుంది

మా కార్యకర్తలే చెట్టుకు వేలాడగడ్తారు

ఒక కుటుంబం చెరనుంచి తెలంగాణను విముక్తి చేశాం

- రాష్ట్ర పునర్నిర్మాణంలో అందరి భాగస్వామ్యం అవసరం
- 60 ఏండ్లలో రూ.72 వేల కోట్లు, ఈ పదేండ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పు
- 26 తర్వాత ఇంద్రవెల్లి నుంచి రాష్ట్రమంతా సుడిగాలి పర్యటన
- ఆర్థిక సంక్షోభం నుంచి అభివృద్ధి పథంవైపు తెలంగాణ
- పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ నిషాన్ లేకుండా పాతిపెడతా : లండన్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'పులి అంట ఇంట్ల పండుకున్నదంట. లేచి వచ్చిందంట. నేను కూడా దానికోసమే చూస్తున్న బిడ్డా. మా దగ్గర బోనుంది. మా దగ్గర వల ఉంది. రమ్మను చెట్టుకు వేలాడగడ్తారు. ఆ బాధ్యత మా కార్యకర్తలు తీసుకుంటరు. ఆ మాటలేంది? ఆ అహంకారమేందీ? ఆ బలుపేంది? అధికార మదం దిగినట్టు లేదు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో ఆ బలుపును దించే పని మా కార్యకర్తలు తీసుకుంటరు. ప్రజలు తీర్పు ఇచ్చారు. ప్రజాప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దొరల పాలన వద్దు. ప్రజా పాలన కావాలంటూ ప్రజలు ఆశీర్వదించారు. అందరి ఆశీర్వాదంతోనే రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాం.'అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశీ పర్యటనలో భాగంగా శనివారం ఆయన లండన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాక సందర్భంగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసిన భారతీయులందరికీ ధన్యవాదాలు చెప్పారు. మిత్రుడు వేణుగోపాల్, సుధాకర్, వారి బృందం

...10లో

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై

కేరళ ఆందోళన

ఫిబ్రవరి 8న జంతర్ మంతర్ వద్ద సీఎం సహా ప్రజా ప్రతినిధులంతా భారీ ధర్నా



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తమ రాష్ట్రం, రాష్ట్రానికి సంబంధించిన అభివృద్ధి ప్రాజెక్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ కేరళలోని లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) ఆందోళనకు పూనుకుంది. అలాగే బీజేపీయేతర రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించనుంది. ఫిబ్రవరి 8న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో సహా రాష్ట్ర మంత్రులు, ఎల్‌డీఎఫ్ ఎమ్మెల్యేలు, ఎంపీలు భారీ ధర్నా నిర్వహించనున్నారు. ఎల్‌డీఎఫ్ కన్వీనర్ ఈపీ జయరాజన్ కాంగ్రెస్, ఇతర యూడీఎఫ్ భాగస్వామ్య పార్టీలను ధర్నాలో పాల్గొనవలసిందిగా కోరారు. కేంద్రం రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో జోక్యం చేసుకుంటున్నదనీ, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకుంటున్నదని విమర్శించారు. కాగా,

...11లో

సివిల్ సప్లయిస్‌ను నిర్వీర్యం చేశారు

2014లో రూ.3వేల కోట్లున్న అప్పు నేడు రూ.58,860 కోట్లకు చేరింది

- కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి ఈ ప్రభుత్వం అప్పగించలేదు
- మేడిగడ్డ డిజైన్‌లోనే భారీ లోపం ఉంది
- డిటెక్టివ్ మైండ్ సెట్ ఉన్నోళ్లే కరెంట్ బిల్లు కట్టొద్దంటారు
- బీఆర్ఎస్‌పై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పౌరసరఫరాల శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందనిఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో పౌరసరఫరాలు, సాగునీటి శాఖలపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ 2014లో రూ.3వేల కోట్లున్న అప్పు 2024లో రూ.58,860 కోట్లకు చేరిందని ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.387 కోట్ల బకాయిలుండగా ప్రస్తుతం అవి రూ.14,354 కోట్లకు పెరిగాయని చెప్పారు. 2014కు ముందున్న ప్రభుత్వాలు రైతులు పండించిన ధాన్యం కొనుగోలు చేయడానికి ఆ శాఖకు ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించగా, గత ప్రభుత్వం నిధులివ్వకుండా రుణాలు తీసుకోమని గ్యారంటీ ఇచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. కానీ రైతులు పండించిన ధాన్యం తామే కొనుగోలు చేస్తున్నట్టు

...11లో

రెండు దేశాల ఏర్పాటే

శాశ్వత పరిష్కారం

గాజా సంక్షోభంపై అలీనోద్యమ సమావేశాల్లో భారత విదేశాంగ మంత్రి జై శంకర్



కంపాలా : గాజాలో ప్రస్తుతం కొనసాగుతున్న హింసాకాండను చూస్తుంటే అక్కడి సంక్షోభానికి సుస్థిరమైన, శాశ్వతమైన పరిష్కారాన్ని కనుగొనాల్సిన అవసరం వుందని స్పష్టమవుతోందని భారత విదేశాంగ మంత్రి జై శంకర్ పేర్కొన్నారు. ఉగాండా రాజధాని కంపాలాలో జరుగుతున్న నామ్ సదస్సులో ఆయన మాట్లాడారు. గాజాలోని హింస, ఘర్షణలు పశ్చిమాసియాలోని ఇతర ప్రాంతాలకు విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధంపై నామ్ సదస్సులో

...11లో

ప్రాణ ప్రతిష్ట రోజు

సెలవెందుకు?

కోర్టును ఆశ్రయించిన మహారాష్ట్ర విద్యార్థులు



ముంబయి : అయోధ్యలో రామ మందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఈ నెల 22న సెలవు ప్రకటిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను నలుగురు విద్యార్థులు బాంబే హైకోర్టులో సవాలు చేశారు. ఈ విద్యార్థులు మహారాష్ట్ర జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ న్యాయ కళాశాల, ముంబయి-నిర్మా న్యాయ విశ్వవిద్యాలయంలో న్యాయ శాస్త్రాన్ని అభ్యసిస్తున్నారు. సెలవుకు సంబంధించి ఈ నెల 19న జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేయాలని వారు అభ్యర్థించారు. సెలవుల

...11లో

జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ప్రతీ 15 ఏండ్లకు ఈవీఏంలకే రూ.పదివేల కోట్లు

- రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌కు సవరణలు
- కేంద్రానికి ఎన్నికల కమిషన్ సమాచారం

న్యూఢిల్లీ : జమిలి ఎన్నికలు (లోక్‌సభ, అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు) నిర్వహిస్తే కొత్త ఈవీఎంలు కోసం ప్రతి 15 ఏండ్లకు రూ.పదివేల కోట్లు అవసరమవుతాయని కేంద్ర ఎన్నికల సంఘం అంచనా వేసింది. కేంద్ర ప్రభుత్వానికి పంపిన ఒక సమాచారంలో ఈ విషయాన్ని ఎన్నికల సంఘం పేర్కొంది. ఈవీఎంల జీవిత కాలం 15 ఏండ్లు అని, జమిలి ఎన్నికలు నిర్వహిస్తే ఒక సెట్ ఈవీంఎలను మూడు సార్లు ఎన్నికల్లో వినియోగించుకోవచ్చునని తెలిపింది. ఎన్నికల సంఘం అంచనా ప్రకారం ఈ ఏడాదిలో జరిగే లోక్‌సభ ఎన్నికల కోసం 11.80 లక్షల పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ జమిలి ఎన్నికలు జరిగితే ప్రతీ పోలింగ్ స్టేషన్‌లోనూ రెండు సెట్ల ఈవీఎంలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఒకటి లోక్‌సభ స్థానానికి, మరొకటి అసెంబ్లీ నియోజకవర్గానికి ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

ప్రతీ ఈవీఎంకు కంట్రోల్ యూనిట్, (సీయూ), బ్యాలెట్ యూనిట్ (బీయూ), ఓటర్-వెరిఫైబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీపీఏటీ) మెషిన్ జత చేయాల్సి ఉంటుంది. అయితే గత ఎన్నికల అనుభవాల దృష్ట్యా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లోనూ సీయూ, బీయూ, వీవీపీఏటీలు అదనంగా అవసరమని ఈసీ పేర్కొంది. ఈ వివరాలను జమిలి ఎన్నికలపై కేంద్ర న్యాయ శాఖ పంపిన ప్రశ్నావళికి ఇచ్చిన సమాధానంలో ఎన్నికల సంఘం తెలిపింది. జమిలి ఎన్నికలు నిర్వహిస్తే కనీసం 45,75,100 బీయూలు, 33,63,300 సీయూలు,





36,62,600 వీవీపీఏటీఎస్‌లు అవసరమని ఎన్నికల సంఘం పేర్కొంది. 2023 ప్రారంభంలో బీయూ ధర రూ.7,900, సియు ధర రూ. 9,800, వీవీపీఏటీ ధర రూ. 16,000గా ఉంది. ఈవీఎంల ధరతో పాటు పోలింగ్, భద్రతా సిబ్బంది కోసం, ఈవీఎంలు దాచి ఉంచడానికి, వాహనాలకు, రవాణాకు అదనంగా మరింత వ్యయం అవుతుందని ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే అన్ని అనుకూలంగా ఉన్నా 2029లో మాత్రమే జమిలి ఎన్నికలు నిర్వహించగలమని ఎన్నికల కమిషన్ తెలిపింది. అలాగే జమిలి ఎన్నికల కోసం రాజ్యాంగంలోని ఐదు ఆర్టికల్స్‌కు సవరణలు చేయాల్సి ఉంటుందని కూడా ఎన్నికల కమిషన్ కేంద్రానికి తెలిపింది. పార్లమెంటు సభల కాలవ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83, లోక్‌సభను రాష్ట్రపతి రద్దు చేయడానికి సంబంధించిన ఆర్టికల్ 85, రాష్ట్ర శాసనసభల కాలవ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172, రాష్ట్రాల శాసనసభల రద్దుకు సంబంధించిన ఆర్టికల్ 174, రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించడానికి సంబంధించిన ఆర్టికల్ 356కు సవరణ చేయాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ తెలిపింది. అలాగే పార్టీ ఫిరాయింపులపై అనర్హతకు సంబంధించిన రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌లో కూడా కొన్ని అవసరమైన మార్పులు చేయాల్సి ఉంటుందని ఎన్నికల కమిషన్ తెలిపింది.

మేడారం జాతరకు

మరో రూ.30 కోట్లు

జీవో 59 పేరిట ప్రభుత్వ భూముల కబ్జా, చర్యలకు ఆదేశం



- కాళోజీ కళాక్షేత్రం మూడు నెలల్లో పూర్తి..
- కరెంటు బిల్లులు త్వరలోనే మాఫీ
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి
- సమీక్షా సమావేశంలో పాల్గొన్న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

మేడారం జాతరను ఘనంగా నిర్వహించడానికి ఇప్పటికే రూ.75 కోట్లను విడుదల చేశామని, త్వరలో మరో రూ.30 కోట్లను మంజూరు చేయనున్నట్టు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హన్మకొండ పట్టణంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 6 జిల్లాల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రితోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, పొన్నం ప్రభాకర్, విప్ డాక్టర్ రామచంద్రునాయక్, జిల్లా ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు మాస్టర్‌ప్లాన్ కోసం సేకరించిన భూములు, వేసిన రోడ్లతో పాటు కాళోజీ కళాక్షేత్ర పనులనూ స్వయంగా పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో ఆర్భాటంగా చేపట్టిన ప్రాజెక్టులు, పనులు, వాటి పురోగతి, వారిచ్చిన జీవోలు, అర్ధాంతరంగా నిలిచిపోయిన పనులను పూర్తి

...11లో



డైరెక్టర్ త్రివిక్రమ్ ఓ అజ్ఞాని

- 'గుంటూరు కారం' సినిమాలో విలన్ల పాత్రల పేర్లను తొలగించాలి
- వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల డిమాండ్
- త్రివిక్రమ్ దిష్టిబొమ్మ దగ్ధం

నవతెలంగాణ- ముషీరాబాద్

సినిమా డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్ అజ్ఞానం నుంచి బయటపడాలని వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల నేతలు అన్నారు. గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టిన మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని డిమాండ్ చేశారు. సినిమా దర్శకుడు త్రివిక్రమ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ శనివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద వామపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ.. సమ సమాజం కావాలని, ఆకలి, పేదరికం పోవాలని కోరుకున్న మార్క్స్, లెనిన్ పేర్లను గుంటూరు కారం సినిమాలో విలన్ల పాత్రలకు పెట్టడం వారిని అవమానించడమేనన్నారు. మహనీయులను అగౌరవపరిచే విధంగా ఉన్న సన్నివేశాలను తక్షణమే తొలగించాలని డిమాండ్ చేశారు.

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ.. త్రివిక్రమ్‌కు చిత్తశుద్ధి ఉంటే మార్క్స్, లెనిన్ జీవితాల ఆధారంగా సమాజ గమనానికి ఉపయోగపడే విధంగా సినిమాలు తీయగలరా అని ప్రశ్నించారు. పీడీఎస్‌యూ నాయకులు ఎస్.నాగేశ్వరరావు, పి.రామకష్ణ మాట్లాడుతూ.. మార్క్స్, లెనిన్ రచించిన సిద్ధాంతం ఆధారంగా అనేక దేశాల్లో విముక్తి పోరాటాలు జరిగాయని, పేదరికం నుంచి విముక్తి పొందారని తెలిపారు. అలాంటి మహోన్నత వ్యక్తులు పేర్లను విలన్లకు పెట్టడం సిగ్గుచేటన్నారు. తివిక్రమ్ తక్షణమే పేర్లను తొలగించాలని లేకపోతే ఆయన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం గుంటూరు కారం సినిమాలో మార్క్స్, లెనిన్ పేర్లను తొలగించాలని కోరుతూ ఫిల్మ్ చాంపర్‌లో సెక్రటరీ దామోదర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం.మమత, అశోక్ రెడ్డి, లెనిన్, జె.రమేష్, స్టాలిన్, శ్రీమాన్, పీడీఎస్‌యూ నాయకులు పి.మహేష్, ఏఐవైఎఫ్ నాయకులు ధర్మేంద్ర, పీవైఎల్ నాయకులు కృష్ణ, ఏఐఎస్ఎఫ్ నాయకులు చైతన్య యాదవ్, వెంకట్ పాల్గొన్నారు.

దేశాన్ని బలమైన శక్తిగా మార్చడమే లక్ష్యం

- కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి రాజ్‌కుమార్ సింగ్



నవతెలంగాణ - బీబీనగర్

భారతదేశాన్ని అన్ని రంగాల్లోనూ ప్రపంచంలోనే బలమైన శక్తిగా మార్చడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని కేంద్ర విద్యుత్ శాఖ, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి రాజ్ కుమార్‌సింగ్ అన్నారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా బీబీనగర్ ఎయిమ్స్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పదేండ్లలో జరిగిన ప్రగతిని ప్రజల దగ్గరకు తీసుకెళ్లడానికి వికసిత్ భారత్ సంకల్పయాత్రను ప్రారంభించినట్టు తెలిపారు. ప్రతి ఇంటికీ విద్యుత్ కనెక్షన్, తాగునీరు, పేదలకు పక్కా ఇళ్లు అనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఇప్పటివరకు మూడు కోట్ల మందికి పక్కా ఇండ్లు ఇచ్చినట్టు చెప్పారు. ఈ పదేండ్లల్లో 25 కోట్ల మందిని పేదరికం నుంచి పైకి తీసుకొచ్చామన్నారు. ప్రపంచంలో మూడో ఆర్థిక అభివృద్ధి చెందిన దేశంగా నిలిచామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా ఐదు లక్షల హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించామని, జన ఔషధ కేంద్రాలను ప్రారంభించినట్టు తెలిపారు. పేదలకు వైద్య సహాయంలో భాగంగా ఎయిమ్స్ సేవలు విస్తృతం చేశామన్నారు. ఎయిమ్స్ డైరెక్టర్ వికాస్ బాటియా మాట్లాడుతూ.. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఎయిమ్స్ ఆస్పత్రి ఆరు గ్రామాలను దత్తత తీసుకున్నట్టు చెప్పారు. దత్తత గ్రామాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు, సేవలు అందించామన్నారు. వసుంధర సమ భావన సంఘం, ఇతర 20 సంఘాలకు కలిపి మూడు కోట్ల రూపాయల విలువగల చెక్కును కేంద్రమంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అధునిక కలెక్టర్ వీరారెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేష్ కుమార్, కెనరా బ్యాంక్ ఏజీఎం శాంతి కుమార్, స్టేట్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ జనరల్ మేనేజర్ కుమార్, ఎయిమ్స్ డిప్యూటీ డైరెక్టర్ బిపిన్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామకృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు

- 'నవతెలంగాణ' విలేకరికి తీవ్ర గాయాలు
- ఒకరు మృతి • జగిత్యాల జిల్లా పొలాస వద్ద ఘటన

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల గ్రామీణ మండలం పొలాస వద్ద శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఒకరు మృతిచెందగా.. 'నవతెలంగాణ' ధర్మపురి విలేకరి అక్కినపల్లి బాబుకుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ముందు రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనగా.. ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న వారిని మరో ద్విచక్ర వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది. దాంతో ఒకరు మృతిచెందారు. విలేకరికి కాలు విరిగింది. వివరాలిలా ఉన్నాయి.. జగిత్యాల పట్టణానికి చెందిన దయాల రమేశ్(33), జగిత్యాల గ్రామీణ మండలం బాలపల్లికి చెందిన ఏగుర్ల గణేశ్ ద్విచక్రవాహనాలపై జగిత్యాల వైపు వస్తుండగా పొలాస వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి.

ఈ ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి. ఈ క్రమంలో ద్విచక్రవాహనంపై జగిత్యాల నుంచి నేరెళ్ల వెళ్తున్న అక్కినపల్లి బాబుకుమార్ (నవతెలంగాణ ధర్మపురి రిపోర్టర్), మామిడిపల్లి సత్తయ్య ఆ ప్రమాదస్థలి వద్ద పరిశీలిస్తుండగా ధర్మపురి వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని ద్విచక్రవాహనం వీరిని ఢీకొట్టింది. దీంతో రెండోసారీ ప్రమాదానికి గురైన రమేశ్ అక్కడికక్కడే మృతిచెందగా, బాబుకుమార్ కాలు పూర్తిగా విరిగింది. గణేశ్, సత్తయ్య, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. వారందరినీ జగిత్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా కేసు నమోదు చేసి జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ దర్యాప్తు చేస్తున్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రిపోర్టర్ బాబుకుమార్‌ను నవతెలంగాణ కరీంనగర్ రీజనల్ మేనేజర్ యాదగిరి, డెస్క్ ఇన్‌చార్జి అనిల్, సిబ్బంది, విలేకరులు పరామర్శించారు.

రోడ్డు పక్కన రేలింగ్‌ను ఢీకొట్టిన కారు

- ముగ్గురు మృతి.. ఇద్దరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-బడంగ్‌పేట్

రంగారెడ్డి జిల్లా పహాడిషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారు రోడ్డు పక్కన రేలింగ్‌ను ఢీకొట్టడంతో ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఓ కారు శనివారం తెల్లవారు జామున చాంద్రాయణ గుట్ట నుంచి మామిడిపల్లి వెళు తున్నది. అయితే అతివేగం, నిర్లక్ష్యంగా నడపటం వల్ల మార్గమధ్యలో హార్డ్‌వేర్ పార్క్ సమీపంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రేలింగ్‌ను ఢీకొట్టింది. దాంతో కారు నుజ్జు నుజ్జు కావటంతోపాటు డ్రైవింగ్ చేస్తున్న హుస్సేని హాలాం పత్తే దర్వాజాకు చెందిన మహమ్మద్ సాజిద్(18), హస్సన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అక్బర్(22), లంగర్‌హౌస్‌కు చెందిన వివాహిత నజ్రియా బేగం(23) అక్కడికక్కడే మృతిచెందారు. హస్సన్‌నగర్‌కు చెందిన నాయిమొద్దిన్, ముస్కాన్ మేహరాజ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరినీ ప్రయివేటు ఆస్పత్రికి పంపించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్, పాన్‌కార్డులు ఆగమాగం

చెత్తకుప్పలో వేలకొద్దీ కార్డులు

- వికారాబాద్ జిల్లాలో పోస్ట్‌మ్యాన్ దాసరి నర్సింలు నిర్వాకం
- నిబ్బరపోయిన చౌడాపూర్ మండలవాసులు
- ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం : తహసీల్దార్ ప్రభులు

నవతెలంగాణ-కుల్కచర్ల/ చౌడాపూర్

అన్నింటికీ అవసరమైన ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు చెత్త కుప్పలో ప్రత్యక్షమయ్యాయి. ప్రభుత్వ సంస్థల నుంచి వచ్చే ఆధార్ కార్డు, పాన్‌కార్డు, పాస్ పోర్టులతో పాటు బ్యాంకుల నుంచి వచ్చే ఏటీఎం కార్డులు ఇలా ఏదైనా పోస్టాఫీసుకు వస్తే.. వాటిని జాగ్రత్తగా ప్రజలకు తీసుకొచ్చి ఇచ్చే బాధ్యత పోస్ట్‌మ్యాన్‌ది. అయితే ఓ పోస్ట్‌మ్యాన్ మాత్రం తన బాధ్యతను పూర్తిగా విస్మరించాడు. ఫలితంగా లబ్దిదారు లకు అందాల్సిన కార్డులు చెత్తకుప్పలో ప్రత్యక్షమయ్యాయి.



గ్రామంలోని చెత్తకుప్పలో వేల సంఖ్యలో ఆధార్, పాన్ కార్డు లతో పాటు వందల లెటర్లు కనిపించడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలకేంద్రంలో శనివారం వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రంలో దాసరి నర్సింలు అనే వ్యక్తి పోస్ట్‌మ్యాన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పోస్టాఫీసుకు వచ్చిన ఆధార్ కార్డు, పాన్ కార్డు, లెటర్లు ఎవరికి ఇవ్వకుండా వచ్చిన వాటన్నింటిని కార్యాలయంలోనే పెట్టుకున్నాడు. అలా ఒకటి కాదు.. రెండు కాదు.. 2011 నుంచి లబ్ధిదారులకు వచ్చిన ఆధార్‌కార్డులు, పాన్ కార్డులు, ఏటీఎంలు, లెటర్లు ఇవ్వకుండా అలాగే పెట్టుకున్నాడు. కాగా అవన్నీ చెత్త కుప్పలో ప్రత్యక్షం కావటంతో ఆ పోస్ట్ మ్యాన్ నిర్లక్ష్యం వెలుగులోకి వచ్చింది. కార్యాలయంలో పేరుకు పోయిన ఏండ్ల నాటి ఆధార్, పాన్, ఏటీఎం కార్డులు, లెటర్ల న్నింటినీ ఎవరికీ అనుమానం రాకుండా.. గ్రామపంచాయతీ ట్రాక్టర్‌లో వేయగా.. వాటిని ఆ ట్రాక్టర్ తీసుకెళ్లి చెత్తకుప్పలో పడేశాడు. అటుగా వెళ్లిన కొంతమంది స్థానికులు.. వాటిని గమనించి షాకయ్యారు. ఆరా తీయటంతో పోస్ట్ మ్యాన్ నిర్లక్ష్యం గురించి తెలిసింది. గంటల తరబడి ఆధార్ సెంటర్లలో నిల్చొని నమోదు చేయించుకుంటే వాటిని ఇవ్వకుండా చెత్తకుప్పలో పడవేయడమేంటని స్థానికులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని రోజుల నుంచి అడుగుతున్నా రాలేదంటూ మాట దాటేస్తూ వచ్చాడని మండిపడ్డారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన పోస్ట్‌మ్యాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు. చుట్టుపక్కల నుంచి ప్రజలు వచ్చి తమ ఆధార్ కార్డు ఇతరేతర పత్రాలను గుర్తించి ఎవరివి వారు తీసుకువెళ్తున్నారు. మిగిలిన ఆధార్ కార్డులు తహసీల్దార్ కార్యాలయంలో భద్రపరిచారు.

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం

ప్రజలకు అందించాల్సిన ఆధార్ కార్డు, ఇతర పత్రాలను చెత్త కుప్పలో వేసిన నిర్లక్ష్యపు పోస్ట్ మ్యాన్ నర్సింలుపై ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం. చెత్త కుప్ప నుంచి కొంతమంది వారికి సంబంధించినవి తీసుకుపోగా మిగిలిన ఆధార్, తదితర కార్డులను తహసీల్దార్ కార్యాలయం నుంచి పంచాయతీ కార్యదర్శుల ద్వారా అందిస్తామని చెప్పారు.

తహసీల్దార్ ప్రభులు

ముగ్గురు మావోయిస్టులు మృతి

- మృతుల్లో ఇద్దరు మహిళలు
- ఆయుధాలు, పేలుడు పదార్థాలు స్వాధీనం



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు ఛత్తీస్‌గఢ్‌లో శనివారం తెల్లవారుజామున పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందారు. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బలమేంద్ర సమీపంలోని బెళంగుట్ట కొండల్లో జరిగింది. మృతుల్లో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారు. బీజాపూర్ ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. జనవరి 19వ తేదీన అడవుల్లో మద్దె ఏరియా కమిటీకి చెందిన డీవీసీఎం వినోద్ కర్మ, ఆవుపల్లి ఎల్ఓఎస్ రాజు పుణేం, ఏసీఎం విశ్వనాథ్, గుడ్డు తేలం తదితరులు 20 నుంచి 25 మంది మావోయిస్టులు ఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. దాంతో బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలమేంద్ర, డీఆర్‌జీ బీజాపూర్ కోబ్రా 210 మందితో కూడిన సంయుక్త పోలీస్ బృందం మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్‌కు బయలుదేరి అడవులను జల్లెడ పట్టడం ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో 20వ తేదీన ఉదయం 7.30 గంటలకు బెళం గుట్ట కొండల్లో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య కాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళలతో కలిపి మొత్తం ముగ్గురు మావోయిస్టులను హతమార్చారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, పేలుడు పదార్థాలు, ప్రచార సామగ్రి, మావోయిస్టు యూనిఫాంలు, మందులు, ఇతర నిత్యావసర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ప్రాంతంలో పోలీసులు నిరంతరంగా పెట్రోలింగ్, సోదాలు నిర్వహిస్తున్నారు.

యశోద ఆస్పత్రిలో అంతర్జాతీయ కాన్ఫరెన్స్, లైవ్ వర్క్‌షాప్

ఎక్మోపై మూడ్రోజుల కార్యక్రమం

నవతెలంగాణ-బేగంపేట్

హైదరాబాద్ హైటెక్ సిటీలోని యశోద ఆస్పత్రిలో ఎక్మో సొసైటీ ఆఫ్ ఇండియా ద్వారా ఎక్మో(ఈసీఎంఓ)పై 13వ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ అండ్ లైవ్ వర్క్‌షాప్ శనివారం ప్రారంభమైంది. మూడ్రోజుల పాటు జరిగే ఈ వర్క్‌షాప్‌కు దేశ నలుమూలల నుంచి సుమారు 1000 మందికి పైగా ఎక్మో వైద్యులు, క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు పాల్గొన్నారు. దశాబ్ద కాలంలో భారతదేశంలో జరిగిన అతిపెద్ద ఎక్మో సమావేశాలలో ఇది ఒకటి.



ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ డైరెక్టర్, డాక్టర్ పవన్ గోరుకంటి మాట్లాడుతూ.. దాదాపు 40 ఏండ్ల కిందటే ఎక్మోకు రూపకల్పన జరిగినా పరిశోధనలు, వాడకలో అనుభవాల కారణంగా ఎక్మో ఉపయోగించడం చాలా తక్కువగా ఉండేదన్నారు. ఇప్పుడు ఎక్మో పరికరం వ్యక్తి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్న సమయాల్లో గుండె, ఊపిరితిత్తులు పనిచేయని సమయంలో ఉపయోగకరంగా మారిందన్నారు. దేశంలో కోవిడ్ మహమ్మారి తర్వాత ఎక్మో అవసరం పెరిగిందని చెప్పారు. కోవిడ్ సమయంలో ఎక్కువ మంది రోగులను 'ఎక్మో' సహాయంతో కాపాడిన ఆస్పత్రుల్లో యశోద హాస్పిటల్స్ ఒకటి అన్నారు. ఎక్మో మద్దతు, ఊపిరితిత్తుల మార్పిడితో ప్రాణాలను కాపాడేం దుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్య లో 100 కంటే ఎక్కువ ఎయిర్ అంబులెన్స్ బదిలీలు యశోద హాస్పిటల్స్‌కు జరిగాయని తెలిపారు. ఈ సదస్సు నైపుణ్యాన్ని పంచుకోవడంపై దృష్టి సారించి, రోగుల సంరక్షణలో ఆవిష్కరణ, సహకారం, శ్రేష్టతను పెంపొందిం చడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.

యశోద హాస్పిటల్స్ సీనియర్ క్రిటికల్ కేర్ మెడిసిన్ స్పెషలిస్ట్, డాక్టర్ వెంకట్‌రామన్ కోలాలి మాట్లాడుతూ.. మరణం అంచు నుంచి మళ్లీ నిండు జీవితం వైపు మళ్లించే పరికరం ఎక్మో అన్నారు. వ్యక్తి గుండె, ఊపిరితిత్తులు పని చేయని సమయంలో ఎక్మో పరికరాన్ని ఉపయోగించి ఆ వ్యక్తి శ్వాసకోశాలు, గుండె చేసే పనులను శరీరం బయట చేస్తారని తెలిపారు. ఎక్మో ఆపరేటింగ్‌లో ఉన్న వివిధ సంక్లిష్టతలను అర్థం చేసుకోవడంతోపాటు ఎక్మో వైద్య రంగంలో దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ అంతర్జాతీయ వైద్య నిపుణుల తో వారి అనుభవాలను పంచుకునే విధంగా ఈ సదస్సు రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సు లో అడల్ట్ అండ్ పీడియాట్రిక్ వైద్యులు, పారామెడికల్ స్టాఫ్ పెర్ఫ్యూనిస్ట్ నర్సింగ్, రెస్పిరేటరీ థెరపిస్టులు పాల్గొన్నారు.

హైకోర్టుకు వర్సిటీ భూములను కేటాయించొద్దు

- జీవో 55ను రద్దు చేయాలి: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



నవతెలంగాణ-రాజేంద్రనగర్

వ్యవసాయ, ఉద్యానవన వర్సిటీలకు చెందిన 100 ఎకరాల భూమిని కొత్త హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ ఇచ్చిన జీవో 55ను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైకోర్టు నిర్మాణానికి బీఎస్పీ వ్యతిరేకం కాదన్న ఆయన.. అవసరమైతే వర్సిటీ భూముల్లో కాకుండా కేబీఆర్ పార్క్, ఇందిరా పార్క్, బయోడైవర్సిటీ పార్కుల్లో హైకోర్టు నిర్మాణం చేపట్టాలని సవాల్ చేశారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లోని ప్రొ.జయశంకర్ వ్యవసా య విశ్వవిద్యాలయం పరిపాలన భవనం ఎదుట 12 రోజులుగా శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థులను ఆయన పరామర్శించి వారికి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం చేసిన తప్పులే మళ్ళీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తోందన్నారు. ప్రపంచానికి అన్నం పెట్టే రైతాంగానికి నూతన వంగడాలను సృష్టించి, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వ్యవసాయ శాస్త్ర వేత్తలను అందించే వర్సిటీ భూముల్లో హైకోర్టు నిర్మాణం చేపడితే వర్సిటీ బయో డైవర్సిటీ దెబ్బతింటుందని తెలిపారు. అరుదైన పక్షులు, జంతువులు, వృక్షజాతుల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ప్రభుత్వం వర్సిటీ భూము లను బలవంతంగా గుంజుకొని, హైకోర్టు కేటాయించడమంటే వ్యవసాయరంగాన్ని తుంగలో తొక్కి, గ్రామీణ ప్రాంత యువతను విద్యకు దూరం చేయడమేనని ఆరోపించారు. ఎన్నో ఏండ్లుగా వర్సిటీలో మెడికల్ ప్లాంట్స్, విత్తనాలు లాంటి అనేక వంగడాలపై ఎన్నో రకాల పరిశోధనలు జరిగాయని గుర్తుచేశారు. విమానాశ్రయానికి, ఐటీ కంపెనీలకు దగ్గరున్న వర్సిటీలో హైకోర్టు నిర్మాణం చేపట్టడమంటే రియల్ ఎస్టేట్‌ను పెంచడమేనని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం జీవో 55ను రద్దు చేసి, ఇతర ప్రభుత్వ భూముల్లో హైకోర్టును నిర్మించాలని డిమాండ్ చేశారు. లేదంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. ధర్నా అనంతరం భూముల కేటా యింపును నిరసిస్తూ అగ్రో బయోడైవర్సిటీలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు విజయ్ ఆర్య జిల్లా నాయకులు ప్రవీణ్, స్వప్న, మల్లగాళ్ల యాదగిరి, రాజేంద్రనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి రాచమల్ల జయసింహ, అసెంబ్లీ అధ్యక్షులు యాపచెట్టు యాదగిరి పాల్గొన్నారు.

మోసం చేసేందుకే ఎస్సీ వర్గీకరణ కమిటీ

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దళితులను మోసం చేసేందుకే బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ కమిటీని నియమించిం దని ఏఐసీసీ కార్యదర్శి ఎస్ఏ సంపత్‌కుమార్ విమర్శించారు. ఆ కమిటీని నియామకాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలు చారకొండ వెంకటేష్, సామ రామ్మోహన్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.పదేండ్ల తన హయాంలో బీజేపీ దేశానికి ఏమీ చేయకుండా నిర్లక్ష్యం చేసిందన్నారు. ఉషా మెహ్రా కమిటీ నివేదిక సిద్ధంగా ఉందని, చిత్తశుద్ధి ఉంటే దానిని అమలు చేయాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో దళితులను దగా చేసేందు కు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కమిటీ పేర దళితులను మోసం చేసిందని తెలిపారు.

బహిరంగ ప్రకటన

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీలోని రూల్ 9(1) ప్రకారం (అప్లికేషన్ టు అడ్జుడికేటింగ్ అథారిటీ ఫర్ బ్యాంక్రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రూల్స్, 2019) క్రింద)

మెసర్స్ చదలవాడ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ యొక్క వ్యక్తిగత హామీదారు సిహెచ్.వరలక్ష్మి యొక్క రుణగ్రహీతలు శ్రద్ధ వహించుట.

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా (ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీలోని రూల్ 9(1) ప్రకారం (అప్లికేషన్ టు అడ్జుడికేటింగ్ అథారిటీ ఫర్ బ్యాంక్రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రూల్స్, 2019) క్రింద సిపి (ఐబి) నెం.111/121/హెచ్‌డిబి/2023లో 17.01.2024న (19.01.2024న కాపీ అందుబాటు లోకి వచ్చింది) సిహెచ్.వరలక్ష్మి, నివాసం:ఇ.నెం.8-3-988/19, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్-500073 వారికి వ్యతిరేకంగా బ్యాంక్రప్టసీ ప్రాసెస్‌ను ప్రారంభించుటకు ఆదేశించింది.

శ్రీ.సిహెచ్.వరలక్ష్మి యొక్క రుణదాతలను వారి క్లెయింలను రుజువులతో ఎలక్ట్రానిక్లీ రూపంలో లేదా కొరియర్, స్పీడ్ పోస్టు లేదా రిజిష్టర్డు లెటర్ ద్వారా 28.01.2024న లేదాముందుగా దిగువ ఇచ్చిన చిరునామా వద్ద బ్యాంక్రప్టసీ ట్రస్టీ వారికి దాఖలుచేయవలెనని తెలియజేయడమైనది.

క్ర.సం.	బ్యాంక్రప్ట్ యొక్క వివరాలు	
1.	బ్యాంక్రప్ట్ పేరు	సిహెచ్. వర లక్ష్మి
2.	బ్యాంక్రప్ట్‌చిరునామా	ఇ.నెం.8-3-988/19, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073
3.	బ్యాంక్రప్ట్ ప్రారంభ తేది	17.01.2024 (19.01.2024న కాపీ అందుబాటులోకి వచ్చింది)
4.	క్లెయింలు దాఖలుచేయుటకు చివరి తేది	28.01.2024
	బ్యాంక్రప్టసీ ట్రస్టీ వివరాలు	
5.	బ్యాంక్రప్టసీ ట్రస్టీగా వ్యవహరిస్తున్న ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ వారి పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	ఎం.మధుసూధన రెడ్డి Reg.No. IBBI/IPA-001/IP-P00843/2017-2018/11427 AFA No. AA1/11427/02/291024/106193 29-10-2024 వరకు చెల్లుబాటు
6.	బోర్డులో నమోదు చేసినట్లు బ్యాంక్రప్టసీ ట్రస్టీ పేరు మరియు ఇ-మెయిల్	ఎంఎంఆర్ ఆయన్ కోర్స్, 4వ అంతస్తు, హెచ్‌ఎమ్ఆర్ ఊటెన్ రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. Email: mmreddyandco@gmail.com Mob. No. 9848271555
7.	బ్యాంక్రప్టసీ ట్రస్టీతో సంప్రదింపులకు ఉపయోగించబడు చిరునామా & ఇ-మెయిల్	ఎంఎంఆర్ ఆయన్ కోర్స్, 4వ అంతస్తు, హెచ్‌ఎమ్ఆర్ ఊటెన్ రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. E-mail:- irppgchadalavada@gmail.com

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు ఏదేని ఇతర వర్తించు చట్టాల యొక్క నియమాలను అనుసరించి తప్పుడు లేదా తప్పుత్రోవ పట్టించు క్లెయిం దాఖలుచేయుట జరిమానాలు విధించబడతాయి లేదా జైలుశిక్షకు దారితీయును.

తేది: 21-01-2024
ప్రదేశం: హైదరాబాద్

మాలిగి మధుసూధన రెడ్డి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ

బహిరంగ ప్రకటన

(ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీలోని రూల్ 9(1) ప్రకారం (అప్లికేషన్ టు అడ్జుడికేటింగ్ అథారిటీ ఫర్ బ్యాంక్రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రూల్స్, 2019) క్రింద)

మెసర్స్ చదలవాడ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ యొక్క వ్యక్తిగత హామీదారు టి.వి.సుబ్బయ్య యొక్క రుణగ్రహీతలు శ్రద్ధ వహించుట.

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా (ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీలోని రూల్ 9(1) ప్రకారం (అప్లికేషన్ టు అడ్జుడికేటింగ్ అథారిటీ ఫర్ బ్యాంక్రప్టసీ ప్రాసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటర్స్ టు కార్పొరేట్ డెటార్స్) రూల్స్, 2019) క్రింద సిపి (ఐబి) నెం.109/121/హెచ్‌డిబి/2023లో 17.01.2024న (19.01.2024న కాపీ అందుబాటులోకి వచ్చింది) టి.వి.సుబ్బయ్య, నివాసం:ఇ.నెం.8-3-988/19, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్‌కాలనీ, హైదరాబాద్-500073 వారికి వ్యతిరేకంగా బ్యాంక్రప్టసీ ప్రాసెస్‌ను ప్రారంభించుటకు ఆదేశించింది.

శ్రీ.టి.వి.సుబ్బయ్య యొక్క రుణదాతలను వారి క్లెయింలను రుజువులతో ఎలక్ట్రానిక్లీ రూపంలో లేదా కొరియర్, స్పీడ్ పోస్టు లేదా రిజిష్టర్డు లెటర్ ద్వారా 28.01.2024న లేదా ముందుగా దిగువ ఇచ్చిన చిరునామా వద్ద బ్యాంక్రప్టసీ ట్రస్టీ వారికి దాఖలుచేయవలెనని తెలియజేయడమైనది.

క్ర.సం.	బ్యాంక్రప్ట్ యొక్క వివరాలు	
1.	బ్యాంక్రప్ట్ పేరు	శ్రీ టి.వి.సుబ్బయ్య
2.	బ్యాంక్రప్ట్‌చిరునామా	ఇ.నెం.8-3-988/19, ఎస్‌బిహెచ్ కాలనీ, శ్రీనగర్ కాలనీ, హైదరాబాద్-500073
3.	బ్యాంక్రప్ట్ ప్రారంభ తేది	17.01.2024 (19.01.2024న కాపీ అందుబాటులోకి వచ్చింది)
4.	క్లెయింలు దాఖలుచేయుటకు చివరి తేది	28.01.2024
	బ్యాంక్రప్టసీ ట్రస్టీ వివరాలు	
5.	బ్యాంక్రప్టసీ ట్రస్టీగా వ్యవహరిస్తున్న ఇన్సాల్వెన్సీ ప్రొఫెషనల్ వారి పేరు మరియు రిజిస్ట్రేషన్ నెంబరు	ఎం.మధుసూధన రెడ్డి Reg.No. IBBI/IPA-001/IP-P00843/2017-2018/11427 AFA No. AA1/11427/02/291024/106193 29-10-2024 వరకు చెల్లుబాటు
6.	బోర్డులో నమోదు చేసినట్లు బ్యాంక్రప్టసీ ట్రస్టీ పేరు మరియు ఇ-మెయిల్	ఎంఎంఆర్ ఆయన్ కోర్స్, 4వ అంతస్తు, హెచ్‌ఎమ్ఆర్ ఊటెన్ రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. Email: mmreddyandco@gmail.com Mob. No. 9848271555
7.	బ్యాంక్రప్టసీ ట్రస్టీతో సంప్రదింపులకు ఉపయోగించబడు చిరునామా & ఇ-మెయిల్	ఎంఎంఆర్ ఆయన్ కోర్స్, 4వ అంతస్తు, హెచ్‌ఎమ్ఆర్ ఊటెన్ రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. E-mail:- irppgchadalavada@gmail.com

ఇన్సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్టసీ కోడ్, 2016 మరియు ఏదేని ఇతర వర్తించు చట్టాల యొక్క నియమాలను అనుసరించి తప్పుడు లేదా తప్పుత్రోవ పట్టించు క్లెయిం దాఖలుచేయుట జరిమానాలు విధించబడతాయి లేదా జైలుశిక్షకు దారితీయును.

తేది: 21-01-2024
ప్రదేశం: హైదరాబాద్

మాలిగి మధుసూధన రెడ్డి
బ్యాంక్రప్టసీ ట్రస్టీ

తెలంగాణ ప్రభుత్వము
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
జోగులాంబ గద్వాల జిల్లా
ఫారం-VII

రూఢీ ప్రకటన (పబ్లికేషన్ ఆఫ్ డిక్లరేషన్)

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతు బద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1) అనుసరించి)

జిల్లా కలెక్టర్ జోగులాంబ గద్వాల ప్రొసీడింగ్స్ నెం.ఇ/691/2023, తేది:06-12-2023
ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ సేకరణ) జె.యల్.ఐ.పి లేఖ నెం.ఎ1/15/2023 తేది: 2023
జిల్లా రాజపత్రం నెం.161/2023

ఈ దిగువ నిర్దిష్ట పరిచిన జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలము విఠలాపురం గ్రామము విస్తీర్ణము ఎ.0.40 సెం.లు ప్రజాప్రయోజనం నిమిత్తం అనగా జవహరు (నెట్టెంపాడు) లిఫ్ట్ ఇరిగేషన్ పథకము యొక్క 2ఆర్ మైనర్/ ఎస్‌డిఎ4/బి1 ప్యాకేజి నెం. 106 నిర్మాణ నిమిత్తము, అవసరమైయున్నదని భావించనైనది.

కావున జోగులాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలము విఠలాపురం గ్రామము విస్తీర్ణము ఎ.0.40 సెం.లు భూమి ఈ క్రింది అనుబంధంలో చూపిన వానిని పైన చూపిన ప్రాజెక్టు నిర్మాణంకు అవసరమైనందున భూమిని సేకరించుటకు ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది.

క్ర. స.	సర్వే నం	భూమి విధం (పట్టా/ ప్రభుత్వ ఇనాం మొ.)	భూమి రకం (మెట్ట/ తరి మొ.)	భూ సేకరణ చేయు విస్తీర్ణం ఎ.సెం.లు	పేరు / చిరునామా (భూమికి సంబంధించిన వ్యక్తుల వివరాలు)	చెట్ల రకం/ సంఖ్య కట్టడం రకం/ విస్తీర్ణము
1	2	3	4	5	6	7
1	279	పట్టా	మెట్ట	0.25	1) కుర్వ రంగన్న అలియాస్ రంగయ్య తండ్రి కుర్వ హన్మంతు 2) పద్మమ్మ భర్త కె. మల్లకల్ 3) ఈడ్గి వెంకటనర్సగౌడ్ తండ్రి రంగన్న గౌడ్ 4) ఈడ్గి నర్సింహ్ గౌడ్ తండ్రి రంగన్న గౌడ్ 5) ఈడ్గి జయన్నగౌడ్ తండ్రి రంగన్న గౌడ్ 6) ఈడ్గి రాఘవేంద్రగౌడ్ తండ్రి రంగన్న గౌడ్ 7) బి. వేణుగోపాల్ తండ్రి బి. బడేసాబ్ అనుభవదారులు : 1) కుర్వ రంగన్న తండ్రి హన్మంతు	-
2	289	పట్టా	మెట్ట	0.15	1) ఎ. హరికృష్ణ తండ్రి ఎ. మాణిక్య రెడ్డి 2) బాగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తండ్రి మణిక్య రెడ్డి అనుభవదారులు : 1) మాణిక్య రెడ్డి	-
				0.40		

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణ పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయడమైనది. ఇట్టి భూసేకరణ వలన ఎవ్వరు నిర్వాసితులు కాలేదు మరియు జీవనోపాధి కోల్పోలేదు. కావున పునరావాసం మరియు పునరుపాధి కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

భూసేకరణ తలపెట్టిన భూమిలో, బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములో లేదా కొంత భాగములో లభ్యమైనచో ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైన పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టరు, జవహరు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, గద్వాల గారి కార్యాలయములో పరిశీలించుకొను నిమిత్తము అందుబాటులో ఉండును.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టరు జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ గద్వాల
సం/- అదనపు కలెక్టర్,(రెవెన్యూ) జోగులాంబ గద్వాల జిల్లా
సం/- కలెక్టరు జోగులాంబగద్వాల జిల్లా

DIPR Ro.No.837/LA-PP/Advt/Pub/2023-24

తెలంగాణ ప్రభుత్వము
నాగర్‌కర్నూల్ జిల్లా గజిట్
ఎక్స్‌ట్రాఆర్డినరి
పబ్లిషడ్ ఆథరిటి

Gaz. No.138/2023

No. G2/666/2023 నాగర్‌కర్నూల్ రోజు తేది.06.11.2023

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టం 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

ఫారం. VII

(డిక్లరేషన్) రూఢీ ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా తెల్కపల్లి మండలములోని నడిగడ్డ గ్రామము వద్ద ప్యాకేజి నెం. 30 డిస్ట్రిబ్యూటరి26 యొక్క మైనర్ 23ఎల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.3.08 గుంటలు/సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా డిస్ట్రిబ్యూటరి26 యొక్క మైనర్ 23ఎల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.ఎస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎం.లు 0.04 గుం భూమి డిస్ట్రిబ్యూటరి26 యొక్క మైనర్ 23ఎల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను రూఢీ ప్రకటన చేయడమైనది.

సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము : నడిగడ్డ మండలము : తెల్కపల్లి జిల్లా : నాగర్‌కర్నూల్

క్ర. సం.	సర్వే నెం./ సబ్ డి. నెం.	పట్టా/ అసైన్డ్/ ఇతరములు	భూమి రకం	సేకరించు విస్తీర్ణం	పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏదైనా హక్కులు గల ఇతర వ్యక్తులు	సంహద్దులు ఉత్తరం	దక్షిణం	తూర్పు	పడమర	చెట్లు		నిర్మాణ	
1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14
1	23	పట్టా	మెట్ట	0.05	టి.అంజనేయులు తండ్రి శ్రీశైలం (0.02) చిలికేశ్వరం బాలమ్మ భర్త రాములు(0.03)	25	21	8	VB	లేవు	లేవు	లేవు	లేవు
2	25	పట్టా	మెట్ట	0.17	బావలి జంగయ్య తండ్రి యల్లయ్య (0.05) పరశురాం తండ్రి శ్రీశైలం (0.02) చిలికేశ్వరం రాములు తండ్రి పర్వతాలు (0.06) అంజనేయులు తండ్రి శ్రీశైలం (0.04)	26	23	7	24	లేవు	లేవు	లేవు	లేవు
3	24	పట్టా	మెట్ట	1.04	యం.బాలోజి తండ్రి నిరంజన్ (0.09) యం. రామోజి తండ్రి బింగోజి (0.06) యం. బాలోజి తండ్రి మకేషమ్ (0.03) బావలి జంగయ్య తండ్రి యల్లయ్య (0.18) పరశురాం తండ్రి శ్రీశైలం (0.08)	27	23	25	VB	లేవు	లేవు	లేవు	లేవు
4	27	పట్టా	మెట్ట	0.29	యం. బాలోజి తండ్రి నిరంజన్ (0.05) నాగమ్మ భర్త నిరంజన్ (0.08) యం. వెంకోజి తండ్రి రామోజి (0.16)	29	24	26	28	లేవు	లేవు	లేవు	లేవు
5	29	పట్టా	మెట్ట	0.33	జి. జంగయ్య తండ్రి గురువయ్య (0.07) జి. శేఖర్య తండ్రి జంగయ్య (0.07) ఎరుకల సామి తండ్రి ఉదన్న (0.06) జంగయ్య తండ్రి (0.06) కార్మ వెంకటయ్య తండ్రి మల్లయ్య (0.07)	32	27	30	28	లేవు	లేవు	లేవు	లేవు
	మొత్తము			3.08									

భూసేకరణ చట్టం 30/2013 లోని సెక్షన్ 15 అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణముకు ఉపయోగమున్న పక్షములో, వాటిని సేకరించబడును. లేనిచో స్వీకరించబడదు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును. సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ షెడ్యూల్ ఏ ఒక్కరూ వారి జీవనోపాధి కోల్పోవడం గానీ, భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియు లేవు.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే), యం.జి.ఎల్.ఐ.యస్..పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్
సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR Ro.No.848/LA-PP/Advt/Pub/2023-24







సాధారణ స్థితికి తమ్మినేని

మెరుగుపడిన ఆరోగ్యం

- హరీశ్‌రావు, పువ్వాడ అజయ్, కూనంనేని పరామర్శ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆరోగ్యం మెరుగుపడింది. ఆయన సాధారణ స్థితికి చేరుకున్నారు. వెంటిలేటర్‌ను తొలగించడంతో సొంతంగానే శ్వాస తీసుకుంటున్నారు. దినపత్రికలు చదువుతూ గడిపారు. బీపీ, పల్స్ సాధారణ స్థితికి చేరుకున్నాయి. కిడ్నీ పనితీరు మెరుగుపడిందనీ, గుండె కొట్టుకోవడంలో మార్పు వచ్చిందని ఏఐజీ వైద్యులు అన్నారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తుల సంబంధిత సమస్యతో బాధపడుతున్న తమ్మినేనిని ఈనెల 16న హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేర్పించిన విషయం తెలిసిందే. వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తున్నది.

శనివారం మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆస్పత్రికి వెళ్లి తమ్మినేనిని పరామర్శించారు. ఆయన ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. తమ్మినేని సంపూర్ణ ఆరోగ్యంతో త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ప్రజాక్షేత్రంలోకి తిరిగి రావాలని అన్నారు.

జనాభాకనుగుణంగా బస్సులను పునరుద్ధరించండి

- మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలి
- లేడీస్ స్పెషల్ బస్సులు వేయాలి : ఆర్టీసీ ఎండీకి మెమోరాండం అందజేసిన ఐద్వా



నవతెలంగాణ-సిటీబ్యూరో

జనాభాకనుగుణంగా ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని, నగరంలో మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. శనివారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ఐద్వా హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు ఏ.పద్మ, కార్యదర్శి కె.నాగలక్ష్మి, సహాయ కార్యదర్శి పి.విమల, కోశాధికారి వై.వరలక్ష్మి తదితరులు కలిశారు. నగరంలో ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలని, కొత్త బస్సులను వేయాలంటూ మెమోరాండం అందజేశారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం సౌకర్యం మహిళలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నదని, అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2020లో 1000 బస్సులను తగ్గించిందని ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. బస్సులను తగ్గించడంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులల్లో రద్దీ పెరిగిందన్నారు. నగర శివారు ప్రాంతాలు, కాలనీ వాసులకు బస్సు సర్వీసులు అందడం లేదన్నారు. నగర శివారు ప్రాంతాల వారికి సరైన బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయివేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారన్నారు. ప్రయివేటు వాహనాల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్యలు పెరిగి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. గ్రామాలకు సైతం బస్సు సౌకర్యం కల్పించాలని, ట్రిప్‌లను పెంచాలని కోరారు. నగరంతోపాటు శివారు ప్రాంతాల్లో రద్దయిన బస్సులను పునరుద్ధరించడంతోపాటు కొత్త బస్సులను వేయాలన్నారు. మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. ముఖ్యంగా లేడీస్ స్పెషల్ బస్సులను సైతం వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

అసోంలో రాహుల్ యాత్ర
బ్యానర్లు ధ్వంసం

దిస్‌పూర్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ న్యాయ్ యాత్రకు సంబంధించిన బ్యానర్లను అస్సాంలో కొందరు దుండగులు ధ్వంసం చేశారు. అస్సాంలో మూడు రోజుల పాటు కొనసాగిన రాహుల్ యాత్ర శనివారం అరుణాచల్ ప్రదేశ్‌లో ప్రవేశించింది. కాగా అస్సాంలోని ఉత్తర లఖింపూర్‌లో యాత్ర కోసం ఏర్పాటు చేసిన బ్యానర్లు, పోస్టర్లు, హోర్డింగులను శుక్రవారం రాత్రి దుండగులు ధ్వంసం చేశారని అస్సాం పీసీసీ మీడియా కమిటీ చీఫ్ భరత్ నారహ్ తెలిపారు. యాత్ర విజయం సాధిస్తుండడంతో ఓర్వలేని కొందరు వ్యక్తులు ఈ దురాగతానికి పాల్పడ్డారని చెప్పారు. ఓ పార్టీకి చెందిన బ్యానర్లు, పోస్టర్లను ప్రత్యర్థి పార్టీలు ధ్వంసం చేయడం అస్సాం చరిత్రలో మునుపెన్నడూ జరగలేదని అన్నారు. రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం యాత్రకు అడ్డంకులు సృష్టిస్తోందని, దానిలో పాల్గొనకుండా ప్రజలను అడ్డుకుంటోందని ఆయన ఆరోపించారు.

'పడవల్లో బ్యాటరీలను తొలగించారు. పెట్రోల్ బంకుల్లో నిల్వలు లేకుండా చేశారు. ఇలాంటి చర్యల ద్వారా ప్రజలు యాత్రకు రాకుండా నిలువరించాలని ప్రయత్నించారు' అని నారహ్ చెప్పారు. అయితే ఎన్ని అడ్డంకులు సృష్టించినా యాత్ర విజయాన్ని అడ్డుకోలేకపోయారని అన్నారు. కాగా ఉత్తర లఖింపూర్ పట్టణంలో కాంగ్రెస్ నాయకుల చిత్రాలతో ఏర్పాటు చేసిన పోస్టర్లను దుండగులు ధ్వంసం చేస్తున్న వీడియోను సామాజిక మాధ్యమాలలో పార్టీ పోస్ట్ చేసింది.

అంత ఈజీ కాదు...

సార్వత్రిక సమరంలో గెలుపు ఏకపక్షం కాదు

- అధికారపార్టీకి పలు రాష్ట్రాల్లో ప్రతికూలతలు
- పుంజుకుంటున్న ఇండియా కూటమి

న్యూఢిల్లీ : రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధిస్తుందని కార్పొరేట్ మీడియా సంస్థలు గత కొంత కాలంగా ఊదరకొడుతున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటు విషయంలో ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు చోటుచేసుకున్నాయంటూ ఆ సంస్థలు వార్తలు వండి వారుస్తున్నాయి. అయితే వాస్తవాలను పరిశీలిస్తే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ విజయం నల్లేరుపై నడక కాబోదని అర్థమవుతోంది. అందుకే.. అయోధ్య రామమందిరంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంపై బీజేపీ అంతగా ఆధారపడాల్సి వస్తోంది.

అసమ్మతి...అసంతృప్తి

అనేక రాష్ట్రాల్లో పార్టీ నేతల దుందుడుకు వైఖరులు, పోకడలు, వారి వ్యవహార శైలి సామాన్య కార్యకర్తల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోంది. మోడీ నేతృత్వంలోని బీజేపీకి కీలకమైన కొన్ని హిందీ రాష్ట్రాల్లో ఈ వాతావరణం కన్పిస్తోంది. అనేక లోక్‌సభ స్థానాల్లో అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని నిర్ణయించడం బీజేపీకి కష్టంగా ఉంది. బీజేపీకి గొప్ప విజయాలు లభిస్తాయని పలు సర్వేలు చెబుతున్న రాష్ట్రాల్లోనే ఈ పరిస్థితి కన్పిస్తోంది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్,



గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో బీజేపీ సొంతంగా ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. ఆయా రాష్ట్రాల్లో 179 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఆ రాష్ట్రాల్లో సైతం స్థానిక పార్టీ నేతలపై అసమ్మతి వ్యక్తమవుతోంది. హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో కూడా ముఖ్యమంత్రులు బీజేపీకి చెందిన వారే. ఆ రెండు రాష్ట్రాల్లో 15 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో కమలదళం ప్రతిపక్షాల నుండి గట్టి పోటీని ఎదుర్కొంటోంది.

మరోవైపు బీజేపీ శిబిరంలో విభేదాలు రచ్చకెక్కుతున్నాయి. మధ్యప్రదేశ్‌లో మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తిరుగుబాటే దీనికి ఉదాహరణ. రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో కూడా బీజేపీ నేతల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల సమయంలో మోడీ జోక్యం చేసుకొని పరిస్థితిని చక్కదిద్దారు. కేంద్రంలో అంతా తామై వ్యవహరిస్తున్న నాయకద్వయంపై ఉత్తరప్రదేశ్ ప్రభుత్వంలోని కొందరు కీలక నేతలు అసంతృప్తిగా ఉండడం రహస్యమేమీ కాదు.

ఇంకేం పెరుగుతుంది?

మహారాష్ట్రలోని సంకీర్ణ ప్రభుత్వంలో బీజేపీ భాగస్వామి. అక్కడ 48 లోక్‌సభ స్థానాలు ఉండగా అధికార కూటమి సగం సీట్లను గెలుచుకునే అవకాశం ఉన్నదని అంచనా. 28 స్థానాలు ఉన్న కర్నాటకలో బీజేపీ ప్రతిపక్షంలో ఉంది. గత మేలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో ఎదురైన ఓటమితో సంస్థాగతంగా బీజేపీ బలహీనపడింది. అందరికీ ఆమోదయోగ్యమైన నేత లేకపోవడం ఆ పార్టీకి ఇబ్బందిగా మారింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్, అస్సాం, మహారాష్ట్ర, కర్నాటకలో కలిపి 270 లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. అంటే లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో సగం సీట్లు ఈ రాష్ట్రాలలోనివే.

ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, గుజరాత్, అస్సాం రాష్ట్రాల్లో ఉన్న 179 స్థానాల్లో 2019 ఎన్నికల్లో బీజేపీ సుమారు 80-90శాతం సీట్లు గెలుచుకుంది. ఇప్పుడు ఈ బలం మరింత పెరిగే అవకాశం ఎంత మాత్రం లేదు. ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్, సమాజ్‌వాదీ, రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీలు కూడా బలమైన ఓటు బ్యాంకును కలిగి ఉన్నాయి. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి ఆయా రాష్ట్రాల్లో ప్రతిపక్షాల బలం పెరిగే సూచనలు కన్పిస్తున్నాయి.

ఇప్పటికే బీజేపీ గరిష్ట స్థాయిలో లోక్‌సభ స్థానాలు గెలుచుకుంది. ఇప్పుడు ఎన్ని గిమ్మిక్కులు చేసినా, ఎత్తుగడలు పన్నినా దాని బలం అంతకంటే పెరిగే అవకాశాలు లేనేలేవు.

జోష్ నింపనున్న రాహుల్ యాత్ర

దళిత నేత మల్లిఖార్జున ఖర్గే కాంగ్రెస్ అధ్యక్షుడుగా, ఇండియా కూటమి ఛైర్మన్‌గా ఎన్నికైన నేపథ్యంలో ఆయన నిర్ణయాత్మక పాత్ర పోషించే అవకాశం ఉంది. బీజేపీకి బలమున్న రాష్ట్రాల్లో సైతం ఆయన దళిత ఓటర్లపై ప్రభావం చూపుతారని, తద్వారా ఇండియా కూటమి బలం పెరుగుతుందని పరిశీలకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఇటీవల ప్రారంభించిన భారత్ జోడో న్యాయ్ యాత్రకు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలన్నీ మద్దతు ఇస్తున్నాయి. ఈ యాత్ర ద్వారా లోక్‌సభ స్థానాలు అత్యధికంగా ఉన్న ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష కూటమి బలపడుతుందని అంచనా. సీట్ల సర్దుబాటు విషయంలో ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య అభిప్రాయబేధాలు ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ అవి పశ్చిమ బెంగాల్, పంజాబ్, ఢిల్లీకే పరిమితం. ఇది ఇండియా పక్షాల ఐక్యతపై ఎలాంటి ప్రభావం చూపబోదు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీకి హ్యాట్రిక్ విజయాన్ని అందించేందుకు ఎన్నికల కమిషన్ కూడా తన వంతు కృషి చేస్తోంది. ఈవీఎంలపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నప్పటికీ వాటిని ఈసీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇక బీజేపీకి ఉన్న అపార ఆర్థిక వనరులను గురించి వేరే చెప్పాల్సిన అవసరమే లేదు. బీజేపీకి, మోడీకి ప్రధాన మీడియా వంత పాడుతున్న విషయం తెలిసిందే. ఇవన్నీ ప్రతిపక్ష ఇండియా కూటమికి ప్రతికూలతలే అయినప్పటికీ రాబోయే ఎన్నికల పోరు మాత్రం ఏకపక్షం కాబోదన్నది నూటికి నూరు పాళ్ల నిజం.

బీజేపీ నాయక ద్వయానికి ఇదేమీ తెలియనిది కాదు. అందుకే అయోధ్యలో రామమందిర ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి అంత ప్రాచుర్యం. ప్రజల్లో మతపరమైన భావేద్వేగాలను కలిగించడానికే ఈ ప్రయాస.

సాగర్ ఎడమ కాల్వకు నీరు విడుదల చేయాలి

పంటను కాపాడండి : మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



నవతెలంగాణ-మిర్యాలగూడ

నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. శనివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సీపీఐ(ఎం) కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎడమ కాల్వ పరిధి ఆయకట్టులో బోర్లు బావులు, చెరువుల కింద 30శాతం వరి పంట సాగు చేశారన్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చేతికొచ్చిన పంట ఎండిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పంటపొలాలను కాపాడేందుకు ఎడమ కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో 524 అడుగుల నీటిమట్టం ఉందని, అందులో 15 టీఎంసీల నీటిని వాడుకునే అవకాశ ఉంటుందని చెప్పారు. కర్నాటక రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటం వల్ల అక్కడి ప్రభుత్వంతో మన ప్రభుత్వం చర్చలు జరిపి ఆల్మట్టి ద్వారా నీటిని తెప్పించుకోవాలన్నారు. సాగర్ ఎడమ కాల్వకు విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి భూగర్భ జలాలు పెంపొందించాలన్నారు. ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటిని విడుదల చేసి పంట పొలాలను కాపాడాలన్నారు. అలా చేస్తే భవిష్యత్‌లో తాగునీటి సమస్య కూడా ఉండదని చెప్పారు. నీటి విడుదలపై ప్రభుత్వ స్పందించకపోతే రైతులను సమీకరించి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్ తదితరులు ఉన్నారు.



పేదలపై అక్రమ కేసులు ఎత్తేయాలి

- ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.పార్థసారథి
- జగిత్యాల జిల్లా కేంద్రంలో గుడిసెల స్థలం పరిశీలన

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

ఇంటి స్థలం కోసం పోరాడుతున్న పేదలపై అక్రమ కేసులు నమోదు చేయడంపై ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, హైకోర్టు న్యాయవాది కె.పార్థసారథి తీవ్రంగా ఖండించారు. వెంటనే వారిపై కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. శనివారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు, న్యాయవాదులు ఎన్.వెంకటేష్, మాధవ రెడ్డి, ఎన్.కుమార్, ప్రసాద్, గణేష్, తిప్పరపు సురేష్‌తో కలిసి జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీఆర్‌నగర్ శివారులో పేదలు వేసుకున్న గుడిసెల ప్రాంతాన్ని సందర్శించారు. అనంతరం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కె.పార్థసారథి మాట్లాడుతూ.. ఇల్లు లేని పేదలు ఇంటి స్థలం కోసం పోరాడుతుంటే ప్రాథమిక ఆధారాలు లేకుండా సెక్షన్ ఐపీసీ 307 కింద అత్యాయత్నం కేసు నమోదు చేయడం, పేదలను అక్రమంగా అరెస్టు చేయడం చట్ట విరుద్ధం అన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అక్రమంగా అరెస్టు చేసి జైల్లో పెట్టిన తొమ్మిది మందిని విడుదల చేయాలని, తప్పుడు కేసులను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయపరమైన సహాయ సహకారం ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ అందిస్తుందని చెప్పారు.

గీత కార్మికుల ప్రాణాలను కాపాడండి

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కేజీకేఎస్ వినతి



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

బతుకుతెరువు కోసం ప్రమాదకరమైన కల్లుగీత వత్తి చేస్తూ రెండు రోజులకు ఒకరుచొప్పున చనిపోతున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ దృష్టికి తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) తీసుకెళ్లింది. వందలాది మంది కాళ్లు చేతు లు విరిగి మంచాన పడుతున్నారని గుర్తు చేసింది. వెంటనే ప్రమాద నివారణా చర్య లు చేపట్టాలనీ, సురక్షిత(సేఫ్టీ) మోకులు ఇవ్వాలని కేజీకేఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు యం.వి.రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు మంత్రిని కోరారు. శనివారం హైదరాబాదు లోని మంత్రిని కలిసి 16 సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని వారికి అందజేశారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా వత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 10 లక్షల మేర ఎక్స్‌గ్రేషియా నెలరోజుల్లో ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ బోర్డు నిబంధనలను తొలగించాలని డిమాండ్ చేశారు. టాడీ కార్పొరేషన్‌కు రూ. 5 వేల కోట్ల బడ్జెట్ కేటాయించి గీత కార్మికుల ఉపాధి మెరుగుపరచాలని కోరారు. గతంలో ఇచ్చిన సర్కారు ప్రకారం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ట్యాంక్ బండ్‌పై నెలకొల్పాలనీ, ఎన్నికల ప్రణాళిక ప్రకారం జనగామ జిల్లాకు పాపన్న పేరు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ ఎన్నికలలో తాము ఇచ్చిన హామీలన్నీ కచ్చితంగా అమలు చేస్తామన్నారు. త్వరలో అన్నీ బీసీ కుల సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించి పరిష్కరిస్తామన్నారు. అనంతరం కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. సర్వాయి పాపన్న జీవన చిత్రాలను, వత్తిని ఉద్యమాన్ని ప్రతిబింబించే విధంగా క్యాలెండర్ ఉందంటూ అభినందించారు. సంఘానికి శుభకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు వి వెంకట నరసయ్య, హైదరాబాద్ అధ్యక్షులు ఎం కష్ణస్వామిగౌడ్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బోయపల్లి సుధాకర్‌గౌడ్ , ఆంజనేయులు, గౌడ సంఘం రాష్ట్ర నాయకులు హరిచరణ్ గౌడ్, ప్రేమ్‌దాస్ గౌడ్ ఉన్నారు.

UNIMONI FINANCIAL SERVICES LIMITED
RO: N.G. 12 & 13 Ground Floor, North Block, Manipal Centre, Dickenson Road, Bangalore - 560 042. CIN No.U85110KA1995PLC018175

బహిరంగ ప్రకటన

యూనిమని ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌వి తనఖా పెట్టినబంగారు ఆభరణాలవేలం 24.01.2024, 10.00 AM వద్ద 8-2-60 1st Floor, Beside Central Bank, Medak road, Siddipet, Telangana -502103. ఎద్ద జరుగుతుందనిఇందుమూలంగా ప్రజలకు తెలియచేయబడుతోంది. వేలం వేయబడేబంగారు ఆభరణాలు తమ బకాయిలుచెల్లించడంలో విఫలమైన వివిధ కస్టమర్ల ఋణ ఖాతాలకు చెందినవి. మా వేలంపాట నోటీసులు ఈ ఋణగ్రహీతలకు కూడా జారీచేయబడ్డాయి. వివిధ కస్టమర్ల వేలం వేయబడేబంగారు ఆభరణాలకు చెందిన గడువు తీరిన ఋణ ఖాతా బ్రాంచ్ పేరుతోక్రింద ఇవ్వబడింది.

Loan Nos: JAGITYAL (JAG) - 1983199, 1982438, 1998107, 2042578, 1999397, 1978188, 1982792, 2017701, 2002759, 2003803, 2020783, 2023052, 2020862, 2022054, 2036713, 2040358, 2050803, 2051315, 2025054. KARIM NAGAR (KAR) - 2040759, 2000507, 1978195, 1999699, 2018552, 1982186, 1984157, 1980202, 2001748, 1981821, 1978316, 2040998, 2041003, 1980898, 2016640, 2020044, 1981001, 1983748, 1999427, 2020226, 2020359, 2021592, 2022402, 2037712, 2038440, 2055122, 1985575, 2016633, 2010789, 1995181, 2011772, 2045992, 2052437. MANCHERIAL (MCL) - 2021915, 2000221, 2037957, 2039163, 2018093, 2000303, 2039598, 2038424, 1999662, 2003521, 2000135, 1998959, 2038104, 2019107, 2019996, 1982008, 1984771, 2023386, 2001404, 2020428, 2023466, 2040264, 2050312, 2056730, 2044344. PEDDAPALLI (PPI) - 2019466, 2004100, 2040739, 2038554, 2039900, 1998203, 2039130, 2000554, 1983731, 1980806, 1983291, 2041448, 1998152, 2000352, 2037119, 1999457, 2038810, 2028674, 2050395, 2014813, 2020208, 2037760, 2044746. SIDDIPET (SID) - 2002961, 2038665, 2038022, 2038717. SIRCILLA - TWO (SCT) - 2040694, 2021377, 2039305, 2036575, 2036935, 2003369, 2019746, 2021079, 2038546, 2000146, 2002707, 2037441, 2041940, 2038114, 2022539, 2040626, 2037302, 2038255, 2010167, 2022202, 2042018, 1981760, 2039201, 2039204, 2038359, 2038118, 2040313, 2037578, 2039001, 2038123, 2037317, 2040411, 2041668, 2042708, 2017614, 2027409, 2031491, 2046105, 2043456, 2036667, 2049741, 2052384. SIRCILLA (SIR) - 2021772, 2045685, 2021983, 2021981, 2022339, 2022343, 2040864, 2039810, 2020749, 2004508, 2038670, 2038507, 2042290, 2040089, 2023161, 2023358, 1998835, 2020714, 2000726, 2022464, 1983056, 2037127, 2020929, 1980148, 2037657, 2037526, 2023288, 1999419, 2039407, 2000971, 2021595, 2004193, 2004293, 2040245, 2021375, 2022161, 2038258, 2039308, 2040125, 2045687, 2053573, 2053422, 2045435, 2016710, 2044553, 2044557, 2019504, 2022410, 2010807, 2052127, 2053902, 2007414, 2034371, 2038999. VEMULAWADA (VWA) - 1983463, 1981684, 2038084, 1981919, 2037733, 2042119, 2018041, 2042452, 1980561, 1984189, 2037438, 2017332, 1983353, 2037789, 2023228, 2000827, 2040017, 1980336, 2041581, 2000127, 2021314, 2040845, 2012462, 1984320, 1998103, 2041615, 1979114, 1980376, 2041750, 1999915, 2002634, 2040801, 2040815, 2042029, 1993814, 2007598, 2013138, 2052454, 2055294. YELLAREDDYPET (YRT) - 1983044, 2041196, 2003674, 2037065, 2002259, 2042187, 2039571, 2001272, 2039705, 1999850, 2019388, 2040805, 1982545, 2020865, 2022417, 2004520, 2039203, 2037057, 1982510, 2004106, 2038198, 2004168, 2006776, 2040509, 2042341, 2021898, 2020684, 2037880, 2037118, 2041704, 2041907, 2002846, 2017592, 2022590, 1983256, 2038771, 2001875, 2041071, 2000654, 2038299, 2038252, 1978282, 2040129, 2039953, 2039611, 2037546, 1980781, 2001560, 2002996, 2002573, 2004374, 2022786, 2041278, 2037018, 2037436, 2037601, 2039450, 2038290, 2038748, 2039511, 2039669, 2039819, 2040756, 2040804, 1982584, 1986143, 2043642, 2020966, 2033946, 2011355, 2011302, 2016801, 2049334, 2051935, 1986545, 2042924, 2044765, 2012041, 2014847, 1993007, 1989130, 2050893, 1994428, 2047204, 2027118, 2051320.

For more details, please contact : Mr. S.Suresh - 9394490169

(Reserves the right to alter the number of accounts to be auctioned &/ postpone / cancel the auction without any prior notice.)

కేరళపై ఇంత నిర్లక్ష్యమా?



తిరువనంతపురం : కేరళ విషయంలో కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న శతృత్వ వైఖరిని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో లక్షలాది మంది ప్రజలు శనివారం మానవహారం నిర్వహించారు. రాష్ట్రంలో ఉత్తర ప్రాంతం చివరలో ఉన్న కాసర్‌గోడ్ రైల్వే స్టేషన్ నుండి దక్షిణాన చివరన ఉన్న తిరువనంతపురంలోని రాజ్‌భవన్ వరకూ 651 కిలోమీటర్ల పొడవునా నిర్వహించిన మానవహారంలో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ముక్తకంఠంతో నిరసించారు. మానవహారం ఏర్పడడానికి ముందు జరిగిన భారీ బహిరంగ సభను సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్ ప్రారంభించారు. ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. కాసర్‌గోడ్ రైల్వే స్టేషన్ ఎదురుగా జరిగిన సభను డీవైఎఫ్ఐ జాతీయ అధ్యక్షుడు ఏఏ రహీం ప్రారంభించారు. డీవైఎఫ్ఐ తొలి జాతీయ అధ్యక్షుడుగా పనిచేసిన సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యుడు ఈపీ జయరామన్ రాజ్‌భవన్ సమీపంలో మానవహారం చివరన నిలబడ్డారు. మానవహారం కార్యక్రమానికి వివిధ జిల్లా కేంద్రాల్లో డీవైఎఫ్ఐ జాతీయ, రాష్ట్ర నాయకులు నేతృత్వం వహించారు. మానవహారంలో పాల్గొన్న లక్షలాది మంది ప్రజలు సరిగ్గా సాయంత్రం ఐదు గంటలకు ఒకేసారి ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎండగట్టారు. 'కేంద్రం నిర్లక్ష్యాన్ని మనం సహించాల్సిన అవసరం ఉన్నదా?' అనే నినాదంతో మానవహారాన్ని ఏర్పాటు చేశారు.

MANAPPURAM HOME FINANCE LTD.
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
గతంలో మణప్పురం హోమ్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌గా తెలిసినది
CIN : U65923K12010PIC039179
రిజిష్టర్డు ఆఫీస్: IV/470A (OLD)W/ 638A (NEW), మణప్పురం హౌస్ వలపాడ్ త్రిస్సూర్, కేరళ-680567
కార్పొరేట్ ఆఫీస్: మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్, మూడవ అంతస్తు, యూనిట్ నెం.301 నుండి 315, ఎ వింగ్, 'కనకియా వాల్ స్ట్రీట్', అంధేరి-కుర్లా రోడ్, అంధేరి ఈస్ట్, ముంబై 400093, మహారాష్ట్ర.
ఫోన్ నెంబర్: 022-66211000, వెబ్‌సైట్: www.manappuramhomefin.com

డిమాండ్ నోటీసు


ఇందుమూలంగా దిగువ రుణగ్రహీత/లకు నోటీసు ఇవ్వడమేమనగా కంపెనీ నుండి వారిపొందిన రుణ వసతులకు సంబంధించి అసలు మరియు వడ్డీని తిరిగిచెల్లించుటలో డిఫాల్ట్ అయినారు మరియు వారి రుణాలు నాన్-పర్ఫామింగ్ అసెట్స్(ఎన్‌పిఏ)గా వర్గీకరించబడినవి. వారు కంపెనీకి అందించిన వారి చివరిగా తెలిసిన చిరునామాలకు బాకీపడిన బకాయిల రికవరీ కొరకుసెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్, 2002 క్రింద సెక్షన్ 13(2) క్రింద వారికి డిమాండ్ నోటీసు జారీచేయబడినది, సదరు రుణగ్రహీలకు సమాచారం నిమిత్తం దీనికి అదనంగా, ఈ బహిరంగ ప్రకటన రూపంలో సదరు రుణగ్రహీతలకు తెలియజేయబడుతున్నది.

క్ర. సం	రుణగ్రహీత/సహ-రుణగ్రహీత పేరు/ లాన్/ బ్రాంచ్	క్రియేట్‌చేసిన ఇంట్రెస్ట్‌కు సంబంధించి సెక్యూర్డు అసెట్ వివరణ	ఎన్‌పిఏ తేది	నోటీసు పంపిన తేదీ & బాకీపడిన మొత్తం
1	శివరాత్రి వీరస్వామి/ ఉప్పలమ్మ శివరాత్రి శివరాత్రి నాగరాజు గుంజ సాయి /NLAP0112004956/ తిరుమల టాకీస్ × రోడ్	డోర్ నెం.4-49, రాజోల్ గ్రామం, కురవి మండలం, మెయిన్ రోడ్, మహబూబాబాద్, పి.ఓ.రాజోల్, వరంగల్, తెలంగాణ, పిన్: 506101	06-01-2024	08-01-2024 & Rs. 4,46,256/-

పై పేర్కొన్న రుణగ్రహీతలను సెక్షన్ 13(2) క్రింద నోటీసు జారీ తేది నుండి 60రోజుల్లోపు బాకీపడిన మొత్తాలను చెల్లించమని కోరుతున్నారు, విఫలం చెందితే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 నియమాల ప్రకారం పైపేర్కొన్న తేదిన సెక్షన్13(2) క్రింద నోటీసు జారీ తేది నుండి 60 రోజుల గడువు ముగిసిన తరువాత తదుపరి చర్యలు చేపట్టబడును.

సం/-
అధీకృత అధికారి
మణప్పురం హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

తేది: 21 జనవరి, 2024
ప్రదేశం: తెలంగాణ



ఇప్పుడు రష్యాలో సోషలిజం పడిపోవచ్చుగాక. దానికి అనేక కారణాలున్నాయి. కానీ మార్క్స్ చెప్పినట్లు దోపిడీ పెరిగిన కొద్దీ సంక్షోభాలు తలెత్తుతాయి.తిరుగుబాట్లు, విప్లవాలు అనివార్యమవుతాయి.'పాత ప్రపంచం మరణిస్తోంది. నూతన ప్రపంచం ఆవిర్భవించడానికి పోరాడుతోంది. ప్రస్తుతమున్న ఈ విరామ కాలం దుర్మార్గులది' అన్న గ్రాంసీ మాటలు అక్షర సత్యం. ఇది అంతం కాక తప్పదు. దానికోసం చేసే ప్రతి పోరాటంలో లెనిన్ మనకు చైతన్యాన్ని అందిస్తూనే ఉంటాడు.

లెనిన్ ఆలోచన సజీవం

సంపాదకీయం

లెనిన్ మన పరాక్రమం, కామ్రేడ్ లెనిన్ ఆయుధం, మన ఆసరా, మన జ్ఞానం- లెనిన్ నేడు లేడూ? చూడు జనంలో వున్నాడు. మయికోవ్‌స్కీ తన్మయత్వగానం ఇది. సత్యపాదం కూడా. ఎందుకంటే లెనిన్ అంతటి విప్లవ మహా యోధుడు, సైద్ధాంతిక ఆచరణశీలుడూ తనే కావటం కారణం. లెనిన్‌కి తగ్గ కవిత్వం ధ్వనించాలంటే అనంతాకాశాన్ని చుంబించే అతని కిరీటాన్ని తాకాలంటే ఈ నా వాక్కులు ఆ మానవున్ని అర్థం చేసుకోవద్దూ? అని వాపోయాడు కవి. ఇది కూడా వాస్తవమే. లెనిన్‌ను అర్థం చేసుకోవటం ఒక ఎత్తయితే, దాన్ని ఆచరణలో పెట్టడం మరో ఎత్తు. ప్రపంచ మానవాళి విముక్తికి మహోన్నత సిద్ధాంతాన్ని మార్క్స్, ఏంగెల్స్‌లు అందిస్తే దానికి అప్పటి నిర్దిష్ట పరిస్థితులలో తన ఆలోచనలను చేర్చి ఆచరణలో పెట్టి ప్రపంచంలోనే మొట్టమొదటి సామ్యవాద కలను సాకారం చేసిన మహానేత లెనిన్. లెనిన్ అనే పేరు మూడు అక్షరాలే కాని ప్రపంచ ప్రజలందరికీ విముక్తి ఆయుధపు ధ్వని అది. ఆయన బతికింది యాభై నాలుగేండ్లే కావచ్చు. వందేళ్ల తర్వాత కూడా ఆయన అందించిన విప్లవ విద్యుత్ సరఫరా అవుతూనే ఉంది. కవిత్వం, సాహిత్యం కూడా అందుకోలేని మహా సంఘటనల అతని జీవన సాఫల్యత. ఆ పేరు వినగానే మానవీయ ఉద్వేగంతో మనసు పులకించిపోతుంది. అంతటి మహోన్నతుని పేరును సినిమా విలన్లకు తగిలించటమా! మార్కెట్ వ్యాపార పెంటకుప్పలో పెన్నీలు ఏరుకునే హీనబతుకులకు పేరులోని ప్రేరణ ఏమర్థమవుతుంది. వాళ్లని ఆ పెంటలోనే వదిలేద్దాం.

నేడు కమ్యూనిస్టులు బలహీనపడుతున్నారని నిరాశకు లోనవుతున్న సందర్భంలో ఎదురు దెబ్బలు తగులుతున్నాయని భీతిల్లు సమయంలో లెనిన్ జీవనక్రమం మనకొక ధైర్యపు టానిక్. సరిగ్గా ఇట్లాంటి పరిస్థితుల నుండే లెనిన్ 'ఏం చేయాలి' అని ఆలోచించి విప్లవ కార్యాచరణకు ప్రణాళికను సిద్ధం చేశాడు. విప్లవం సాధించేందుకు ఉన్న పరిస్థితులపై 'ఏప్రిల్ థీసిస్'ను తయారు చేశాడు. చుట్టూ వున్నవాళ్లు లెనిన్‌ను పిచ్చివాడిగా భావించారు. ఏ నాయకుడూ ఆయనకు మద్దతివ్వలేదు. అయినా ప్రతికూలతలను అధిగమించి, ప్రజాశ్రేణులు ఆయన ఇచ్చిన పిలుపుతో ముందుకు కదిలారు. ప్రజలు పెద్దఎత్తున విప్లవంలో పాల్గొన్నారు. ప్రపంచంలోనే తొలి సోషలిస్టు వ్యవస్థ ఆవిర్భావానికి అంకురార్పణ జరిగింది. ఇప్పుడు నిజంగా మనకున్న నిరాశ తొలిగే సమయం ఆసన్నమవుతోంది. ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు సంక్షోభంలోకి పోతున్నాయి. ప్రజలు పెద్దయెత్తున తమ ఇక్కట్లపై నిరసనలు తెలుపుతున్నారు. వీటిని అణచేందుకు ఫాసిస్టు తరహా పాలన విస్తరిస్తోంది. అయినా చరిత్ర గమనంలో విముక్తి పథం ఆగదు. లెనిన్ సజీవంగా మనకు స్ఫూర్తిని ఇస్తూనే ఉంటాడు.

'విప్లవం మొదలయి, ప్రజలందరి చేరికతో విప్లవం అప్రతిహతంగా సాగుతున్నపుడు విప్లవకారుడు కావటం కష్టం కాదు. విప్లవ పోరాటానికి పరిస్థితులే అస్తిత్వంలో లేనపుడు విప్లవకారుడిగా ఉండటం చాలాకష్టం. అలా ఉండటం చాలా విలువైన విషయం అంటాడు లెనిన్. ఆయనను చదవటం మనకు ఇప్పుడెంతో అవసరం. అతని జీవన విధానమూ కమ్యూనిస్టులకు శిరోధార్యం కూడా. నిబద్ధ కార్యకర్తలుగా నిలబడటానికి ఆయన జీవితం స్ఫూర్తినిస్తుంది. లెనిన్ జీవన విధానం, ప్రపంచ నేతలందరికీ నిన్న, నేడు, రేపు సదా ఆదర్శనీయం. ప్రపంచ భూభాగంలో ఆరవవంతున్న సువిశాల రష్యా అధినేత అయ్యాక కూడా లెనిన్ నిరాడంబరత, వినమ్రత, నైతిక మానవీయతలతో కూడిన జీవన విధానం కొనసాగింది. 'లెనిన్ మనసు, మాట, చేతలకు ఎన్నడూ తేడా కనిపించలేదు. సమసమాజపు వెలుతురు కోసం తనను కొవ్వొత్తిలా కరిగించుకున్నాడు. ఆయన ఆరోగ్యం కోసం మెరుగైన ఆహారం, వసతులు అవసరమని డాక్టర్లు మొరపెడుతున్నా, ప్రజలు హీనంగా జీవిస్తున్నపుడు వాళ్ల కన్నా మంచిగా జీవించే నైతిక హక్కు నాకు లేదని తిరస్కరించిన నేత అని మహా రచయిత గోర్కీ కొనియాడుతాడు. సగటు శ్రామిక పీడిత వర్గ ప్రజల జీవనం కమ్యూనిస్టులకు ప్రామాణికంగా ఉండాలన్నది లెనిన్ ఆలోచన. చిరిగిన కోటును కుట్టించుకుని తొడిగిన ఆయన చాలా స్పష్టంగా ఆ సూత్రాన్ని పాటించాడు. నిరాడంబరత్వం అనేది విప్లవతత్వంలో ఓ భాగమనీ బోధించాడు. అంతేకాక ఆయనలోని వినమ్రత మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది.

1917 విప్లవానంతరం మాట్లాడుతూ "ఇది నా గొప్పతనం కాదు, నే గుర్తించిన సత్యం యొక్క గొప్పతనం. దాన్ని విశ్వసించి, కదిలిన కార్యకర్తల, ప్రజల గొప్పతనం" అని అనగలిగాడు అందుకే.విపరీతమైన అధ్యయనం, చర్చలు పరిశీలనాశక్తి కలిగిన లెనిన్ సామ్రాజ్యవాద విశ్లేషణ, రాజ్యము-విప్లవం, ఏం చేయాలి, కమ్యూనిజం అతివాద బాలారిష్టం మొదలైన రచనలతో పాటు పత్రికలు నిర్వహించడం కూడా సమర్ధవంతంగా చేశాడు. మహిళల సమస్యలను లోతుగా అధ్యయనం చేసాడు. క్లారా జెట్కిన్, కొలంతాయలతో ఆయన జరిపిన చర్చ ఇప్పటికీ మనకో పాఠంలా ఉపయోగపడుతుంది.

ఇప్పుడు రష్యాలో సోషలిజం పడిపోవచ్చుగాక. దానికి అనేక కారణాలున్నాయి. కానీ మార్క్స్ చెప్పినట్లు దోపిడీ పెరిగిన కొద్దీ సంక్షోభాలు తలెత్తుతాయి. తిరుగుబాట్లు, విప్లవాలు అనివార్యమవుతాయి.'పాత ప్రపంచం మరణిస్తోంది. నూతన ప్రపంచం ఆవిర్భవించడానికి పోరాడుతోంది. ప్రస్తుతమున్న ఈ విరామ కాలం దుర్మార్గులది' అన్న గ్రాంసీ మాటలు అక్షర సత్యం. ఇది అంతం కాక తప్పదు. దానికోసం చేసే ప్రతి పోరాటంలో లెనిన్ మనకు చైతన్యాన్ని అందిస్తూనే ఉంటాడు.

నిర్మాణం యెడల లెనిన్ విప్లవ సిద్ధాంతం

1906లో రష్యా సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాలుగో మహాసభ నాటికి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అందరూ అంగీకరించారు. దానిని పార్టీ నియమాలలో చేర్చారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే పార్టీ కమిటీలలో విస్తృత చర్చ జరపటం, చర్చ తరువాత తీసుకున్న నిర్ణయాన్ని, ఐక్యంగా అమలు చేయటం.లెనినిస్టు భావనలో పార్టీ ఒక సైనిక సమూహం కాదు. పార్టీలో సిద్ధాంతం, ఆచరణపై అంతరంగిక చర్చలకు, వాదనలకు తావులేకుండా చేయటం కాదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం వాదనలకు, చర్చలకు విస్తృత అవకాశం కలిగిస్తూ, కేంద్రీకృత రాజకీయ వైఖరితో పోరాటంలో ఐక్యత కలిగివుండటం.



ప్రకాశ్‌కరత్

ఒక విప్లవకర పార్టీకి ఉండవల్సిన మార్క్సిస్టు సిద్ధాంతం, ఆచరణను ముందుకు తీసుకుపోవటంలో లెనిన్ చేసిన కృషి చాలా ప్రాముఖ్యత కలిగివున్నది. రష్యా విప్లవకాలంలో లెనిన్ తన సిద్ధాంతాన్ని ఆచరణలో పెట్టడానికి చాలా కష్టపడ్డారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం పునాదులపై కమ్యూనిస్టు పార్టీని నిర్మించటంలో లెనిన్‌ది ప్రత్యేక స్థానం. లెనిన్ దృష్టిలో పార్టీ నిర్మాణం విప్లవ సిద్ధాంతంలో అంతర్భాగం. 'ఏమి చేయాలి' అనే చిన్న పుస్తకంలో "విప్లవ సిద్ధాంతం లేకుండా విప్లవం ఉండదు" అని నొక్కి చెప్పారు. 1902లో ప్రచురితమైన ఈ పుస్తకంలో సరియైనపార్టీ మాత్రమే విప్లవ సిద్ధాంతాన్ని విప్లవోద్యమంగా మలచగలదు అని విశదీకరించి చెప్పారు. లెనిన్ ప్రకారం "అధికారం కోసం జరిగే పోరాటంలో కార్మికవర్గానికి పార్టీ తప్ప మరొక ఆయుధం లేదు. "విప్లవపార్టీకి అనుగుణమైన పార్టీ నిర్మాణం రూపొందించి, సుస్థిరపరచటానికి 1900-1906 మధ్య కాలంలో లెనిన్ రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీలో అంతర్గత పోరాటాన్ని చేశారు. ఆ కాలంలో, జర్మనీ సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్మికవర్గ పార్టీగా అభివృద్ధి అయి, యూరోపులోని కార్మికవర్గ పార్టీలకు ఒక నమూనాగా వుండింది. తరువాతి కాలంలో రష్యన్ సోషల్ డెమోక్రటిక్ లేబర్ పార్టీ బోల్షివిక్, మెన్షివిక్ పార్టీలుగా చీలిపోయింది. ఈ చీలికకు దారితీసిన ముఖ్య కారణాలలో ఒకటి పార్టీ వ్యవస్థ ఎలా వుండాలి, సభ్యత్వానికి సంబంధించినది.

వర్గచైతన్యం

చివరికి, లెనిన్ ఆలోచనా దృక్పథం బోల్షివిక్ పార్టీ నిర్మాణంలో కనపడుతుంది. రష్యా కార్మికవర్గ ఉద్యమంలోని ఆర్థికవాదులపై లెనిన్ తన మొదటి పోరాటాన్ని ఎక్కుపెట్టారు. పార్టీ నిర్వహణకు ఆర్థిక పోరాటం, ట్రేడ్ యూనియన్ ఉద్యమం సరిపోతుం దనేది ఆర్థికవాదుల వాదన. సద్యోజనితంగా (స్పాంటేనియస్) ఉద్భవించే కార్మిక పోరాటాలపై ఆర్థికవాదం ఆధారపడటాన్ని వ్యతిరేకిస్తూ లెనిన్ పోరాడారు. దోపిడీ, పని పరిస్థితులకు ప్రాథమిక ప్రతిచర్యగా ఆర్థిక పోరాటాలు(ట్రేడ్ యూనియన్ పోరాటాలు) జరుగుతాయి. ఇటువంటి

విప్లవోద్యమాన్ని రూపొందించి, అభివృద్ధి చేసే పార్టీని నిర్మించాలనేది లెనిన్ ఊహ. అందుకోసం కార్మికవర్గంలో అభివృద్ధి చెందిన తరగతులను పార్టీలోకి చేర్చుకుని, వారిలో రాజకీయ చైతన్యం కలిగించి, అగ్రగామిగా ఉపయోగపెట్టుకునే ప్రాముఖ్యత గురించి లెనిన్ మరీమరీ చెప్పారు.అటువంటి పార్టీ వర్గపోరాటాలు, ప్రజాఉద్యమాల ద్వారా ఉక్కులాగా తయారై,అన్ని పరిస్థితులలోనూ, అంటే చట్టబద్ధ, పాక్షిక చట్టబద్ధ, చట్టవిరుద్ధ పరిస్థితులలో పనిచేయగలగాలి. వర్గ రాజకీయాల ఆపత్కాల పరిస్థితులలో పోరాట రూపాలను మార్చగల సామర్థ్యం పార్టీకి వుండాలి. మార్క్సిజం, వర్గపోరాటాలు పునాదిగా వున్న పార్టీకి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం చక్కగా సరిపోతుంది.

సద్యోజనితం పోరాటాలు ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే అభివృద్ధి చేస్తాయి. "ప్రపంచంలోని అన్ని దేశాల చరిత్రను పరికిస్తే కనపడేది కార్మికవర్గం కేవలం తన సొంత కృషి ద్వారా అభివృద్ధి చేయగలిగింది ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే" అని లెనిన్ రాశారు. "పిండ దశలో" వుండే చైతన్యం ఇది. లెనిన్ ఇంకా ఈ విధంగా చెప్పారు "విప్లవకారులతో నిండిన శక్తియుతమైన సంస్థ పోరాటాలకు నాయకత్వం వహించకపోతే సద్యోజనితంగా ఉద్భవించే కార్మికవర్గ పోరాటాలు అసలైన "వర్గపోరాటాలు"గా మారవు. చైతన్యానికి సంబంధించిన సమస్యపై వాదిస్తూ లెనిన్, సోషలిస్టు చైతన్యం లేక వర్గచైతన్యం అనేది "బయటనుంచి" చొప్పించబడుతుందనే మరొక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన "ప్రతి వర్గ పోరాటం ఒక రాజకీయ పోరాటమే" అన్నదానిని లెనిన్ నొక్కి చెప్పారు. మార్క్సిజం పునాదిగా వున్న పార్టీయే కార్మిక శ్రేణులలో వర్గచైతన్యం కలిగించగలిగిన "బయట నుండే" సంస్థ.

నాయకత్వ పాత్ర

లెనిన్ ఆలోచనలో, సోషల్ డెమోక్రటిక్ పార్టీ కార్మికవర్గ పార్టీ కనుక కార్మికుల చైతన్య స్థాయి, నిబద్ధతకు సంబంధం లేకుండా అందరినీ చేర్చుకునే పార్టీగా వుండకూడదు. కార్మికవర్గంలో ముందుండి నడిపే పార్టీ దళాన్ని 'అగ్రగామి' దళంగా లెనిన్ పేర్కొన్నాడు. ఎక్కువ చైతన్యస్థాయి, మిలిటెంట్ కార్మికులను పార్టీ సభ్యులుగా చేర్చుకోవాలని ఇది సూచిస్తున్నది. వీరు కార్మికులలోనూ, ప్రజల్లోనూ పార్టీ సంఘాల ద్వారా పని చేయాలి. వృత్తి విప్లవకారుల సంఘంగా పార్టీ ఉండాలి అని లెనిన్ అన్నారు. "విప్లవ కార్యక్రమాలు వృత్తిగా స్వీకరించిన ఉత్తమోత్తములతో కూడిన విప్లవకారుల సంస్థగా పార్టీ ఉంటుంది." అగ్రగామి నాయకత్వం వృత్తి విప్లవకారులతో కూడి ఉండాలనే లెనిన్ డిమాండ్ పరిస్థితుల అవసరాన్ని బట్టి నిర్దేశించినది. 1905లో విప్లవం సంభవించిన వెంటనే వేలాదిమంది చైతన్యవంతులైన మిలిటెంట్ కార్మికులను పార్టీలో చేర్చుకొనటానికి అంతులేని అవకాశాలు కనిపించాయి. విప్లవ పోరాటం సోషల్ డెమోక్రటిక్ చైతన్యంతో కూడిన కార్మికులను అనేకమందిని తయారు చేసిందని లెనిన్ గమనించారు. ఆనాటి నుండి అభివృద్ధి చెందుతూ వస్తున్న బోల్షివిక్ పార్టీ వివిధ స్థాయిలలో ధృడమైన వృత్తి విప్లవకారులను కలిగివుంది. వీరితో పాటు పూర్తికాలం కార్యకర్తలు గాని శ్రామిక రంగానికి చెందిన సభ్యుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. కార్మికవర్గంలో ముందుండి నడిచే దళంతో కూడినదే పార్టీ అని అగ్రగామి అనే భావనకున్న అర్థం. "అత్యంత అభివృద్ధికర సిద్ధాంతం కలిగివున్న పార్టీ మాత్రమే పోరాడే అగ్రగామి పాత్రను నెరవేర్చగలదు" అని లెనిన్ స్పష్టం చేశారు.


కమ్యూనిస్టుల పాత్రను కమ్యూనిస్ట్ మేనిఫెస్టో ఈ విధంగా నిర్వచించింది. "కార్యరంగంలో కమ్యూనిస్టులు అన్ని దేశాల కార్మిక పార్టీలలో ఇతరులందరికంటే చైతన్యవంతులుగాను, ధృడ సంకల్పులుగాను పనిచేస్తారు. ఇతరుల్ని కార్యరంగంలోకి తీసుకొచ్చేవారుగా వుంటారు. సిద్ధాంతరంగంలో కూడా వారే ఇతర శ్రామికులకంటే చక్కగా ఆలోచించే వారు. ఏ మార్గంలో కార్మికోద్యమం పురోగమించాలో, విజయసాధనకేమేమి అవసరమో, ఆ విజయాలవల్ల తుదకు ఎట్టి సాధారణ ఫలితాలు కలుగుతాయో వారే స్పష్టంగా తెలుసుకోగలిగి వుంటారు.మార్క్స్, ఎంగెల్స్‌ల చారిత్రక కమ్యూనిస్టు ప్రణాళికలోని వ్యాఖ్యానం నుంచి లెనిన్ 'పార్టీ అగ్రగామి' అనే భావనను తెచ్చారు. అగ్రగామి అనేది గతితర్కం నుంచి వచ్చిన భావన. రాటుదేలిన కార్మికవర్గ రాజకీయ చైతన్యంగల కార్మికులతో కూడిన పార్టీగా ఉంటుంది. ఈ అగ్రగామి పార్టీ కార్మిక వర్గం కోసం పోరాడటం, మద్దతు తెలపటం వరకే కాక, సమాజంలో అణగదొక్కబడిన అన్ని తరగతుల ప్రజల కోసం పోరాడుతుంది ఇటువంటి అగ్రగామి పార్టీ మాత్రమే వివిధ భాగాలుగా, అనేక పొరలుగా చీల్చబడిన కార్మికవర్గాన్ని ఐక్యం చేసి, కార్మికవర్గ చైతన్యాన్ని కలిగించగలదు. ఇది మాత్రమే కాదు, విప్లవోద్యమంలో మద్దతు ఇచ్చే ఇతర వర్గాలను, తరగతులను సమీకరించి, పోరాటంలో అభివృద్ధియైన తరగతులను తనలోకి ఇముడ్చుకోవటంలో అగ్రగామిపార్టీ అవసరం వుంది.

కేంద్రీకరణ

అగ్రగామిపార్టీ అనేది కేంద్రీకృత పార్టీగా వుండాలి. పార్టీ పైస్థాయి నుంచి కింది దాకా ఒకే పద్ధతిలో కేంద్రీకృత మార్గంలో వ్యవహరించాలి. జార్ నిరంకుశ ప్రభుత్వం కిందవున్న పరిస్థితులను ఎదుర్కోవటానికి రహస్యంగా పనిచేసే ఉద్దేశ్యంతో మాత్రమే కేంద్రీకృత పార్టీ ఉండాలని లెనిన్ అనుకోలేదు. ఒక కేంద్రీకృత పార్టీ నాయకత్వం కింద రాజకీయంగా ఏకీకృత పార్టీని అందిచటమే కేంద్రీకృత పార్టీ ఉద్దేశం. పార్టీ రాజకీయ-సంస్థాగత నిర్మాణంలో కేంద్రీకరణ సాధించటానికి స్థానిక ప్రచురణలు కాక, ఒక అఖిల రష్యా దినపత్రిక వుండాల్సిన అవసరాన్ని లెనిన్ నొక్కి చెప్పారు. "ఒక దినపత్రిక సమిష్టి ప్రచారకుడు, సమిష్టి ఆందోళనకారుడు మాత్రమే కాక, ఒక సమిష్టి నిర్మాణదక్షుడు కూడా" అని లెనిన్ విశదం చేశారు.లెనిన్ దృష్ట్యా, సకల కేంద్రీకృత వనరులతో శక్తివంతంగా వుండే పెట్టుబడిదారీ రాజ్యాన్ని ఎదుర్కోవాలంటే ఒక కేంద్రీకృత పార్టీ ఉండటం తప్పనిసరి అవసరం.

పార్టీ అంతర్గత ప్రజాస్వామ్యం

పార్టీ కేంద్రీకృత సూత్రానికి పార్టీలోని అన్నిస్థాయిలలో ప్రజాస్వామ్య ఆచరణను జత కలపటం జరిగింది.



ఏమి చేయాలి? అనే పుస్తకం రాస్తున్న సమయంలో రాజ్యం యొక్క అణచివేత తీవ్రస్థాయిలో ఉండటంతో, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ఆచరించటం, అన్ని స్థాయిలలో ఎన్నికలు జరపటం సాధ్యం కాలేదు. దానితో, కేంద్రీకృత సూత్రం ఆధిపత్యం చెలాయించింది. కానీ, 1905 విప్లవం తరువాత, అధికతమ స్థాయిలో రాజకీయ స్వేచ్ఛ వున్నప్పుడు, పార్టీలోని అన్ని స్థాయిలలో పార్టీ నిబంధనావళి చెప్పిన ఎన్నిక సూత్రాన్ని అమలు చేయాలని లెనిన్ పిలుపునిచ్చారు. కేంద్రకమిటీ అధికారం తగ్గించి, కింది స్థాయిల కమిటీలకు ఎక్కువ స్వయంప్రతిపత్తిని ఇచ్చారు.1906లో రష్యా సోషల్ డెమోక్రటిక్ పార్టీ నాలుగో మహాసభ నాటికి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని అందరూ అంగీకరించారు. దానిని పార్టీ నియమాలలో చేర్చారు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అంటే పార్టీ కమిటీలలో విస్తృత చర్చ జరపటం, చర్చ తరువాత తీసుకున్న నిర్ణయాన్ని, ఐక్యంగా అమలు చేయటం.లెనినిస్టు భావనలో పార్టీ ఒక సైనిక సమూహం కాదు. పార్టీలో సిద్ధాంతం, ఆచరణపై ఆంతరంగిక చర్చలకు, వాదనలకు తావులేకుండా చేయటం కాదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యం వాదనలకు, చర్చలకు విస్తృత అవకాశం కలిగిస్తూ, కేంద్రీకృత రాజకీయ వైఖరితో పోరాటంలో ఐక్యత కలిగివుండటం.

కేంద్రీకృత ప్రజాస్వామ్యం

లెనినిస్టు పార్టీ సిద్ధాంత సారం కేంద్రీకృత ప్రజాస్వామ్యం. ఒక విప్లవపార్టీ పనిచేసే నిర్దిష్ట పరిస్థితులకి అనుగుణంగా కేంద్రీకృతం, ప్రజాస్వామ్యం కలగలుపుతో ఏర్పడిన చట్రం ఇది. కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనేది కేవలం నిర్మాణ అంశం మాత్రమే కాదు, కమ్యూనిస్ట్ పార్టీకి అది పునాది అంశం. పెట్టుబడిదారీ విధానం లోపలే పనిచేద్దామనుకునే సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు విప్లవకర పార్టీ నిర్మాణ పద్ధతుల అవసరం ఉండదు. ఆ కారణంగా వారికి కేంద్రీకృత ప్రజాస్వామ్యమంటే గిట్టదు. పెట్టుబడిదారి విధానాన్ని, పాలక వర్గాల వ్యవస్థను కూలదోసి దాని స్థానంలో తప్పనిసరిగా సోషలిజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టుపార్టీ, శక్తివంతమైన రాజ్యాన్ని, దాని అధిపత్య పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత పోరాటంలో అన్ని విధాలా సన్నద్ధమైన సంస్థగా వుండాలి. అటువంటి పార్టీ పార్ల మెంటరీ ప్రజాస్వామ్యంలో ఎన్నికలలో పోటీ చేయటానికే కాక, అది ఎంత స్థిరంగా, దీర్ఘ కాలం ఉన్నప్పటికీ ఈబూర్జువాధిపత్య చట్రంలో అందుబాటులో వున్న ప్రజాస్వామిక హక్కులను, సంస్థలను ఉపయోగించుకుంటుంది. కానీ, కీలకమైన ప్రశ్న కార్మికవర్గాన్ని, విప్లవ ప్రజానీకాన్ని సంఘటిత పరచి, విప్లవోద్యమానికి నాయకత్వం వహించటానికి పార్టీ సన్నద్ధమై ఉన్నదా అనేది.

విప్లవోద్యమాన్ని రూపొందించి, అభివృద్ధి చేసే పార్టీని నిర్మించాలనేది లెనిన్ ఊహ. అందుకోసం కార్మికవర్గంలో అభివృద్ధి చెందిన తరగతులను పార్టీలోకి చేర్చుకుని, వారిలో రాజకీయ చైతన్యం కలిగించి, అగ్రగామిగా ఉపయోగపెట్టుకునే ప్రాముఖ్యత గురించి లెనిన్ మరీమరీ చెప్పారు.అటువంటి పార్టీ వర్గ పోరాటాలు, ప్రజాఉద్యమాల ద్వారా ఉక్కులాగా తయారై,అన్ని పరిస్థితులలోనూ, అంటే చట్టబద్ధ, పాక్షిక చట్టబద్ధ, చట్టవిరుద్ధ పరిస్థితులలో పనిచేయగలగాలి. వర్గ రాజకీయాల ఆపత్కాల పరిస్థితులలో పోరాట రూపాలను మార్చగల సామర్థ్యం పార్టీకి వుండాలి. మార్క్సిజం, వర్గపోరాటాలు పునాదిగా వున్న పార్టీకి కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రం చక్కగా సరిపోతుంది. వర్గపోరాటం ఒక సామూహిక చర్య. కేంద్రీకృత ప్రజాస్వామ్యం సమిష్టిగా నిర్ణయాలు చేయటాన్ని, సమిష్టిగా కార్యక్రమాలు చేయటాన్ని ప్రోత్సహిస్తుంది. అది స్వతంత్ర ఆలోచనను, పోరాటంలో ఐక్యతను అనుమతిస్తుంది

కేంద్రీకృత ప్రజాస్వామ్యం అనేది కేవలం నిర్మాణ అంశం మాత్రమే కాదు, కమ్యూనిస్ట్ పార్టీకి అది పునాది అంశం. పెట్టుబడిదారీ విధానం లోపలే పనిచేద్దామనుకునే సోషల్ డెమోక్రటిక్ పార్టీలకు విప్లవకర పార్టీ నిర్మాణ పద్ధతుల అవసరం ఉండదు. ఆ కారణంగా వారికి కేంద్రీకృత ప్రజాస్వామ్యమంటే గిట్టదు.పెట్టుబడిదారి విధానాన్ని, పాలక వర్గాల వ్యవస్థను కూలదోసి దాని స్థానంలో తప్పనిసరిగా సోషలిజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టుపార్టీ, శక్తివంతమైన రాజ్యాన్ని, దాని అధిపత్య పాలక వర్గాలకు వ్యతిరేకంగా రాజకీయ, సైద్ధాంతిక, సంస్థాగత పోరాటంలో అన్నివిధాలా సన్నద్ధమైన సంస్థగా వుండాలి.

20వ శతాబ్దం రెండోసగంలో విప్లవాలు జరగని కాలంలో అనేక కమ్యూనిస్టు పార్టీలు పనిచేస్తున్నాయి. 21వ శతాబ్ది తొలి రెండు దశాబ్దాలలో ఈ పరిస్థితి ఇంకా స్పష్టమైంది. అయితే, ఈ కమ్యూనిస్టు పార్టీలు కేంద్రీకృత ప్రజాస్వామ్యానికి కట్టుబడి పనిచేస్తుండటంతో ఉనికిలో ఉండగలిగాయి. సైద్ధాంతిక-రాజకీయ లోపాలు, పొరపాట్లు ఏమైనప్పటికీ, కేంద్రీకృత ప్రజాస్వామ్యం వాటిని విప్లవ పార్టీగా సజీ వంగా ఉంచింది. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని విడిచిపెట్టిన పార్టీలు కమ్యూనిస్టు పార్టీలుగా అంతమై పోవటమో లేక విచ్ఛిన్నమై పోవటమో జరిగాయి. దీనికి చక్కని ఉదాహరణ, ఇటలీ కమ్యూనిస్టు పార్టీ. ఇటలీ కమ్యూనిస్టు పార్టీ 80వ దశకం దాకా, సోషలిస్టు దేశాలకు వెలుపల వున్న అతి పెద్ద కమ్యూనిస్టు పార్టీ. ఈ పార్టీ సోవియట్ యూనియన్ పతనానికి చాలా ముందే కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని వదులుకోవటంతో మొదలైన ప్రయాణం, చివరికీ మార్క్సిజాన్ని కాదనుకోవటంతో ముగిసింది. 20వ శతాబ్దంలో వచ్చిన విప్లవాల చారిత్రక అనుభవం లెనిన్ యొక్క పార్టీ సిద్ధాంతం, కేంద్రీకృత ప్రజాస్వామ్య ఆచరణ సరియైనవని రుజువు చేస్తున్నాయి.

1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఏర్పడిన నాడు, అది ఎత్తుగడల పంథాని, పార్టీ కార్యక్రమాన్ని ఆమోదించింది. దానితో పాటు, కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాల ఆధారంగా పార్టీని పునర్నిర్మించాలనే కర్తవ్యాన్ని తీసుకున్నది. ఉమ్మడిపార్టీలో రివిజనిజం కేంద్రీకృత ప్రజాస్వామ్య సూత్రాన్ని హరించివేసినందువల్ల దాని అవసరం ఏర్పడింది. ఇది ఒక నిరంతర కర్తవ్యం. భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితులలో పార్టీని నిర్మించటంలో కలిగిన అనుభవం కేంద్రీకృత ప్రజాస్వామ్యం పునాదిగా పార్టీ నిర్మాణం కొనసాగించటానికి ప్రయత్నించాలని చెపుతున్నది.

"ప్రపంచంలోని అన్ని దేశాల చరిత్రను పరికిస్తే కనపడేది కార్మికవర్గం కేవలం తన సొంత కృషి ద్వారా అభివృద్ధి చేయగలిగింది ట్రేడ్ యూనియన్ చైతన్యాన్ని మాత్రమే" అని లెనిన్ రాశారు. "పిండ దశలో" వుండే చైతన్యం ఇది. లెనిన్ ఇంకా ఈ విధంగా చెప్పారు "విప్లవకారులతో నిండిన శక్తియుతమైన సంస్థ పోరాటాలకు నాయకత్వం వహించకపోతే సద్యోజనితంగా ఉద్భవించే కార్మికవర్గ పోరాటాలు అసలైన "వర్గపోరాటాలు"గా మారవు. చైతన్యానికి సంబంధించిన సమస్యపై వాదిస్తూ లెనిన్, సోషలిస్టు చైతన్యం లేక వర్గచైతన్యం అనేది "బయటనుంచి" చొప్పించబడుతుందనే మరొక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. కమ్యూనిస్టు ప్రణాళికలో చెప్పిన "ప్రతి వర్గ పోరాటం ఒక రాజకీయ పోరాటమే" అన్నదానిని లెనిన్ నొక్కిచెప్పారు.

అనువాదం : కర్లపాలెం

నజర్

గుండెల్లో ఏముందో...

చాలాకాలానికి అక్కింటికి వచ్చిన కిరణ్ ఇంట్లోని పరిస్థితిని చూసి షాక్ తిన్నాడు. ఐదు నిమిషాలకు షాక్ నుండి తేరుకుని మళ్ళీ తేరిపార చూశాడు. అనుమానం లేదు! తను చూసింది నిజమే! ఎదురుగా ఉన్నది తన బావేనని ధృవపర్చుకుని.

"అక్కా" అని గావు కేక పెట్టాడు.

వంటింట్లో నుండి పరుగెత్తుకుని వచ్చింది లక్ష్మి. తమ్ముడిని చూడగానే లక్ష్మికి ఎంతో సంతోషమైంది!

తమ్ముడూ! 'అమ్మానాన్న ఎట్లా ఉన్నారురా'! అడిగింది లక్ష్మి.

'అంతా బాగానే ఉన్నాం గాని! బావకేమయిందక్కా! ఏం చేశావక్కా నా బావని! ఎందుకిలా మారిపోయాడక్కా!' అన్నాడు పూడుకుపోయిన గొంతుతో కిరణ్.

"నీ బావకేమయ్యిందిరా! బాగానే ఉన్నాడుగా! అయినా నీ బావను నేనేం చేస్తాను! నీ బావ చేయకుండా ఉంటే అదే పదివేలు"! అన్నది లక్ష్మి.

"బావకేం కాలేదంటావేం! చూడు సరిగ్గా చూడు బంగారం లాంటి నా బావ సన్యాసం పుచ్చుకున్నాడు! దీనికి కారణం నీవుకాక మరెవ్వరు! అంతా నీవే చేశావు!" అంటూ బావను అక్కకు చూపించాడు.

నిజమే! అల్లు అర్జున్‌లా స్టైలిష్‌గా ఉండే భాస్కర్ బావ. ఇప్పుడు కాషాయ వస్త్రాలు ధరించి ఉన్నాడు. చేతిలో గాడ్జెట్ బదులు ఇప్పుడు రుద్రాక్షలు కనబడుతున్నాయి! గాల్లో అల్లల్లాడే ఉంగరాల జుట్టు నూనె రాసి, కొప్పు కట్టాడు. బొట్టు అంటె తెలియని నుదుటన ఇప్పుడు పంగనామాలు తీర్చిదిద్దుకున్నాడు. కళ్లు మూసుకుని మంత్రోచ్చారన చేస్తున్నాడు. భాస్కర్! తపో ముద్రలో ఉన్నందున కిరణ్ వచ్చి గావు కేక పెట్టింది కూడా తెలియనట్లుంది.

బావను చూస్తూ దు:ఖం ఆపుకోలుక పోయాడు! కిరణ్.

"ఇంత చిన్న వయస్సులో నీకెంత కష్టం వచ్చింది! మా అక్క ఏదైనా మాట వినకుంటే. నాతో చెప్పకూడదా! దీనికే సన్యాసుల్లో కలిసిపోతావా! ఇంకా నయం! బావ ఇంట్లో నుండి బయటకు వెళ్లక ముందే చూశాను! నా బావను సన్యాసుల్లో కలవనీయను! మా అక్క సంసారం నిలబెడతాను! " అని కళ్లు తుడుచుకుంటూ బావ కాళ్లను బిగ్గరగా పట్టుకున్నాడు కిరణ్.

దాంతో భాస్కర్ కళ్లు తెరిచాడు. కాళ్లు పట్టుకున్న బావమరిదిని లేవదీశాడు!

"మామూలుగా పలకరించవచ్చు కదా! డబ్బేమైనా కావాలా కిరణ్!" అన్నాడు ప్రేమగా.

"నాకేమొద్దు గాని, ఎందుకు బా! మా అక్క బతుకును ఆగం చేస్తున్నావు! నీకేం తక్కువ చేసింది? ఎందుకు సన్యాసం పుచ్చుకుంటున్నావు?" నిలదీశాడు కిరణ్.

"పిచ్చివాడా! ఇది సన్యాసం కాదు! అనుష్టానం నాయనా!" అన్నాడు భాస్కర్.

"ఓరి నాయనో! సన్యాసమే వద్దని మొత్తుకుంటుంటే అనుష్టానం కూడా పుచ్చుకున్నావా?" అంటూ మళ్ళీ కళ్ల నీళ్ల పెట్టుకున్నాడు కిరణ్.

"ఒరే కిరణ్ తొందరపడకు! అనుష్టానం అంటే సన్యాసం పుచ్చుకోవటం కాదు! మీ అక్క నాకేం తక్కువ చెయ్యలేదు! సన్యాసిని కావల్సిన అవసరమూ లేదు! అక్కడ మా మోడీ అనుష్టానం చేస్తున్నాడు. ఇక్కడ నేనూ పాటిస్తున్నాను!" అన్నాడు భాస్కర్ రజనీకాంత్ స్టైల్లో.

"అక్కడ మోడీ అనష్టానికి కారణమేమిటో తెలుసా బా!" అన్నాడు కిరణ్.

రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణ ప్రతిష్ట చేయటానికి, పాటించాల్సిన ఆచారాల్లో అనుష్టానం కూడా ఒకటి!" అన్నాడు భాస్కర్ గంభీరంగా.

"అది కాదు! బా! ఏ పుణ్యకార్యం చేసినా, పెళ్లైన మగవాడు భార్యా సమేతంగా చేయాలని శాస్త్రాలు ఘోషిస్తున్నాయి! సింగిల్‌గా ఉన్న మోడీ, ఈ పుణ్యకా ర్యాన్ని ఎలా చేస్తాడని శంకరా చార్యులు ప్రశ్నించారు! అందుకే పరిహారం కోసమే అనుష్టానం చేస్తున్నాడు" వివరించాడు కిరణ్.

"శంకరాచార్యులు ఎవరు! వారు ఖాన్‌గ్రెస్ వాదులు! వారిని మేం హిందువులుగా గుర్తించం!" అన్నాడు భాస్కర్.

కిరణ్ ఫక్కున నవ్వాడు.

"శంకరాచార్యులు, వైష్ణవాచార్యులు, అఖారాలు హిందుమతానికి మూల స్తంభాలు. దేశంలో బౌద్ధమతం విజృంభిస్తున్న కాలంలో శైవ, వైష్ణవ మతాలు కొట్టుకుంటుంటే. అది తప్పని అంతా కలిసి హిందూమతాన్ని పరిరక్షించుకోవాలని, దేశమంతా తిరిగి ధర్మ ప్రచారం చేసి, భారతదేశానికి నాలుగు దిక్కులా నాలుగు పీఠాలను ఏర్పాటు చేసి, ఆ నాలుగు పీఠాలకు, తన ప్రధాన శిష్యులను అధిపతులను చేసి, ధర్మ ప్రచార బాధ్యతలు అప్పచెప్పిన జగద్గురు శంకరాచార్యుడి పరంపరే, ఇప్పుడున్న ఈ నలుగురు శంకరాచార్యులు! ఇప్పుడు శైవ, వైష్ణవ, శాక్తేయ మత కల్లోహాలు లేకుండా, హిందూమతం ఒక్కటే అనే భావన ఉందంటే దానికి కారణం ఆ జగద్గురే! ఆయన సిద్ధాంతాన్ని కొనసాగిస్తున్న శిష్యులపైనే అభాండాలు వేస్తారా? ఎంత అన్యాయం!" అన్నాడు కిరణ్.



"హహ్హా! మా విశ్వగురువు ముందు ఈ జగద్గురులు సూర్యుడి ముందు దివిటీల్లాంటివారు! అన్నాడు భాస్కర్.

కిరణ్ తలపట్టుకున్నాడు.

"నీకో విషయం చెప్పనా! మోడీ అంటే ఎవరనుకున్నావు! సాక్షాత్తూ భగవంతుడి అవతారం! ఈ దేశాన్ని ఈ హిందూ మతాన్ని సముద్ధరించి విశ్వవ్యాపితం అవతరించిన పదకొండవ అవతారం! అన్నాడు భాస్కర్ తన్మయత్వంతో.

"అదేంటి బా! పదకొండవ అవతారం కల్కి అవతారమని, భాగవతంలో చదివాను వీరభోగ వసంత రాయలుగా మళ్లీ అవతరిస్తానని బ్రహ్మంగారు కాలజ్ఞానంలో చెప్పినట్లు గుర్తు కానీ మోడీ అవతారం ఉంటుందని ఏ పురాణంలో లేదు కదా!" అన్నాడు కిరణ్.

"అవన్నీ కాంగ్రెస్ వాళ్లు రాసిన తప్పుడు రాతలు! అందుకే పురాణాలన్నీ వాస్తవాలతో తిరగ రాయిస్తున్నాం! మోడీని పదకొండవ అవతారంగా మేమెప్పుడో గుర్తించాం! ఇప్పటికీ వాట్సాప్ సిలబస్‌లో ఇదంతా సంక్షిప్తం చేశాం! దేశం కూడా ఇప్పుడిప్పుడే మోడీ అవతార రహస్యాన్ని కనుగొంటోంది! జనవరి 22న రామ్‌లల్లా కళ్లను మోడీనే స్వయంగా తెరిపిస్తారు! ఇంకో విషయం ఏమిటంటే మోడీ ఆంజనేయుడి అవతారం కూడా! త్రేతాయుగంలో ఆంజనేయుడిగా ఉండి రాముల వారికి గుడి కట్టించలేదని బాధ ఆయనకు తీవ్రంగా ఉండింది! అందుకే ఆ కోరికను తీర్చుకునేందుకే మోడీ అవతారం ఎత్తి, రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారు.! అందుకే విధి స్వయంగా ఈ పుణ్య కార్యానికి మోడీని ఎంచుకున్నదని అద్వానీ చెప్పారు. మోడీ గుండె ల నిండా రాముడే ఉన్నాడు!" పారవశ్యంతో చెప్పాడు భాస్కర్.

"అవన్నీ కాంగ్రెస్ వాళ్లు రాసిన తప్పుడు రాతలు! అందుకే పురాణాలన్నీ వాస్తవాలతో తిరగ రాయిస్తున్నాం! మోడీని పదకొండవ అవతారంగా మేమెప్పుడో గుర్తించాం! ఇప్పటికీ వాట్సాప్ సిలబస్‌లో ఇదంతా సంక్షిప్తం చేశాం! దేశం కూడా ఇప్పుడిప్పుడే మోడీ అవతార రహస్యాన్ని కనుగొంటోంది! జనవరి 22న రామ్‌లల్లా కళ్లను మోడీనే స్వయంగా తెరిపిస్తారు! ఇంకో విషయం ఏమిటంటే మోడీ ఆంజనేయుడి అవతారం కూడా! త్రేతాయుగంలో ఆంజనేయుడిగా ఉండి రాముల వారికి గుడి కట్టించలేదని బాధ ఆయనకు తీవ్రంగా ఉండింది! అందుకే ఆ కోరికను తీర్చుకునేందుకే మోడీ అవతారం ఎత్తి, రామ్‌లల్లా విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేస్తున్నారు.! అందుకే విధి స్వయంగా ఈ పుణ్య కార్యానికి మోడీని ఎంచుకున్నదని అద్వానీ చెప్పారు. మోడీ గుండెల నిండా రాముడే ఉన్నాడు!" పారవశ్యంతో చెప్పాడు భాస్కర్.

అనుమానంగా చూశారు! కిరణ్, లక్ష్మి.

"హ్హు! మీకిప్పుడూ రుజువులు కావాలి. అంతే కదా! మోడీ గుండెల్లో రాముడున్నాడని నిరూపిస్తాను!" అన్నాడు ఆవేశంగా భాస్కర్.

"కొంపదీసి మోడీ గుండెలు చీల్చుతావా ఏంది బా?' భయంగా అన్నాడు కిరణ్.

"అవసరం లేదు! కంటెంట్ ఉంటే కటౌట్ గుండెల్లో కూడా రాముడు కనబడుతాడు చూడండి!" అంటూ భాస్కర్ గోడకు ఉన్న మోడీ ఫొటో తీసుకొచ్చాడు!

"మీ అనుమానం పటాపంచలవుతుంది చూడండి!" అంటూ ఫొటోలోని మోడీ గుండెను చీల్చాడు భాస్కర్.

అంతే అక్కడున్న వారి కళ్లు మిరుమిట్లు గొలిపే విధంగా దేదీప్యమానమైన కాంతి ప్రసరించింది! మోడీ గుండెల్లో ఒక ఆకారం మెల్లిగా రూపుదిద్దుకుంటున్నది. క్రమంగా ఆ ఆకారం దృగ్గోచరమైంది! ఆ ఆకారం సింహాసన రూపం దాల్చింది! అది ప్రధానమంత్రి ఆసనం! మెల్లిగా ఆ ఆసన రూపం కూడా చిన్నదై పోసాగింది! క్రమంగా పూర్ణ దృశ్యం ఆవిష్కృతమైంది ఆ ఆసనం వెనక అదానీ నిలబడి ఉన్నాడు"!

అది చూసి కిరణ్, లక్ష్మి కళ్లు తిరిగి పడిపోయారు.

- ఉషాకిరణ్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్


ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టరు ప్రఫుల్ దేశాయ్

నవతెలంగాణ - రామడుగు : అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా అదనపు కలెక్టరు ప్రఫుల్ దేశాయ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాన్ని సందర్శించారు. బూత్ స్థాయి అధికారులు ఫారం 6, 7, 8లతో ఉదయం నుంచి అందుబాటులో ఉండాలని అధికారులకు సూచించారు. ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, అభ్యంతరాలకు సంబందించిన దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. అనంతరం ప్రైమరీ స్కూల్‌ను సందర్శించి విద్యార్థుల చదువుతీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసీల్దార్ భాస్కర్, బూత్ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.


హైమాస్ లైట్ల ప్రారంభం


ప్రారంభిస్తున్న సర్పంచు వీర్ల సరోజనప్రభాకర్ రావు

నవతెలంగాణ - రామడుగు :
మండలంలోని వెలిచాల గ్రామంలోని స్వామి వివేకానంద విగ్రహం, శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవాలయం, పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద, సారలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను సర్పంచ్ వీర్ల సరోజన ప్రభాకర్ రావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పూదరి వెంకటేష్, వార్డు సభ్యులు వంగా రమన్, మీసా వెంకటేశం, బండపెల్లి శ్రీకృష్ణ, ఉప్పు చిలకమ్మ, మాజీ సర్పంచ్ శ్రీ వీర్ల రవీందర్ రావు, జిల్లా రైతు బంధు సమన్వయ కమిటీ సభ్యులు వీర్ల సంజీవ రావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షోభంలో 'గర్శకుర్తి' వస్త్ర పరిశ్రమ.!

- పెరిగిన ముడి సరుకు ధరలు
- చీరలకు తగ్గిన ఆదరణ.. నిలిచిన వస్త్రోత్పత్తి
- 'బతుకమ్మ చీరల' ఆర్డర్లపై నీలి నీడలు
- మళ్లీ మొదటికి చే'నేత' బతుకులు


వస్త్రోత్పత్తి లేక నిలిచిన సాంచెలు

నవతెలంగాణ - గంగాధర :
వస్త్రోత్పత్తికి అవసరమైన ముడి సరుకు ధరలు ఆకాశాన్నంటాయి. సాంచెలపై తయారు చేసే పాలిస్టర్, కాటన్, కలర్ చీరలకు కాలం చెల్లింది. ఆదుకునే దిక్కులేక కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామ చేనేత, పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమ మళ్లీ సంక్షోభంలో పడింది. ఓ వైపు బతుకమ్మ చీరల ఆర్డర్లపై నీలి నీడలు కమ్ముకోగా, మరో వైపు మార్కెట్‌లో సాంచెలపై తయారు చేసే పాలిస్టర్, కాటన్, కలర్ చీరలకు ఆదరణ తగ్గింది. దీంతో వస్త్ర వ్యాపారులు, ఆసాములు వస్త్రోత్పత్తిని నిలిపి వేయగా, కార్మికులు పనులు లేక అల్లాడుతున్నారు. రెండు నెలలుగా ఉత్పత్తులు నిలిచిపోయి గ్రామంలో నిశ్శబ్ద వాతావరణం నెలకొంది. చేనేత, పవర్ లూమ్స్ వస్త్ర పరిశ్రమలకు నిలయంగా మారిన గర్శకుర్తి గ్రామం సిరిసిల్ల తర్వాత స్థానంలో వేళ్లూనుకుని ఉంది. ఈ గ్రామంలో వస్త్రోత్పత్తిపై ఆధారపడి 6 వేల చేనేత కుటుంబాలు జీవిస్తున్నాయి. పనులు లేక దిగులు చెందిన నేతన్న కుటుంబాలకు చేతి నిండా పని కల్పించడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్టోబర్ 2023 వరకు స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తి, బతుకమ్మ చీరల ఆర్డర్లను కల్పించింది. తొమ్మిదేళ్లుగా ఇక్కడి వస్త్ర పరిశ్రమ బతుకమ్మ చీరల ఆర్డర్లతో బలపడగా, గత 3 నెలలుగా ముడి సరుకు ధరల పెంపు, సాంచెలపై ఉత్పత్తి అయ్యే కాటన్, పాలిస్టర్, కలర్ చీరలకు మార్కెట్‌లో డిమాండ్ లేక వస్త్ర పరిశ్రమ ఢీలా పడింది.

కదలని సాంచెలు..కలవరపడుతున్న కార్మికులు

ఏ రోజుకు ఆ రోజు పనులు చేస్తూ పొట్ట పోసుకునే తాము పనులు లేక వ్యాపారులు, ఆసాముల వద్ద అప్పులు చేసి కుటుంబ భారాన్ని నెట్టుకొస్తున్నామని కార్మికులు వాపోతున్నారు. ఫిబ్రవరి నుండి షురువయ్యే బతుకమ్మ చీరల ఉత్పత్తి సెప్టెంబర్ వరకు కొనసాగేవి. మరో 4 నెలలు ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా అందించే స్కూల్ యూనిఫామ్స్, రంజాన్ గుడ్డ ఉత్పత్తికి గత ప్రభుత్వం ఆర్డర్లను కల్పించింది. కాని ప్రస్తుత ప్రభుత్వం వస్త్ర పరిశ్రమపై ఆధారపడి జీవించే తమ కుటుంబాల స్థితిగతులపై పట్టించుకున్న దాఖలాలు లేకపోవడంతో చేనేత, పవర్ లూమ్స్ వ్యాపారులు, ఆసాములు, కార్మికులు దిగులు చెందుతున్నారు.

2022లో గర్శకుర్తి వస్త్ర పరిశ్రమలకు 20లక్షల మీటర్ల చీరల ఉత్పత్తికి ఆర్డర్లు కల్పించగా, 2023లో 32లక్షలా 26వేలా 750 మీటర్ల చీరల తయారికి ఆర్డరు కల్పించింది. 2023లో 2లక్షలా 13వేలా 860మీటర్ల స్కూల్ యూనిఫామ్స్, 24వేల మీటర్ల రంజాన్ గుడ్డ ఉత్పత్తికి ఆర్డర్లు లభించాయి. 2022లో ఇక్కడ 17 స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ (ఎస్ఎస్ఐ) యూనిట్లు ఉండగా, 2023లో మరో 16 కొత్త యూనిట్లకు ఆర్డర్లు కల్పించింది. మొత్తం 33 ఎస్‌ఎస్ఐ యూనిట్లలో సుమారు 945 పవర్ లూమ్స్‌పై గుడ్డ ఉత్పత్తి జరిగింది.

బతుకుదెరువు భారమైంది



పవర్ లూమ్స్‌పై తయారైన చీరలకు డిమాండ్ తగ్గి వ్యాపారులు, ఆసాములు సాంచెలకు బీములు ఇవ్వడం లేదు. సాంచెలు నడిపితెనే బతికె కార్మికులు పనులు లేక 3 నెలలుగా అవస్థ పడుతున్నరు. బతుకమ్మ చీరల ఆర్డర్లపై కొత్త ప్రభుత్వం క్లారిటి ఇవ్వక, కాటన్, పాలిస్టర్, కలర్ చీరలు నడవక సాంచెలు కదలడం లేదు. పభుత్వం పవర్ లూమ్స్ కార్మికులకు చేతినిండా పని కల్పించడానికి బతుకమ్మ చీరల తరహాలో ఆర్డర్లు కల్పించాలి.

-గడ్డం నారాయణ, చేనేత, పవర్ లూమ్స్ కార్మిక సంఘం అధ్యక్షుడు, గర్శకుర్తి

పనులు లేక దిగులు పడుతున్నం



సాంచెలపై నడిచే గుడ్డ ఉత్పత్తి పనులు లేక దిగులు పడుతున్న. బతుకమ్మ చీరల ఆర్డర్లు ఉన్నంత కాలం సాంచెలకు బీములు ఇచ్చిన వ్యాపారులు ఆ తర్వాత ఇవ్వడం లేదు. నాకు 8 సాంచెలు ఉన్నవి. ప్రస్తుతం బీములు లేక పనులు సాగడం లేదు. తనకున్న సాంచెలపై బతుకమ్మ చీరలు నడిపితే వచ్చే రోజు కూలీ రూ. 1000 బతుకమ్మ చీరలు లేక రాకుండా పోయింది.

-మిట్టపల్లి శ్రీనివాస్, పవర్ లూమ్ ఆసామి, గర్శకుర్తి

వైపని లేక దిగులు చెందుతున్న



వైపని చేసే తనకు పనులు లేక పస్తులుండే పరిస్థితులు వచ్చినయి. సాంచెలపై బతుకమ్మ చీరల ఉత్పత్తి అవుతేనే తమకు చేతినిండా పని దొరికేది. బతుకమ్మ చీరల ఉత్పత్తి ఆగిపోవడంతో వైపని పనులు లేక తనకు రోజు వచ్చే కూలీ రూ. 600 కూడా రాకుండా పోయింది. బతుకమ్మ చీరల ఉత్పత్తి నిలిచి పోయి కుటుంబం వీధిన పడే పరిస్థితులు ఏర్పడ్డయి.

-బైరి దేవదాస్, వైపని కార్మికుడు. గర్శకుర్తి

పనులు లేక బతుకే వీధిన పడ్డం



4 మాసాలుగా సాంచెల పనులు లేక తాను, తన కుటుంబం వీధిన పడింది. రోజు సాంచెలు నడిపితేనే కుటుంబం పొట్టపోసుకుంటుంటే పనులు లేక పస్తులుండే పరిస్థితులు దాపురించినవి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పవర్ లూమ్స్‌కు బతుకమ్మ చీరల ఆర్డర్లు కల్పించి ఆదుకుంటేనే తనలాంటి కార్మికులకు చేతినిండా పని ఉంటుంది.

-గాజుల మల్లేశం, పవర్ లూమ్స్ కార్మికుడు, గర్శకుర్తి

పదవీ కాలం పెంచి బిల్లులు చెల్లించాలి

ఎంపీడీవోకు సర్పంచ్‌ల వినతి


ఎంపీడీవోకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సర్పంచులు

నవతెలంగాణ - రామడుగు :
పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేస్తూ రెండు సంవత్సరాలు పదవీ కాలం పెంచాలని కోరుతూ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బండ అజయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సర్పంచులు ఎంపీడీవో వై.భాస్కర్ రావుకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్పంచులుగా గెలిచిన తొమ్మిది నెలలకు చెక్ పవర్ రాకపోవడంతో పాటు, కరోనా మహమ్మారికి రెండు సంవత్సరాల కాలం వృథా అయిందన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధి నిధులు 20నెలల నుంచి, కేంద్ర ఆర్థిక నిధులు 14నెలల నుంచి రాక తీవ్ర ఇబ్బందులెదుర్కొని అప్పులపాలయ్యామన్నారు. వెంటనే పెండింగ్ నిధులు, బిల్లులు మంజూరు చేసి సర్పంచుల పదవీకాలం పెంచాలని సర్పంచులు కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి ప్రశంస

ఐఐఎస్ఎఫ్ 2023లో నేషనల్ సైన్స్ టీచర్స్ వర్క్ షాప్‌కు ఎంపికైన ఓదెలు కుమార్


ప్రయోగాలు చేస్తున్న ఓదెల కుమార్

నవతెలంగాణ - తిమ్మాపూర్ : హర్యానాలోని ఫరితాబాద్ (రీసెర్చ్ ఆఫ్ బయోటెక్నాలజీ యూనివర్సిటీ)లో శాస్త్రవేత్తలచే ఓదెల కుమార్ ప్రశంసలను అనుకున్నారు. పరిసరాలలో దొరికే పనికిరాని వస్తువుల నుంచి సైన్స్ కృత్యాలను, ఎలా తయారు తయారు చేయవచ్చునో ఆయన వివరించారు. తద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా ఎలా బోధించవచ్చునో సూచించారు. తాను తయారుచేసిన రెండు ప్రయోగాలను శాస్త్రవేత్తలు, యూనివర్సిటీ ఛైర్మెన్స్ ముందు ప్రదర్శించడంతో ఆయనను అభినందించారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : పదో తరగతి విద్యార్థులపై తల్లిదండ్రులు ఇంటి వద్ద ఉదయం సాయంత్రం చదివేల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణరావు కోరారు. మండలంలోని నేదునూరు గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో శనివారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 29న ఎస్ఎంసి ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, అలాగే ఎన్నికల్లో 100శాతం తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, జాకీర్ హుస్సేన్, గని, పద్మ ఫాతిమా, అమల, ప్రభాకర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎల్ఎండీ ఎస్ఐని కలిసిన బీజేపీ నాయకులు


ఎస్సైని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ : ఎల్ఎండీ ఎస్ఐగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన చేరాలును శనివారం తిమ్మాపూర్ బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో నాయకులు కలిశారు. శాలువాతో సన్మానం చేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శులు కిన్నెర అనిల్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి, మండల కార్యదర్శి గడ్డం శ్రీనివాస్ రెడ్డి,బిజెవైఎం అధ్యక్షులు గడ్డం అరుణ్,సీనియర్ నాయకులు ఎడ్ల భూంరెడ్డి ఎస్ఐ ని కలిసిన వారిలో ఉన్నారు.

మైనారిటీ పాఠశాల, కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రిన్సిపల్ ప్రణీత

నవతెలంగాణ - జమ్మికుంట : జమ్మికుంటు-ఇందిరానగర్ మైనార్టీ పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికిగాను అడ్మిషన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపల్ ప్రణీత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరానికిగాను సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులలో అడ్మిషన్లకు అర్హులైన వారినుంచి ఈ నెల 18వ తేదీ నుంచి ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆమె తెలిపారు. కావున ఆన్‌లైన్ అడ్మిషన్ల కోసం టీయంఆర్ఐ ఈఎస్ జీఓవీ ఐఎన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7995057899 సంప్రదించాలని సూచించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

మార్కెట్ మాజీ చైర్మెన్ తుమ్మేటి


పూల మాలలు వేస్తున్న తుమ్మేటి సమ్మిరెడ్డి

నవతెలంగాణ - జమ్మికుంట : మున్సిపాలిటీ పరిధిలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు జమ్మికుంట మేజర్ గ్రామపంచాయతీ మాజీ ఉప సర్పంచ్, మాజీ కౌన్సిలర్ పొనగంటి శంకరయ్య ఇటీవల మృతి చెందగా శనివారం జమ్మికుంట మార్కెట్ మాజీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మృతుని ఫోటోకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. హుజురాబాద్ పట్టణ అధ్యక్షులు సొల్లు బాబు తల్లి ఇటీవల మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. దశదిన కర్మకు హాజరై మృతురాలి ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, నాయకులు యండి సలీం, నాగేంద్ర పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

జిల్లా మహిళా సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత

నవతెలంగాణ - చొప్పదండి : మహిళల కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు వినియోగించుకోవాలని జిల్లా మహిళ సాధికారిక కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కవిత సూచించారు. మండలంలోని దేశాయిపేట గ్రామపంచాయతీలో శనివారం మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలపై, ఆడపిల్లలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, టోల్ ఫ్రీ నెంబర్స్181,1098,14567 వివిధ శాఖలపై అవగాహన కల్పించారు. మహిళలతో చర్చించిన అంశాలు డి హెచ్ ఈ డబ్ల్యు, లింగ సమానత్వం, లింగ వివక్ష, బాలిక విద్య యొక్క ప్రాముఖ్యత. బాల్య వివాహాల నిషేధ చట్టం2006, ఫోక్సో చట్టం 2012, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్1930. సఖి సేవలు, మహిళ హెల్ప్ లైన్181. పోలీస్ హెల్ప్ లైన్100 షీ టీం సేవ లు. సుకన్య సమృద్ధి యోజన పథకం. మహిళల సమ్మాన్ పొదుపు పథకాలు, పిఎం ఈజిపి పథకం, మహిళలకు సాధికారి త, ఆర్థిక వృద్ధి అభివృద్ధి, ఆర్థిక నెలవారీ పొదుపు, పీఎంఎంవీవై, అటల్ పెన్షన్ యోజన పథకం మేము హబ్ వ్యాపారం చేయాలనే ఆలోచన ఉన్న మహిళలు ఆర్థికంగా లేనివారు, రుణం తీసుకొని వారి సహకారంతో వ్యాపారం ప్రారంభించి మహిళా సాధికారి త సాధించేందుకు వీ హబ్‌కు తమ సహకారం ఉంటుందని వివరించారు.

శ్రీ చైతన్యలో మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

నవతెలంగాణ - కరీంనగర్ :
కరీంనగర్‌లోని స్థానిక మంకమ్మతోటలో గల శ్రీచైతన్య డిగ్రీ, పీజీ కళాశాలలో సాహితీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం జరిగిన మెగాజాబ్ మేళాకు విశేష స్పందన లభించిందని కళాశాల చైర్మెన్ ముద్దసాని రమేష్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథిగా హాజరైన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. విద్యార్థులు నిర్దిష్ట లక్ష్యం ఏర్పరుచుకొని నిరంతర కృషితో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కళాశాల చైర్మెన్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ..35 ప్రముఖ కంపెనీలు వివిధ పోసిషన్స్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా 1600 మంది అభ్యర్థులు పాల్గొన్నారు. వివిధ దశలలో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూలో సుమారు 300 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాతవాహన యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ ఎన్వీ శ్రీరంగ ప్రసాద్, ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిషోర్, విన్నర్స్ పబ్లికేషన్ అండ్ ఆన్‌లైన్ ఫౌండర్ ప్రసన్న హరికృష్ణ, సాహితీ ఫౌండేషన్ ఫౌండర్ రాముల కుమార్, కళాశాల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎల్.శ్రీనివాస్, డాక్టర్ వి.స్వర్ణలత, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.కృష్ణారెడ్డి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యం

ఎస్‌యూ పరిపాలనా భవన ప్రారంభం వాయిదా వేయాలి

నవతెలంగాణ - భగత్ నగర్ :
శాతవాహన విశ్వవిద్యాలయ పరిపాలనా భవనం ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయాలని కోరుతూ ఎస్ఎస్‌యుఐ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మునిగంటి అనిల్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎస్.మల్లేష్ పదవీకాలం మే నెలతో ముగుస్తున్న సమయంలో అసంపూర్తిగా, నాసిరకంగా నిర్మించిన ఈ భవనాన్ని ప్రారంభించడానికి ఏర్పాట్లు చేస్తున్నారని ఆరోపించారు. ఈ నిర్మాణం సీపీడబ్ల్యు (సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్) వారిచే కాకుండా, లోకల్ ఏజెన్సీ (తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్, కరీంనగర్) కాంట్రాక్టర్ చే గత ప్రభుత్వపు పెద్దల సిఫారసుచే నిర్మాణం చేపట్టారని, ఈ నిర్మాణం పూర్తిగా నాసిరకంగా చేశారని అన్నారు. ఈ నిర్మాణంపై అనేక అనుమానాలు ఉన్నందున, సంబంధిత శాఖాధికారులచే క్వాలిటీ కంట్రోల్ తనిఖీ చేయాలని, అప్పటివరకు భవన ప్రారంభోత్సవాన్ని వాయిదా వేయాలని లేదా కొత్త వీసీ నియామకం అనంతరం చేయాలని కోరారు.

ఆటో డ్రైవర్లను ఆదుకోవాలి

ఏఐఆర్టీడబ్ల్యుఎఫ్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ - తిమ్మాపూర్ :
కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న లారీ, డీసీఎం, టిప్పర్, రెడీమిక్స్, తూఫాన్, టాటా ఏసీ , మినీ వ్యాన్ ,జీపు ,క్యాబ్, గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్, ఆటో డ్రైవర్లు స్కూల్ బస్సు ,ప్రైవేట్ బస్సు ,ట్రాక్టర్ అన్ని రకాల వాహనాల డ్రైవర్లతో ఈ నెల 25న తెలంగాణ చౌక్ నుండి ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తిమ్మాపూర్ రవాణా శాఖ కార్యాలయంలో కరీంనగర్ జిల్లా పబ్లిక్ అండ్ ప్రైవేటు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డిటిఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆల్ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పున్నం రవి మాట్లాడుతూ.. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్లకు నష్టం చేసే సెక్షన్లు కేంద్ర ప్రభుత్వం "భారత న్యాయ సంహిత" చట్టాన్ని తెచ్చారన్నారు. ఈ చట్టంలోని సెక్షన్ 106(1)(2) చట్టాన్ని రద్దు చేయాలని ద్వారా శిక్షలను పెంచారనీ, ప్రమాదం జరిగిన సమయంలో రక్షణ కోసం స్పాట్లో డ్రైవర్ వెళ్లి పోతే అటువంటి ఘటనలకు "హిట్ అండ్ రన్" రూ.7లక్షల వరకు జరిమానా, పదేండ్ల జైలు శిక్ష ఈ చట్టంతో అమల్లోకి వస్తే డ్రైవర్లు బతుకులు జైలు పాలువుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడానికి స్వాగతిస్తున్నాంకానీ ఈ నిర్ణయం వల్ల ఆటోలో ప్రయాణించే వారి సంఖ్య పూర్తిగా తగ్గిపోయిందని, ఫలితంగా ఆటోడ్రైవర్లకు పూట గడవడం కష్టంగా మారిందన్నారు. డ్రైవర్లకు ఇండ్ల స్థలాలు, గృహ నిర్మాణం కోసం ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ పట్టణ లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షులు ఎంకే, ఆరిఫ్ మొహియుద్దీన్, ప్రధాన కార్యదర్శి ఎలకపల్లి రమేష్, స్కూల్ వ్యాన్ డ్రైవర్స్ బల్ది మల్లేశం, పంతంగి తిరుపతి,ఎం జహంగీర్, దయ్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాలకవర్గానికి సర్పంచ్ అభినందనలు


గ్రామ పాలకవర్గాన్ని అభినందిస్తున్న సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య

నవతెలంగాణ - జమ్మికుంట : మండలం పాపయ్యపల్లి గ్రామ సర్పంచ్ వజ్జపల్లి ఆగయ్య గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానించి, జ్ఞాపికలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఆగయ్య మాట్లాడారు. పాపయ్యపల్లి గ్రామం ఒకప్పుడు ఉమ్మడి గ్రామ పంచాయతీగా బిజిగిరి షరీఫ్‌లో ఉండేది అన్నారు. పాపయ్యపల్లి గ్రామాన్ని అప్పుడు ఉన్న ప్రభుత్వం 2018లో గ్రామాల పునర్విభజనలో భాగంగా నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటు చెందిందన్నారు. నూతన గ్రామపంచాయతీ మొట్ట మొదటిసారిగా అవకాశం కల్పించి నన్ను గ్రామ సర్పంచిగా ఎన్నుకున్నగ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గం, గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించి, ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతోపాటు గ్రామంలో వార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించుకున్నామని తెలిపారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వారి నమ్మకాన్ని వొమ్ము చేయకుండా అభివృద్ధి చేశామన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేయాలంటే ఏ గ్రామమైన ఆ గ్రామం పాలకవర్గ సహాయ సహకారాలు, సూచనలు ఉండడం వల్లే ఆ గ్రామం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండెకారి రాము, గుండెకారి సరోజన, మీసాల శంకర్, ఆరెపల్లి స్వరూప, వజ్జపల్లి రాజు, తొర్నే సంజీవరావు, సూరం రవీందర్, శనిగరపు స్రవంతి, పంచాయతీ కార్యదర్శి క్రాంతి కుమార్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్య కార్పోరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

నవతెలంగాణ - కరీంనగర్ : ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న శ్రీచైతన్య కార్పొరేట్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ అన్నారు. శనివారం నగరంలోని స్థానిక మంకమ్మతోటలో గల ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ మాట్లాడుతూ.. కరీంనగర్ పట్టణంలో కార్పొరేట్ శ్రీచైతన్య పాఠశాల ముందస్తు అడ్మిషన్లు చేస్తూ నిబంధనలను తుంగలో తొక్కుతుందన్నారు. ఈ టెక్నో కరికులం పేరుతో తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని, అకాడమిక్ ప్రారంభం కాకముందే తల్లిదండ్రులకు మాయ మాటలు చెబుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని తెలిపారు. శ్రీచైతన్య వివిధ జిల్లాలోని బ్రాంచీల విద్యార్థులను ర్యాంకుల కోసం ఐపీఎల్ పాఠశాలలోకి తీసుకువచ్చి వారిని మానసిక ఒత్తిడికి గురిచేస్తూ విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. సెలవు దినాలలో కూడా పాఠశాలలను నడిపిస్తున్నారని అన్నారు. కనీసం జిల్లాలో ఉన్న విద్యాశాఖ అధికారి వీటిని ఎందుకు పట్టించుకోవడం లేదని? ప్రశ్నించారు. ఇప్పటికైనా జిల్లా అధికారి స్పందించి వారిపై చర్యలు తీసుకోకుంటే రానున్న రోజుల్లో పోరాటం చేసి కార్పొరేట్ శ్రీచైతన్య పాఠశాలలను మూసి వేసేంత వరకు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు కాంపల అరవింద్, నగర నాయకులు ఇషాక్, రాకేష్, కుమార్, చందు పాల్గొన్నారు.

గాలన్నకు నివాళుర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి

నవతెలంగాణ - తిమ్మాపూర్ : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకురాలు బొడిగె శోభ భర్త గాలన్న ఆకస్మిక మృతికి మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శనివారం సైదాపూర్ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామానికి వెళ్లి బొడిగ శోభను ఆయన పరామర్శించారు. అంతేకాకుండా గాలన్న అంతిమయాత్రలో పాల్గొని కడసారి నివాళులు అర్పించారు.

అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు


అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు

నవతెలంగాణ - సైదాపూర్ : మండలంలోని వెంకటేశ్వర పల్లి గ్రామంలో బొడిగె గాలన్న భౌతిక కాయానికి నివాళులర్పించిన బీజేపీ జాతీయ నాయకులు మాజీ మంత్రివర్యులు ఈటల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సతీమణి బండి అపర్ణ, కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు తదితరులు బోడిగే గాలన్న అంతిమయాత్రలో పాల్గొన్నారు.

6

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక

జగిత్యాల

ఆదివారం | జనవరి 21, 2024 | www.navatelangana.com

ఓటర్ లిస్టులో తప్పులను సరి చేయాలి

- తహసీల్దార్ ప్రసాద్

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఓటర్ లిస్ట్‌లో తప్పులను సరి చేయాలని తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని తిమ్మాపూర్, యామాపూర్ పోలింగ్ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఫాం ఆర్‌లో 18 నుంచి ఏండ్ల యువతీయువకుల వివరాలు నమోదు చేయాలన్నారు. డెత్ లిస్టుతో పాటు డెత్ సర్టిఫికెట్ ఇన్ క్లోజ్ చేయాలన్నారు. పెళ్లి జరిగి పూర్తిగా వెళ్లిపోయిన వాళ్లకు ఫామ్8 ద్వారా సిట్టింగ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


బీఎల్‌ఓలకు సూచనలు చేస్తున్న తహసీల్దార్

ఉచిత శిక్షణకు గడువు పొడగింపు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

కరీంనగర్ బీసీ స్టడీసర్కిల్‌లో గ్రూప్-1,2,3,4 ఫౌండేషన్ కోర్సుకు ఉచిత శిక్షణ దరఖాస్తులు ఈనెల 24 వరకు పొడిగించినట్టు స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెబ్ సైట్ bcstudycircle. cgg.gov.inలో ఈ నెల24లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. డిగ్రీ అర్హత కలిగిన ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువతీయువకులు దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించరాదని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, లేటెస్ట్ కుల, ఆదాయ ధృవీకరణపత్రాలు ఆధార్ కార్డ్, ఫొటోలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని, అభ్యర్థుల ఎంపిక రిజర్వేషన్, డిగ్రీలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక ఉందని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెంబర్ : 0878 - 2268686, లేదా బీసీ స్టడీ సర్కిల్ నూతన భవనం, కరీంనగర్ కార్యాలయం ఆఫీసు వేళల్లో సంప్రదించాలని సూచించారు.

పంచాయతీల్లో 'ప్రత్యేక' పాలన.?

- నెలాఖరుతో ముగియనున్న సర్పంచుల పదవీకాలం
- ఎన్నికల నిర్వహణపై అయోమయం
- పార్లమెంట్ ఎన్నికలపైనే పార్టీల ఫోకస్

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

గ్రామ పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన తప్పేలా లేదు. ప్రస్తుత సర్పంచుల ఐదేళ్ల పదవీకాలం ఈనెల 31తో ముగి యనుంది. పంచాయతీ ఎన్నికల దిశగా ఇప్పటి వరకు ఎలాంటి కార్యాచరణ ప్రారంభించక పోవడంతో పంచాయతీల నిర్వహణ బాధ్యత ప్రత్యేకా ధికారులకు అప్పజెప్పడం ఖాయమని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే జిల్లా అధికార యంత్రాంగం ఎన్నికల నిర్వహణకు కసరత్తు మొదలు పెట్టింది. జగిత్యాల జిల్లాలో మొత్తం 380 గ్రామ పంచాయతీలుండగా, 3500 వార్డుల ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బంది వివరాలను గత డిసెంబర్‌లోనే సేకరించింది. ఓటర్ల సంఖ్యను గుర్తించడంతోపాటు 650 మంది ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం చొప్పున ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బందిని ఏర్పాటు చేశారు.



వారికి అవకాశం లేని కొత్త చట్టం..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోపు ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేదంటే ప్రత్యేకాధికారులను నియమించి పల్లెపాలనను కొసాగించాల్సి ఉంటుంది. ప్రస్తుతం సర్పంచుల పదవీకాలం పూర్తైన తదనంతరం ఆయా పాలక వర్గాలను పర్సన్ ఇన్‌చార్జులుగా కొసాగించేందుకు కొత్త చట్టం అనుమతించడం లేదు. అలా వారిని నియమించాలంటే అసెంబ్లీలో చట్టసవరణ లేదా ఆర్డినెన్స్‌ను తేవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

రిజర్వేషన్లపై సందిగ్ధం..

పదేళ్లపాటు రిజర్వేషన్లు ఉండేలా నూతన పంచాయతీ రాజ్ చట్టంలో పొందు పర్చారు. 2018 సంవత్సరంలో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్లు పదేళ్లపాటు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం బీసీల రిజర్వేషన్లను పెంచుతామని ఎన్నికల హామీలో ప్రకటించింది. బీసీ గణన చేపట్టి ఆయాగణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు నిర్ధారిస్తామని వెల్లడించింది. పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు తప్పనిసరిగా కనిపిస్తుంది. ఈ విషయంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటివరకు సందిగ్ధత కొనసాగుతుంది.

మండల స్థాయి అధికారులతో..

గ్రామపంచాయతీలకు మండల స్థాయి అధికారులను నియమించ నున్నట్లు సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని శాఖలకు చెందిన అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించాలనే ఆలోచనలో జిల్లా యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా మండల పరిషత్‌లోని సూపరింటెండెంట్, ఎంపీవో, వ్యవసాయ అధికారులు, పశు వైద్యాధికారులు, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నారు. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

లోక్‌సభ ఎన్నికలే టార్గెట్..

షెడ్యూల్ ప్రకారం వచ్చే ఏప్రిల్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి నెలాఖరు లేదా మార్చి మొదటి వారంలో కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉండడంతో అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్, తదితర రాజకీయ పక్షాలు లోక్‌సభ ఎన్నికలపైనే దృష్టి సారించాయి. ఇప్పటికే ఆయా పార్టీలకు చెందిన నాయకులతో సమావేశాలు నిర్వహించడం, ఎన్నికల్లో గెలుపు వ్యూహాలు రచించడంపై ఫోకస్ పెట్టాయి.

జిల్లాలో పంచాయతీలు ఇలా....

జిల్లాలోని 18 మండలాల్లో 380 గ్రామ పంచాయతీలు, ఇందులో 3500 వార్డులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 699173 ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 361254 మంది, పురుషులు 337919 మంది ఉన్నారు.జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి లతోపాటు వేములవాడ, చొప్పదండి నియోజక వర్గాలు న్నాయి. గత ప్రభుత్వంలో ఈ ఐదు నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. అంతేకాకుండా ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ మంత్రిగా కూడా కొనసాగారు. అయినా గాని జిల్లాలో సర్పంచులకు పెండింగ్ బిల్లులు గుదిబండగానే ఉన్నాయి. జిల్లాలో మెజార్టీ సర్పంచులు అధికార పార్టీకి చెందిన వారే ఉండడం గతంలోని ఎమ్మెల్యేలు కూడా అధికార పార్టీకి చెందిన వారే ఉన్న సర్పంచులకు పెండింగ్ బిల్లులు భారీగానే రావాల్సి ఉండడం శోచనీయం. జిల్లాలో సర్పంచులకు సుమారు 15 కోట్ల వరకు పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని సమాచారం.

లారీల పార్కింగ్ కోసం స్థలం ఇవ్వాలి

ఎమ్మెల్యేను కోరిన అసోసియేషన్ సభ్యులు


ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల పట్టణ లారీ అసోసియేషన్ సభ్యులు జగిత్యాల ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిసి లారీల పార్కింగ్ కోసం స్థలం కేటాయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి, స్థల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ దేశాయ్, లారీ అసోసియేషన్ అధ్యక్షుడు కలీం, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర


మాట్లాడుతున్న సర్పంచ్

నవతెలంగాణ- కొడిమ్యాల

మండలంలోని నరసింహులపల్లి గ్రామంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పథకాలపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎగుర్ల తిరుపతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సీహెచ్ఓ రాజశేఖర్, బ్యాంకు అధికారి కోట మధుసూదన్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన


క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ రణధీర్ గుప్తా

నవతెలంగాణ -మెట్‌పల్లి

మెట్‌పల్లి పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం క్యాన్సర్‌పై డాక్టర్ రణధీర్ గుప్తా అవగాహన కల్పించారు. విద్యార్థులు విటమిన్స్ లోపాలు లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శరీరంలో గడ్డలు ఏర్పడి అవి పెరుగుతూ.. ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. పొగాకు, గుట్కా నమలడం వల్ల ఏర్పడే గాయాల కారణంగా కేన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. చెడు అలవాటు లేదు.. నాకు క్యాన్సర్ రాదు అని అనుకోవడం అపోహనేనని, మనం తినే ఆహారపదార్థాల వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఏమైనా అనుమానం ఉంటే తక్షణమే డాక్టర్‌ను సంప్రదించలన్నారు. విద్యార్థులు రోజు పల్లి పట్టీలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు దొంతుల ఆంజనేయులు, కోశాధికారి ఇల్లెందుల శ్రీధర్, ఆర్సీ శివ శ్రీనివాస్, జడ్సీ గంగుల మురళి, ఎంతఓ కనకతార, గడ్డం శంకర్‌రెడ్డి, పోలీస్ శ్రీనివాస్, వెంకటేశం, ఆల్ రౌండర్ గంగాధర్ పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళలు

భీమారంలో వికాసిత్ భారత్ సంకల్పయాత్ర

నవతెలంగాణ-మేడిపల్లి

భీమారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణంలో వికాసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రచార వాహన ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెక్కపెల్లి అరుణ, ఉపసర్పంచ్ బస్వరాజుల రాజు,ఎంపీటీసీ పల్లి అర్జున్,కార్యదర్శి లక్ష్మి, వార్డు సభ్యులు బక్కురీ నరేశ్, సంజీవ్,స్వామి,జమునబీ, సుష్మిత, వివిధ మండల శాఖల అధికారులు, సూపర్ వైజర్,, అంగడివాడీ సూపర్ వైజర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు



ఉచిత రక్త నిర్ధారణ పరీక్షలు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని వేములకుర్తి గ్రామంలో మార్కండేయ రైస్ డిపో, ఇబ్రహీంపట్నం పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు చాట్ల గణేష్ ఆధ్వర్యంలో శనివారం ల్యాబ్ రెటరీ రాంపెల్లి బాలరాజు 6 నుంచి పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా రక్త నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. కాగ 100 మంది విద్యార్థులు వారి బ్లడ్ గ్రూప్‌ని తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు కోదండ పాణి, రాంపెల్లి బాలరాజు, రాధారపు దేవదాస్, మాజి వీడీసీ చైర్మన్ నాంపల్లి వేంకటాద్రి,గ్రామ అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ కుంచాల రాజన్న ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వరద కాలువలో మృతదేహం లభ్యం

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం



ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గ్రామమైన రాజేశ్వరరావు పేట గ్రామ శివారులో ఉన్న వరద కాలువలో మృతదేహం లభ్యమయ్యింది. కాగా మృతుడు కోరుట్ల పట్టణానికి చెందిన ఈర్నాల శ్రీనివాస్ (43)గా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శతాధిపతి వృద్ధురాలి మృతి

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని బర్దిపూర్ గ్రామానికి చెందిన కానూరి లింగవ్వ(100) శనివారం తెల్లవారు జామున మృతి చెందింది. ఇంతకాలం బతికిన లింగవ్వ అందరితో చలాకీగా ఉండేదని గ్రామస్తులు చెబుతున్నారు. గ్రామంలో 100 సంవత్సరాల పైగా బ్రతకడం ఎంతో గొప్ప విషయమని సర్పంచ్ సంఘం సాగర్ అన్నారు.

6 గ్యారంటీ పథకాలను అమలు చేస్తాం

నవతెలంగాణ-సారంగాపూర్

ఆర్థికంగా ఎంత ఇబ్బంది ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన 6 గ్యారంటీ పథకాలను కచ్చితంగా అమలు చేస్తామని ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం సారంగాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, పట్టభద్రుల ఎమ్మెల్సీ టి. జీవన్ రెడ్డిలతో కలిసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. లక్ష్మీదేవిపల్లె, ధర్మానాయక్ తండా, కొనాపూర్, నాగనూర్ గ్రామాల్లో నూతన గ్రామపంచాయతీ భవనాలకు శంకుస్థాపన తోపాటు పెంబట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. సారంగాపూర్ ఎంపీపీ కోల జమున, బీర్పూర్ ఎంపీపీ మసర్తి రమేష్, మనోహర్ రెడ్డి,సర్పంచులు పాంపర్తి లక్ష్మి, ఆకుల జమున, భూక్యా,సంతోష్,రాజన్నదమ్మ గంగు, ఎంపీటీసీలు మమత, విమల, ఉప సర్పంచ్‌లు రాజేశ్వరి,గగులోతు లీల, తోడేటి పుష్ప లత, జంగ రాజన్న, వైస్ ఎంపీపీ సురేందర్, పాక్స్ చైర్మన్‌లు నరసింప రెడ్డి, మల్లారెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ బాపి రాజు,ఎంపీటీసీ ఫోరం అధ్యక్షులు సుధాకర్ రావు, మండల కో ఆప్షన్ అమీర్, ఈఈ రహమాన్, డీఈ మిలింద్, ఎంపీడీవో రాజేందర్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు గుర్రాల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో రూ.500 వసూలు

- విద్యార్థులు సెలవుల నుంచి ఆలస్యంగా వచ్చారని..
- రూ. 500 ఇస్తే ఆర్.సి.ఓ అనుమతి అవసరం లేదు..

నవతెలంగాణ-రాయికల్

ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల చెల్లించలేకనే తల్లిదండ్రులు తమ పిల్లలను గురుకులాల్లో చేర్పితే .. సంక్రాంతి సెలవుల నుంచి ఆలస్యంగా వచ్చారని, ఫైన్ల పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ నెల 12 నుంచి 17వ తేదీ వరకు ప్రభుత్వం అన్ని పాఠశాలలకు సంక్రాంతి సెలవులను ప్రకటించింది. పండగకు ఇంటికి వెళ్ళిన విద్యార్థులు ఈ నెల 19వ తేదీన తిరిగి పాఠశాలకు రావడంతో ఒక రోజు పాఠశాలకు ఆలస్యంగా వచ్చారని, ఆలస్యంగా వచ్చినందుకు రూ.500 చెల్లించాలని లేకపోతే తిరిగి ఇంటికి తీసుకవెళ్లాలని మండలంలోని సింగర్‌రావుపేట (అల్లీపూర్) మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల(బాలురు) సిబ్బంది తెలపడంతో హవాక్కైన విద్యార్థుల తల్లి దండ్రులు చేసేదేమి లేక రూ.500 చెల్లించామని నవతెలంగాణకు తెలిపారు. ఆర్థిక పరిస్థితులు బాగా లేక పిల్లలను గురుకులాల్లో చేర్పితే సెలవుల నుంచి ఆలస్యంగా వచ్చారని సోమవారం వచ్చే విద్యార్థులకు అయితే రూ.1000 తీసుకుంటామని లేకపోతే కరీంనగర్‌లోని రీజినల్ కో ఆర్డినేటర్ అనుమతి తీసుకొని విద్యార్థులను పాఠశాలకు తీసుకరావాలంటూ సిబ్బంది వాదించడంతో విద్యార్థులను ఏదైనా ఇబ్బందులకు గురి చేస్తారేమో అని అడిగినంత ఇవ్వాల్సి వస్తుందని తల్లిదండ్రులు వాపోయారు. గత సంక్రాంతి సెలవుల తర్వాత సైతం రోజుకు రూ.100 చొప్పున రూ.200 ఇచ్చామని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థుల నుంచి డబ్బుల వసూళ్లపై సంబంధిత పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట రమణను వివరణ కోరగా డబ్బులు తీసుకుంటున్న విషయం తన దృష్టికి వచ్చిందని, మొదటి రోజు వచ్చిన విద్యార్థుల నుండి తీసుకోమని, వసూళ్ల చేసిన డబ్బులు కూడా విద్యార్థుల హౌస్ మనీ క్రిందనే జమ చేస్తామని, విషయం నవతెలంగాణ దృష్టికి వచ్చిందని, వసూళ్ల చేసిన నగదును విద్యార్థుల హౌస్ మని కిందనే జమ చేస్తామని, అవసరం ఉంటే తల్లి దండ్రుల అనుమతితోనే పాఠశాల అభివృద్ధికి వినియోగిస్తామని తెలిపారు. సెలవుల అనంతరం విద్యార్థులను ఆలస్యంగా పంపకూడదనే ఉద్దేశ్యం తోనే అలా చేస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ ప్రిన్సిపాల్ విజేందర్ మాట్లాడుతూ.. విద్యార్థుల నుంచి తీసుకున్న నగదును వారి ఖాతాలోనే జమ చేసి విద్యార్థుల అవసరాలకే ఉపయోగిస్తామన్నారు.



తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లా కేంద్రంలోని పురాణిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ఆధ్వర్యంలో క్యాలెండర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలన్నారు. తద్వారా ఉన్నత పాఠశాలలో సైతం విద్యార్థుల నమోదు పెరుగుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రభుత్వం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం విద్య ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కొఠారి కమిషన్ సూచనలకు అనుగుణంగా బడ్జెట్‌లో విద్యకు కేటాయింపులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుకోవేలా శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్, ఉపాధ్యక్షుడు డాక్టర్ టి.శ్రీనివాస్, కోశాధికారి మానుపాటి బన్నా, కార్యదర్శులు ఆగమయ్య, పి.వి. ప్రసాద్, శ్రీధర్,కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్ కొండ్రు అనిల్, సిరిపురం శ్రీనివాస్, బల్ల సత్య నారాయణ, గోపి, చిరంజీవి, శ్యామకూర శ్రీనివాస్, ఓజ్జ శ్రీనివాస్, మధు సూదన్, భరత కుమార్ తదిరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

సెల్ ఫోన్ పోతే ఆందోళన వద్దు

- పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయండి
- జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు
- జిల్లా వ్యాప్తంగా 198 ఫోన్లు బాధితులకు అందజేత

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

సెల్ ఫోన్ పోయినా.. చోరీకి గురైనా ఆందోళన చెందవద్దని సీఈఐఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చోరి గురైన 32 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ.. పోయినా లేదా చోరీకి గురైనా మొబైల్ ఫోన్లను త్వరితగతిన గుర్తించేందుకు సీఈఐఆర్ వెబ్‌సైట్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30 లక్షల విలువ గల 198 మొబైల్స్ ఈ పోర్టల్ ద్వారా రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు. సీఈఐఆర్ ఆవశ్యకతను తెలుపుతూ ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మొబైల్ నెంబర్, మీ సేవ రసీదు, ఐఎంఈఐ మొదలగు వివరాలతో ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఇలా నమోదు చేయడం ఐఎంఈఐ ద్వారా ఫోన్ బ్లాక్ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఫోన్‌లో సిమ్ కార్డ్ వేసుకుంటే ట్రేస్ రిపోర్టు వస్తుందని, దీని ఆధారంగా పోయిన మొబైల్ లోకేషన్ గుర్తించి స్వాధీనం చేసుకోవచ్చన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఫోన్లు రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన ఐటి కోర్ ఇన్స్పెక్టర్ రఫీక్ ఖాన్, ఆర్ఎస్ఐ దినేష్, కృష్ణ, సైబర్ క్రైమ్ సిబ్బందిని అభినందిం చారు. ఎస్‌బి ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు, ఆర్ఐ జనిమియా, ఆర్ఎస్ఐలు దినేష్, కృష్ణ పాల్గొన్నారు.


ఫోన్లు అందజేస్తున్న అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-రాయికల్

పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం బేటి బచావో-బేటి పడావో కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో వీరలక్ష్మి మాట్లాడుతూ.. ఈ నెల19 నుంచి 24వ వరకు 'ఆడపిల్లల్ని రక్షిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం అనే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, పోషకాల విలువలపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకి ఎలాంటి సామాజి సమస్యలు ఎదురైన చైల్డ్ హెల్ప్ లైన్ టోల్ ఫ్రీ నెంబర్ 1098 నెంబర్‌కి కాల్ చేయాలని సూచించారు.18 ఏండ్లు నిండని ఆడపిల్లలకు బాల్య వివాహాలు చేయరాదని ఎక్కడైనా అలాంటి వివాహాలు జరిగితే హెల్ప్‌లైన్‌కి సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మిషన్ కోఆర్డినేటర్ అశ్విని, జనరల్ స్పెషలిస్ట్ గౌతమి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, ఉపాధ్యాయులు వజన, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్

ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన జువ్వాడి నర్సింగరావు


ఉత్తమ్ కుమార్‌ను సన్మానిస్తున్న నర్సింగ్‌రావు

నవతెలంగాణ -మెట్‌పల్లి : ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగ్‌రావు హైదరాబాద్ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రితో చర్చించి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి కాంగ్రెస్ నాయకులు పిప్పరి రాజేష్, రాజేశ్వర్‌గౌడ్, మర్రి సహదేవ్, కేసుల సురేందర్ పాల్గొన్నారు.

లింగంపేటలో పీటీఏ సమావేశం

నవతెలంగాణ-మేడిపల్లి

స్త్రీ, పురుషుల మధ్య వివక్ష చూప వద్దని సృష్టిలో ఇద్దరూ సమా నమే అని ప్రధానో పాధ్యాయులు ప్రకాష్ అన్నారు. పాఠశాలలో జరిగిన పేరెంట్స్ టీచర్స్ అసోసియేషన్ సమావేశం జరిగింది. గ్రామ సర్పంచి వంగ వెంకటేశం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బ్రహ్మా నందం, ఉపాధ్యాయులు రాజయ్య, సురేష్, వెంకటరమణ పాల్గొన్నారు.

IN THE COURT OF HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE AT KARIMNAGAR
O.S.No. 689 of 2021

Between:-
Mohd. Saleemuddin & others ...Plaintiffs
AND
Mohd. Hyder Ali @ Mateen & others ...Defendants..

To
D1 Mohammad Hyder Ali @ Mateen S/o. Mohammad Azeemuddin, aged 52 yers, Occ: Business, R/o. H.No.4-6-198, Rahamatpura Street, Jagtial town and district.

WHEREAS the above named plaintiffs have filed the above suit against you. It is hereby informed you that the summons sent to you are returned, as unserved.

Hence take notice that the above case is posted on **12-02-2024 at 10:30 a.m.,** before the afore mentioned court, for your appearance and written statement, if any?. You are hereby directed to appear in person or through pleader. In case of making default the said petition will be heard and determined in your absence.

// By order of the Court //
Sd/-
Khaja Khaleeluddin Ahmed
Nazima Sultana
Counsel for the Plaintiff.
KARIMNAGAR.

రావు బ్రదర్స్
చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్
జగిత్యాల బ్రాంచ్

చిట్ సభ్యులకు ఏజెంట్లకు విజ్ఞప్తి

రావు బ్రదర్స్ చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ జగిత్యాల బ్రాంచ్ చందాదారులకు తెలియజేయునది ఏమనగా తేది: 26-01-2024 రోజున జరగవలసిన Chit Auctions 'గణతంత్ర్య దినోత్సవం' సందర్భముగా 27-01-2024 శనివారం రోజున జరుపుటకు నిర్ణయించినాము. కావున సభ్యులందరు ఈ యొక్క మార్పును గమనించి మాతో సహకరించి Auctions నకు హాజరు కాగలరని మనవి.

సం/- రావు బ్రదర్స్ చిట్‌ఫండ్ మేనేజర్, జగిత్యాల బ్రాంచ్

రాజకీయాలకతీతంగా ప్యాక్స్ సొసైటీ సేవలు

- చైర్మన్ తిరుపతి రెడ్డి

నవతెలంగాణ - వేములవాడ రూరల్

రైతుల కోసం పార్టీలకు అతీతంగా పనిచేసే సొసైటీ పాక్స్ ఒక్కటేనని చైర్మెన్ ఏనుగు తిరుపతి రెడ్డి అన్నారు. వేములవాడ రూరల్ మండలం చెక్కపల్లి గ్రామంలో నిర్మించిన నూతన గోదాంను శనివారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం అందరం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బండ మల్లేశం యాదవ్, జెడ్పీటీసీ ఏష వాణి-తిరుపతి, సర్పంచ్ జైపాల్ రెడ్డి, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.



అన్ని గ్రామాల్లో పటిష్టమైన ప్రణాళికలు రూపొందించాలి

నవతెలంగాణ - తంగళ్ళపల్లి



మాట్లాడుతున్న ఎంపీడీవో

అన్ని గ్రామాల్లో పటిష్టంగా ప్రణాళికలను రూపొందించి అభివృద్ధికి పాటుపడాలని ఎంపీడీవో లచ్చాలు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. జీపీడీపీ తయారీపై ఆదేశాల మేరకు శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండల స్థాయిలో అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన 9 సంకల్పాలను (థీమ్స్) సర్పంచ్, వార్డు సభ్యులకు వివరించి వాటిలో రెండింటిని గ్రామ సభ ఆమోదంతో తీసుకోవాలన్నారు. తీసుకున్న రెండు సంకల్పాలకు 15వ ఆర్థిక సంఘం, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్, జనరల్ ఫండ్షలోని అన్ టైడ్ మొత్తం నుంచి కనీసం 25 శాతం నిధులను ప్రణాళికలో కేటాయించాలన్నారు. ఈ నెల చివరాఖరి కల్లా ఈ గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో నమోదు పూర్తికావాలన్నారు.

సమావేశానికి అధికారులు డుమ్మా...

గ్రామాల అభివృద్ధి కోసం అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు మండల స్థాయి సమావేశాన్ని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేస్తే అధికారులు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించి సమావేశానికి హాజరు కాలేదు. కేవలం ఐసిడిసి శాఖ నుండి సూపర్వైజర్, ఐకెపి నుండి సిసి ఇద్దరు అధికారులు మాత్రమే మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. దాదాపు 22 శాఖలకు సంబంధించిన అధికారులు హాజరు కావాల్సింది ఉండగా కేవలం రెండు శాఖల అధికారులు ఇద్దరు మాత్రమే హాజరు కావడంపై సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి.



ఖాళీగా ఉన్న కుర్చీలు

క్రీడాకారులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రాచర్ల జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఈ నెల 24 నుండి 28 వరకు జార్ఖండ్(రాంచి)లో నిర్వహించే జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. వారిని సింగిల్ విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి సన్మానించి, 5వేల రూపాయలు అందించారు. బీఆర్ఎస్ నాయకుడు అందె సుభాష్, యూత్ సభ్యులు, పిఈటి విక్రం పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆర్థిక సహాయం చేస్తున్న గుండారపు కృష్ణారెడ్డి

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

- యువతి చదువుకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ - రుద్రంగి

రుద్రంగి మండల కేంద్రానికి చెందిన పిసరి భూమానందం 4నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. గతంలో ఆది శ్రీనివాస్ భూమానందం కుటుంబాన్ని పరామర్శించి మృతుడి కూతురి చదువుకు అయ్యే ఖర్చులు అందజేస్తానని మాట ఇచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక సర్పంచ్‌కు ఆ డబ్బులను పంపించి భూమానందం కూతురుకు అందజేశారు. సర్పంచ్ తర్రె ప్రభలతమనోహర్, పిడుగు లచ్చిరెడ్డి, గుగ్గిళ్ల వెంకటేష్, ఎర్రం గంగ నర్సయ్య, ఇప్ప మహేష్, గడ్డం శ్రీనివాస్, మడిశెట్టి అభిలాష్ పాల్గొన్నారు.



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న సర్పంచ్,నాయకులు

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త వహించాలి

ఎస్ఐ ఎస్.అశోక్

నవతెలంగాణ - రుద్రంగి



సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని రుద్రంగి ఎస్ఐ సిరిసిల్ల అశోక్ అన్నారు. విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 22, ఆ తర్వాత మొబైల్ ఫోన్‌లోకి వాట్సప్ ద్వారా గాని లేక టెక్స్ మెసేజ్ ద్వారా గాని అయోధ్య రామాలయం సంబంధించిన లైవ్ స్ట్రీమింగ్ లేదా లైవ్ ఫొటోస్ సంబంధించిన లింక్ వచ్చే అవకాశం ఉందన్నారు. ఇటువంటి లింక్స్‌ని ఓపెన్ చేయవద్దని, ఓపెన్ చేయడం వల్ల మన మొబైల్ హ్యాక్ అయి బ్యాంక్ అకౌంట్‌లో నుంచి డబ్బులు పోయే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు గ్రహించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

నవతెలంగాణ - వీర్నపల్లి



విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ పాటి దినకర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. వీర్నపల్లి మండలం అంబేద్కర్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వకుళ, ఎస్ఎంసీ చైర్మన్ మల్లారపు జోసెఫ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31లోగా సీఎంఆర్ సరఫరా పూర్తిచేయాలి

అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్

నవతెలంగాణ - కొనరావుపేట

నిర్దేశిత గడువు ఈ నెల 31లోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరా పూర్తి చేయలని సిరిసిల్ల జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.ఖీమ్యా నాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. శనివారం ఆయన కొనరావుపేట మండలం కొలనూర్‌లోని రైస్ మిల్లులను పౌర సరఫరాల శాఖ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. భారత ఆహార సంస్థకు రైస్ మిల్లర్‌లు సరఫరా చేయాల్సిన బియ్యం నిర్దేశిత గడువు ఈ నెల 31లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. రోజువారీగా లక్ష్యం నిర్దేశించుకుని బియ్యం సరఫరా ప్రక్రియ పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. తనిఖీలో జిల్లా పౌరసరఫరాల అధికారి జితేందర్‌రెడ్డి, మేనేజర్ జితేంద్రప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



రైస్‌మిల్ తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- రేపటినుంచి సమ్మె ● సీఐటీయూ సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్



మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

నవతెలంగాణ - సిరిసిల్ల

మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని ఈ నెల 22 నుంచి సమ్మెలోకి వెళ్తున్నారని సీఐటీయూ సిరిసిల్ల జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ అన్నారు. సిరిసిల్ల మున్సిపల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీస్ ముందు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడుతూ సిరిసిల్ల మున్సిపల్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులకు సంబంధించి 10సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న పీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని, 33మంది కార్మికులకు సంబంధించిన పీఎఫ్ డబ్బులను జమచేయాలని, పెరిగిన పీఆర్సీ బకాయిలను అందించాలని అనేకసార్లు మున్సిపల్ కమిషనర్, చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే జనవరి 22న సమ్మెకు వెళ్తామని 10రోజుల క్రితమే మున్సిపల్ కమిషనర్‌కు లెటర్ ఇచ్చామన్నారు. అయినా కనీసం కార్మికులతో ఎలాంటి చర్చలు జరపలేదన్నారు. తప్పనిసరి పరిస్థితులలో కార్మికులు ఈ నెల 22 నుండి పనులు బంద్ చేసి సమ్మెకు వెళ్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు సుల్తాన్ నర్సయ్య, కార్మికులు పాల్గొన్నారు.

పార్కులు, డివైడర్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసు ముందు ధర్నా

నవతెలంగాణ - సిరిసిల్ల



మున్సిపల్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న కార్మికులు

పార్కులు, డివైడర్లలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూషం రమేష్ మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి సిరిసిల్ల పట్టణంలో పార్కులు, డివైడర్లలో శానిటేషన్ పనిచేస్తున్న 45మంది కార్మికుల కాంట్రాక్టు గత డిసెంబర్ 11వరకు అయిపోయిందన్నారు. తర్వాత మళ్లీ టెండర్ మున్సిపల్ అధికారులు వెయ్యకపోవడం వలన కాంట్రాక్టర్ కార్మికులను పనిచేయవద్దని చెప్పారన్నారు. దీంతో నెలరోజుల నుండి కార్మికులు పనిలేకుండా ఉంటున్నారని, దానికి తోడు కాంట్రాక్టర్ నుండి రావాల్సిన 3నెలల వేతనాలు రాకపోవడం కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్, కలెక్టర్‌కు వినతిపత్రాలు ఇచ్చినా సమస్య పరిష్కారం చేయడం లేదన్నారు. ఈ విషయంపై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా ఆయన మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ చేసి అడగగా వీళ్లు, మున్సిపల్‌లో పనిచేయడం లేదని కాంట్రాక్టర్ల ఇండ్లలో పనిచేయడం జరిగిందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. సిరిసిల్ల సుందరీకరణలో భాగంగా ప్రభుత్వమే మున్సిపల్ ద్వారా ఏర్పాటు చేసిన పార్కులు, డివైడర్లు, కూడళ్ళలో పనిచేసిన కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా మాట్లాడడం సరికాదన్నారు. మున్సిపల్ ద్వారానే పాలకవర్గం తీర్మానం చేసి టెండర్ వేసి మున్సిపల్‌లోని నాలుగు పట్టణ సమాఖ్యల పేరు మీద కాంట్రాక్టు తీసుకొని కార్మికుల శ్రమతో అవార్డులు, రివార్డులు పొందిన అధికారులు, పాలకవర్గం కార్మికులను ఈ విధంగా రోడ్డున పడేయడం సరికాదని అన్నారు. ఇప్పటికైనా వెంటనే వీరికి కాంట్రాక్టర్ నుండి రావాల్సిన బకాయి వేతనాలు ఇప్పించి, ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, లేకుంటే సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలను నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నర్సయ్య, శారద, రమణమ్మ, గీత, వసంత, మణెమ్మ, లక్ష్మి, శ్రీకాంత్, రాకేష్, వంశీ, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

మర్రిపల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

నవతెలంగాణ - వేములవాడ రూరల్



వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభం అవుతున్నాయని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ తెలిపారు. శనివారం రూరల్ మండలంలోని మల్లారం, మర్రిపల్లి గ్రామాల్లో కృతజ్ఞత ర్యాలీలో పాల్గొన్నారు. ఆయనకు ప్రజలు, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మల్లారం గ్రామంలో నూతనంగా నిర్మించిన కాంగ్రెస్ జెండా గద్దెను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ తన విజయానికి అహర్నిశలు కృషి చేసిన ప్రజానికానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పేదప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారంగా అప్పులు చేసి కనీసం మున్సిపాలిటీలకు కరెంట్ బిల్లు కట్టలేని దుస్థితిని తెచ్చిందన్నారు. ఇక్కడ ప్రాంత సమస్యలపై ఆందోళన చేసిన వాడిగా ఇక్కడి రైతాంగానికి మేలు జరిగే మరి పెల్లి చెరువు రిజర్వాయర్ పనులు త్వరలోనే ప్రారంభమవు తాయన్నారు. దీనివల్ల చాలా వరకు గ్రామాల్లో తాగునీటికి ఇలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఆరోగ్యానికి అమలు చేయడం జరుగుతుంద న్నారు. అందులో భాగంగానే మొదటగా మహిళా తల్లులకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షల వరకు పెంపు జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సంగ స్వామి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి టీఆర్ఎస్ నేతలు

నవతెలంగాణ - సిరిసిల్ల



పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేకే మహేందర్ రెడ్డి

బీఆర్ఎస్ సిరిసిల్ల నేతలు పలువురు శనివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ కౌన్సిలర్ గాజుల రామచంద్రం, కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొక్కుల వెంకటేశం, బీఆర్ఎస్ నాయకులు భీమవరం శ్రీనివాస్, కుసుమ దుర్గయ్య, బొద్దుల శ్రీనివాస్‌తోపాటు మరికొంతమందికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె.మహేందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, వైద్య శివప్రసాద్, నాగుల సత్యనారాయణగౌడ్, ఆకునూరి బాలరాజు, వేల్పుల లక్ష్మీనారాయణ, వెల్ముల తిరుపతిరెడ్డి, సామల దేవదాస్ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై విద్యార్థులకు సదస్సు

నవతెలంగాణ-కొనరావుపేట



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్లు

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో శనివారం మహిళా సాధికారత, బాలికల సంరక్షణకు సంబంధించి అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళా సాధికారత జిల్లా కోఆర్డినేటర్ రోజా మాట్లాడారు. మహిళలకు ఉన్న రక్షణ చట్టాలను వివరించారు. విద్యార్థినిలు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్, జిల్లా కోఆర్డినేటర్లు, దేవిక, అంజలి పాల్గొన్నారు.

మహిళల రక్షణపై వైద్య విద్యార్థుల ప్లాష్‌మాబ్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



ఎంబీబీఎస్ విద్యార్థుల నృత్య ప్రదర్శన

మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాల నివారణ, మహిళల రక్షణపై జిల్లా వైద్య కళాశాల విద్యార్థులు శనివారం వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. మహిళల రక్షణపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డిప్యూటీ సూపరింటెంట్ డాక్టర్ చీకోట సంతోష్, డిసిహెచ్ఎస్ డాక్టర్ మురళీధర్‌రావు, ప్రొఫెసర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



విద్యార్థులు కష్టపడుతూ కాకుండా.. ఇష్టపడి చదవాలని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. పట్టణంలోని వెంకంపేట జెడ్పీహెచ్ పాఠశాలలో గోరుముద్ద కార్యక్రమాన్ని శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించి, చదువుపై దృష్టి సారించాలన్నారు. స్థానిక కౌన్సిలర్ కల్లూరు రాజు విద్యార్థులకు గోరుముద్ద కార్యక్రమంలో అల్పాహారం అందజేయడం అభినంద నీయమన్నారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్నం భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్, డిసిసి బ్యాంక్ కరీంనగర్ డైరెక్టర్, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు వీరబత్తిని కమలాకర్, ఎంఈఓ దూస రఘుపతి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలీస్ అంటేనే సేవాభావం..

కమాండెంట్ యస్.శ్రీనివాసరావు



నవతెలంగాణ - తంగళ్ళపల్లి

పోలీస్ అంటేనే సేవా భావమని 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ యస్. శ్రీనివాసరావు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌కు చెందిన సీ కంపెనీ సిబ్బంది, అధికారులు (ఆర్‌సికోర్స్) ఆన్యువల్ రిఫ్రెష్ కోర్సులో భాగంగా శనివారం తంగళ్ళపల్లిలోని శ్రీనివాస చారిటబుల్ ట్రస్టు - లగిశెట్టి విశ్వనాథం స్మారక వృద్ధాశ్రమాన్ని సందర్శించారు. ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, బియ్యం, దుప్పట్లు, నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ ఎం.పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ పోలీస్ అంటేనే సేవాభావంతో ఉంటారని, తమవంతు సహాయంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేసినట్టు తెలిపారు. వారిలో మనోధైర్యాన్ని నింపేందుకు వృద్ధులతో పోలీస్ సిబ్బంది కాసేపు ఆహ్లాదంగా గడిపామన్నారు. వారికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా పోలీస్ శాఖ నుంచి అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐలు పి.శ్రీనివాస్, సీహెచ్.నేమాజీ, పోలీస్ బెటాలియన్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సీసీ కెమెరాలు కీలకం

సీఐ శశిధర్‌రెడ్డి

నవతెలంగాణ-గంభీరావుపేట



నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎల్లారెడ్డిపేట సీఐ శశిధర్ రెడ్డి అన్నారు. గంభీరావుపేట మండలం మల్లుపల్లె గ్రామంలో కమ్యూనిటీ పోలీసులో భాగంగా మీకోసం కార్యక్రమంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించగా గ్రామస్తులు ఏర్పాటు చేసిన 5సీసీ కెమెరాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ మహేష్ మాట్లాడారు. సీసీ కెమెరాలు ఏర్పాటుకు కృషిచేసిన సర్పంచ్, గ్రామస్తులకు అభినందనలు తెలిపారు.

దుకాణాల్లో అధికారుల తనిఖీ

నవతెలంగాణ - ముస్తాబాద్



మండల కేంద్రానికి జీఎస్టీ అధికారులు వస్తున్నారని సమాచా రం తెలుసుకొని పలువురు వ్యాపా రులు షాపులను బంద్‌చేశారు. కిరాణా, ఎలక్ట్రికల్, బట్టల, హార్డ్వేర్ షాప్‌లతో పాటు పలు పలు దుకాణాలు బంద్ చేశారు. మండల కేంద్రంతో పాటు ఇతర గ్రామాలలో కూడా దుకాణాల యజమానులు సరిగా జీఎస్టీ ప్రభుత్వానికి చెల్లించడం లేదని తనిఖీలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకుంటే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

రెయిన్‌బో పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్ కుమార్

సిరిసిల్ల పట్టణంలోని రెయిన్‌లో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. డీఈఓ రమేష్ కుమార్, డీటీఓ కొండలరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విద్యార్థులు స్వయంగా తయారుచేసిన ఆహార పదార్థాలకి సంబంధించిన స్టాల్స్‌ని సందర్శించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, టౌన్ సీఐ రఘుపతి, కౌన్సిలర్ గుండ్లపల్లి నీరజ, పాఠశాల కరస్పాండెంట్ నాగుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ - చందుర్తి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆది

నిత్యం మధ్య ఉండి సేవ చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పథకాలను అందజేసి ప్రజా సంక్షేమ ప్రభుత్వంగా గుర్తింపు తెచ్చుకుంటామని అన్నారు. వచ్చే రెండునెలల్లో చందుర్తి, మేడిపల్లి, మరిమడ్ల, మానాల రోడ్ల పనులను ప్రారంభిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ లావణ్య, జెడ్పీటీసీ నాగం కుమార్, ప్యాక్స్ చైర్మన్ తిప్పని శ్రీనివాస్, సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేసే వాళ్లే కమ్యూనిస్టులు..

సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

నవతెలంగాణ - తంగళ్ళపల్లి



ఎక్కడైనా సరే ప్రజల కోసం పనిచేసేవాళ్లే కమ్యూనిస్టులు అని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల్ల గ్రామ శాఖ ఆధ్వర్యంలో శనివారం సీపీఐ సభ్యత్వ పున రుద్ధరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 98వేలమంది, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 1200 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రజల కోసం పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికుల పాల్గొన్నారు.

'వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణం'

నవతెలంగాణ - తంగళ్ళపల్లి



మాట్లాడుతున్న జలగం ప్రవీణ్ కుమార్

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకపోవడానికి మాజీ మంత్రి కేటీఆర్ ముఖ్య కారణమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తంగళ్ళపల్లి ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సిరిసిల్ల నేత కార్మికులకు న్యాయం చేయని కేటీఆర్.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంతో యుద్ధం చేసి బకాయిలు తెప్పిస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బతుకమ్మ చీరల ఉపాధితో కేవలం నాలుగు నెలలు మాత్రమే పనిదొరికి మిగతా నెలలు కార్మికులు పస్తులు ఉండే విధంగా సిరిసిల్లను కేటీఆర్ ముంచారన్నారు. మ్యాక్స్ సొసైటీల పేరుతో ఎన్నో కోట్లు దోచుకున్నారని, చేనేత కార్మికులకు రావలసిన రూ.275 కోట్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. ఆయనవెంట రాము, మోర రాజు, మునిగల రాజు, మోరల్ లక్ష్మీరాజం, సామల గణేష్, సత్తు శ్రీనివాస్, ముక్క వాసు, ప్రశాంత్ పాల్గొన్నారు.

అర్హులైన వారు ఓటు నమోదు చేసుకోవాలి

సిరిసిల్ల జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

నవతెలంగాణ - కొనరావుపేట



అర్హులైన వారు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సిరిసిల్ల జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. ప్రత్యేక ఓటరు సంక్షిప్త, పునరీక్షన కార్యక్రమంలో భాగంగా మండలంలోని నిజామాబాద్ జెడ్పీ స్కూల్‌లోని 242, 243, 244 నంబర్ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ నమోదును కలెక్టర్ శనివారం తనిఖీ చేశారు. అనంతరం అదే ఆవరణలోని ప్రాథమిక స్కూల్‌ను సందర్శించి, సౌకర్యాలు పరిశీలించి, విద్యార్థుల సంఖ్య హాజరు శాతం అడిగి తెలుసుకున్నారు. మండలంలోని మారుమూల గ్రామమైన కమ్మరిపేట తండాలోని 224 పోలింగ్ కేంద్రాన్ని, రామన్నపేటలోని 251 ఓటరు పోలింగ్ కేంద్రంలోని ఓటరు నమోదు కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. జనవరి 1వ తేదీ 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకునేలా చూడాలని.. ఏ ఒక్కరూ మిస్‌కాకూడదని బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. ఆదివారం సైతం ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, చేర్పులు చేసుకునే కార్యక్రమం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట కొనరావుపేట తహసీల్దార్ విజయప్రకాశ్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ బొబ్బిలి సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

మృతుని కుటుంబానికి జెడ్పీటీసీ ఆర్థిక సహాయం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట



ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన అనుప రాజు కిడ్నీ వ్యాధితో మృతిచెందాడు. అతని కుటుంబాన్ని శనివారం జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సహాయం చేశారు. అయనవెంట సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, అందె సుభాష్, పిల్లి కిషన్, వార్డు సభ్యుడు మజీద్ ఉన్నారు.

ఓదెల జిల్లా పరిషత్ పాఠశాలలో గణిత టాలెంట్ టెస్ట్

నవతెలంగాణ-ఓదెల
గణిత ఫోరం ఆధ్వర్యంలో ఓదెల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రామానుజం జన్మదినాన్ని పురస్కరించుకొని గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ పోటీలో మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి గరిగంటి అక్షిత ఓదెల మండల జిల్లా పరిషత్ పాఠశాల నుండి,ద్వితీయ బహుమతి గుంటి కావ్య జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల కనగర్తి,తృతీయ బహుమతి దొడ్డి వైష్ణవీ జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల కనగర్తి గెలుపొందారు. బహుమతులు సాధించిన వీరు సోమవారం పెద్దపల్లి జిల్లా స్థాయిలో జరగబోయే టాలెంట్ టెస్ట్‌కు అర్హత పొందినట్లు



జిల్లా పరిషత్ కనగర్తి పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎర్ర రమేష్ తెలిపారు.

ప్రత్యేక ఓటర్ నమోదు కార్యక్రమం

నవతెలంగాణ జూలపల్లి/ ఎలిగేడు



ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఓటర్ నమోదు జాబితాలో సవరణలు మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఇవాళ రేపు అవకాశం కల్పిస్తున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఈ మేరకు ఎలిగేడు మండలంలోని 20 21వ తేదీల్లో ఓటర్ నమోదు సవరణ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే శనివారం రోజున స్పెషల్ డ్రైవ్ నిర్వహించగా 45 దరఖాస్తులు వచ్చా యని తహసీల్దార్ స్వర్ణ తెలిపారు. జనవరి ఒకటి 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరులు ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రతి గ్రామంలో బూత్ స్థాయి అధికారులు ఓటర్ నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నారని తెలిపారు.

18 సంవత్సరాలు నిండిన పౌరులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-జూలపల్లి
జనవరి 1 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి పౌరులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 20 జనవరి 2024 రోజున జులపల్లి మండలంలోని 24 పోలింగ్ కేంద్రాలలో బూత్ స్థాయి అధికారులకు కొత్తగా ఓటరు నమోదు కొరకు 60 దరఖాస్తులు. మార్పులు చేర్పుల కొరకు 28 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ బషీరుద్దీన్ తెలిపారు. కార్యక్రమంలో బీఎల్వోలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు ఉన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

సుల్తానాబాద్-నవతెలంగాణ



ఓటు నమోదుపై అవగాహన

18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు చేసుకోవాలని శనివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమాచార పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పూసాలలో తెలంగాణ సాంస్కృతిక సారధి కళా బృందంచే అవగాహన కల్పించారు. అలాగే పారిశుద్ధ్యం, డ్రగ్స్,మాదక ద్రవ్యాలపైన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు, గుండ్ల స్నేహలత, బుర్ర శంకర్ గౌడ్, ఢిల్లీ వెంకటస్వామి, నారగోని సరిత, స్పందన, స్వప్న,శ్వేత, ఉప్పు స్పందన తదితరులు పాల్గొన్నారు

కనీస వేతనాల జీవోలు సవరించాలి

నవతెలంగాణ-సుల్తానాబాద్



కనీస వేతనాల జీవోలను సవరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు. అన్నారు. శనివారం సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం స్థానిక పూసల పెద్దమ్మ గుడి వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు పాల్గొని మాట్లాడుతూ రైస్ మిల్లులో పనిచేస్తున్న కార్మికుల కనీస వేతనాల జీవోలను గత పది సంవత్సరాల నుంచి సవరించకుండా గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిందని, దీనితో రైస్ మిల్లు కార్మికుల వేతనాలు సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమైన కనీస వేతనాల జీవోలను సవరించి నెలకు 26 వేల వేతనంగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు, అదేవిధంగా వలస కార్మికులను నిరోధించి, స్థానికులకు ఉపాధి కల్పించాలని అన్నారు, పని భద్రత కల్పించాలని, చట్టం ప్రకారం పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అమలు చేయాలని అన్నారు, రాబోయే రోజుల్లో జాతీయస్థాయిలో అన్ని కార్మిక సంఘాలు దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం అయ్యాయని, ఆ పోరాటంలో రైస్ మిల్లు ఆపరేటర్ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కట్టెకోల రాజు, అధ్యక్షుడు తాండ్ర అంజయ్య, నాయకులు నమూన్ల బ్రహ్మచారి, పూసాల సంపత్, బండారి స్వామి, బండారి తిరుపతి, వెంకటేష్, శేఖర్, శంకర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని నియమించాలని ఎంఈవోకు వినతి

నవతెలంగాణ-మంథని
మంథని మండలం ఎక్లాస్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని విద్యాకమిటీ అధ్యకుడు సమ్మయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ చెన్నవేన సదానందం, స్వామి, మంథని సమ్మయ్య,శ్రీధర్‌లు శనివారం ఏంఈవోకు వినతి పత్రం అందజేశారు. ఈ పాఠశాలలో 2018 నుంచి తెలుగు బోధించే వాళ్లు లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారన్నారు. పదో తరగతి పరీక్షలు జరగనున్న నేపథ్యంలో తెలుగు సబ్జెక్ట్‌లో వెనుకబడే ప్రమాదం ఉందన్నారు. వెంటనే ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు.

మంత్రి పొన్నంను కలిసిన ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

నవతెలంగాణ-గోదావరిఖని:



మంత్రికి వినతి అందజేస్తున్న రామగుండం ఎమ్మెల్యే

రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. గోదావరిఖని ఆర్టీసీ బస్టాండ్‌ని మోడల్ బస్ స్టేషన్‌గా పునర్ నిర్మించాలని, ఆర్టీసీ ఆదాయ వనరుల కొరకు పెట్రోల్ బంకును ఏర్పాటు చేసి ఆర్టీసీకి ఆదాయం సమకూర్చాలని, అదేవిధంగా మహాత్మా జ్యోతిబాపూలే విద్యాలయం ఏర్పాటు చేయాలని మంత్రికి ఎమ్మెల్యే వినతి పత్రాన్ని అందించారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే దాసరి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
కాల్వశ్రీరాంపూర్ మండలం పెద్దరాత్‌పల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొడుగు మల్లయ్య తండ్రి కొమురయ్య, తాత రాజకొమురయ్య ఇటీవల మరణించారు. వారి కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నూనెటి సంపత్, నిదానపురం దేవయ్య, జిన్నా రాంచంద్రారెడ్డి, రావిశెట్టి సారయ్య, కొట్టె సంపత్,కుంట శ్రీకాంత్, కొత్తపల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత సమయంలో ప్రజలకు సేవలందించాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రజావాణి, సీఎంవో దరఖాస్తుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలి

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
ప్రభుత్వం ద్వారా ప్రజలకు వివిధ సేవలు నిర్దేశిత సమయంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని, ఒకే అంశంపై ప్రజలు పలుమార్లు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రావద్దని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందే వివిధ సేవలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ, అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్ తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ భూములు, వాటి ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర నివేదిక తయారుచేసి సమర్పించాలని కలెక్టర్ తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతివారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను వారం రోజుల లోగా పరిష్కరించాలని, సంబంధిత దరఖాస్తుకు పరిష్కారం చూపలేని పక్షంలో ఆ కారణాలను తెలియజేస్తూ వారికి లేఖ రాయాలని, ప్రజల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ సూచించారు.సీఎంవో కార్యాలయం నుంచి వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఒకే దరఖాస్తుపై పలుమార్లు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు



తిరగకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్‌లు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, కలెక్టరేట్ కార్యాలయ సీ సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, డీటీ ప్రవీణ్, రెవెన్యూ అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంని కలిసిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:
తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఇంధనశాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు హైదరాబాద్‌లోని వారి నివాసంలో కలిశారు. సింగరేణిలో నూతన భూగర్భ గనులను తీసుకురావాలని, సింగరేణి యాజమాన్యం బిడ్‌లలో పాల్గొనే విధంగా యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని, సింగరేణి కార్మికులకు సొంతింటి పథకం అమలు చేయాలని, కోల్ ఇండియాలో కార్మికులకు యాజమాన్యం చెల్లిస్తున్నటువంటి సింగరేణిలో పెర్క్‌పై ఐటీ మినహాయింపును అధికారులకు చెల్లిస్తున్న యాజమాన్యం కార్మికులకు కూడా చెల్లించే విధంగా చూడాలని, ఇటీవల హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 149 మంది జూనియర్ అసిస్టెంట్లను విధుల్లోకి తీసుకోవాలని తదితర సింగరేణి కార్మికుల సమస్యలపైన వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, అడిషనల్ జనరల్ సెక్రెటరీ మిర్యాల రంగయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు సారయ్య, కె.వీరభద్రయ్య తదితరులున్నారు.



డిప్యూటీ సీఎంకు వినతి అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మండల స్థాయిలో జరిగిన గణిత ప్రతిభా పాటవ పోటీలు

మొదటి బహుమతి గెలుచుకున్న పెండ్యాల శ్రీనిధి

నవతెలంగాణ-మంథని:
జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు తెలంగాణ గణిత ఫోరం జిల్లా విభాగం సూచనల మేరకు శనివారం మంథని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండలంలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. ఈపోటీలలో ప్రతి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థుల చొప్పున మండల స్థాయి గణిత ప్రతిభా పాటవ పోటీలలో పాల్గొన్నారు.ఈ ప్రతిభా పాటవ పోటీలో నాన్ రెసిడెన్షియల్ విభాగంలో ఆంగ్ల మాధ్యమం నుంచి మంథని పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో చదువుతున్న పెండ్యాల శ్రీనిధి మొదటి బహుమతి గెలుచుకోగా, ఇదే పాఠశాలలో చదువుతున్న బుద్దర్తి దీప్తి ద్వితీయ, పాత హర్షిత తృతీయ బహుమతులను గెలుపొం దారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మండల విద్యాధికారి దాసరి లక్ష్మి జ్ఞాపికలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ హరిప్రసాద్, స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సురేష్ కుమార్, టీఎంఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చౌదారపు శ్రీనివాస్,ఎస్ శ్రీనివాస్ లతోపాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యా యులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న పెండ్యాల శ్రీనిధి

నవతెలంగాణ క్యాలెండర్ ఆవిష్కరణ







నవతెలంగాణ-ధర్మారం
మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ అంబటి రజిత, నిత్య యోగా గురూజీ జంగిలి సుధాకర్ మంజుల దంపతులు, స్థానిక పోలీస్ స్టేషన్లో ఎస్సై టి. సత్యనారాయణ, ఏఎస్ఐ ఎండీ సాబీర్ పోలీసు సిబ్బందితో కలిసి నవతెలంగాణ 2024 క్యాలెండం "ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది ఏఎస్ఐ సాబీర్, పోలీసు సిబ్బంది స్థానిక విలేఖరి ఉప్పులంచ దయానంద్ నవతెలంగాణ జిల్లా ఇన్‌చార్జ్ కె.రాజమల్లు, యోగా అభ్యాసకులు దేవి అంజన్న, ఈగం ప్రసాద్, మల్లేశం, రాజమౌళి, ముక్త రమేష్‌లు పాల్గొన్నారు.

ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత

- గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు
- సిమ్స్ వైద్య కళాశాలలో ర్యాగింగ్ అవగాహన సదస్సు

నవతెలంగాణ-గోదావరిఖని:
అమానవీయమైన ర్యాగింగ్ నివారణ అందరి బాధ్యత అని గోదావరిఖని అదనపు జిల్లా న్యాయ మూర్తి డాక్టర్ టి.శ్రీనివాస రావు అన్నారు. ఈ మేరకు శనివారం సిమ్స్ వైద్య కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాగింగ్ నివారణ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్ అనేది చట్టరీత్యా నేరమని ర్యాగింగ్‌కు పాల్పడిన ఎవరైనా శిక్షార్హులని, ర్యాగింగ్‌కు పాల్పడి తమ విలువైన భవిష్యత్‌ను నాశనం చేసుకోరాదని అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా కటకటాలు లెక్కించక తప్పదని అన్నారు. ర్యాగింగ్ నివారణకు విద్యా సంస్థలలో కమిటీలు వేయాలన్నారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు సింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ నరేందర్, లీగల్ సోషల్ వర్కర్ శంకర్, న్యాయవాదులు భూమయ్య, వరలక్ష్మి, షానవాజ్, లీగల్ వాలంటీర్ సుజాత తదితరులున్నారు.



మాట్లాడుతున్న గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు

గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా పని చేయాలి

- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- తడి, పొడి చెత్త ఇంటి వద్దే వేరు చేయడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
- జీపీడీపీ జిల్లా స్థాయి శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్
గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని, ఒకే రోజు మార్పు సాధ్యం కానప్పటికి నిరంతరాయంగా కృషి చేయడం వల్ల రాబోయే 6 నెలలు, సంవత్సర కాలంలో అద్భుత ఫలితాలు వస్తాయని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశమందిరం లో నిర్వహించిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం, జీపీడీపీ శిక్షణా కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ తో కలిసి పాల్గొన్నారు.జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ గ్రామంలో నివసించే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండాలంటే ఆ గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సమర్ధవంతంగా ఉండాల్సిన అవసరం ఉందని, జిల్లాలో పారిశుధ్య నిర్వహణ పట్ల సంబంధిత అధికారులు, సిబ్బంది మంచి పనితీరు కనబరుస్తున్నారని, భవిష్యత్ కాలంలో మరింత మెరుగైన దిశగా పారిశుధ్య నిర్వహణ చేయుటకు చర్యలు తీసుకోవాల్సి ఉందని అన్నారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ అత్యంత ప్రాధాన్యత అంశం అని, ప్రతి గ్రామంలోని వార్డుల వారీగా పారిశుధ్య ప్లాన్ రూపొందించుకోవాలన్నారు. గ్రామాలలో నిర్మించిన డంప్ షెడ్లకు అప్రోచ్ రోడ్డు ఉండాలని, లేనిపక్షంలో ఉపాధి హామీ నిధుల క్రింద సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలలో పారిశుధ్య నిర్వహణ పట్ల మండలాల వారీగా ప్రతివారం రివ్యూ సమావేశం నిర్వహించాలని, ప్రతి రెండు వారాలకు జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి పురోగతి పరిశీలించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీధర్, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, సీపీవో రవీందర్, మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు మండల పంచాయతీ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-ముత్తారం:



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముత్తారం మండలం కేంద్రంలోని కాశీలగడ్డ ఏరియాలో సర్పంచ్ తూటి రజిత ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. మండల వైద్యాధికారి డాక్టర్ అమరేందర్ తన సిబ్బందితో కలిసి ఈ సందర్భంగా 62 మందికి వైద్య పరీక్షలు నిర్వహిం చారు.జ్వరాలు, నొప్పులు, వాపులు, కాళ్ల వాపులతో బాధ పడుతున్న వారి రక్తనమూనాలను సేకరించి, ల్యాబ్‌కు పంపించారు. బీపీ షుగర్ టెస్ట్‌లు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ లలిత, హెచ్ఈవో నరసింహారెడ్డి, వీరేశం, శ్రీనివాస్, స్రవంతి, రమాదేవి, ల్యాబ్ టెక్నిషియన్ అనిల్, ఆశా కార్యకర్తలు ఉయ్యాల రజిత, స్వప్న, సంధ్య తదితరులున్నారు.

యాక్సిడెంట్‌కు గురైన ఫొటోగ్రాఫర్‌కు ఆర్థిక సాయం

నవతెలంగాణ-గోదావరిఖని:



ఆర్థిక సహాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

గోదావరిఖని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ఎండీ.షర్ఫుద్దీన్ గత పది రోజుల క్రితం ఆక్సిడెంట్‌కు గురై చేయి వెనుక గాయం కారణంగా ఆపరేషన్ జరుగగా, నిత్యావసర వస్తువుల కోసం గోదావరిఖని ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఇచ్చినటువంటి డబ్బులు 6050రూపాయలను వారి ఇంటి దగ్గర బాధితునికి అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేష్, కోశాధికారి బండారి ప్రసాద్, ఉపాధ్యక్షుడు తోకటి శ్రీధర్, ప్రచార కార్యదర్శులు గూడెల్లి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి రెడ్డి శ్యాంప్రసాద్, అసోసియేషన్ సభ్యుడు గద్దం సామిల్ తదితరులున్నారు.

పట్టణ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

నవతెలంగాణ-సుల్తానాబాద్



పట్టణ పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున అన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మెయిన్ రోడ్లలో కొందరు పట్టణ ప్రజలు, షాప్ యజమానులు ఇష్టానుసారంగా చెత్తను, చికెన్ వ్యర్థాలను, ఇంటి వ్యర్థాలను రోడ్లపై పారావేస్తున్నారని అలా చేయడం ద్వారా రోడ్ల వెంట దుర్గంధం వస్తూ ప్రజలకు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఎవరూ కూడా చెత్తను బయట వేయకుండా మీ వార్డ్‌లోకి వచ్చే స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలని పట్టణ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం తమ వంతు బాధ్యతగా గుర్తించాలని అన్నారు మున్సిపల్ కమిషనర్ వెంట శానిటరీ ఇన్స్పెక్టర్ శ్రావణ్ కుమార్ జావాన్ ఆనంద్‌లు ఉన్నారు

ఎంపీసీ,బైపీసీ కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-మంథని
ఫిబ్రవరి 6లోపు మంథని మైనారిటీ గురుకుల జూనియర్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ కోర్సులలో ప్రవేశాల కొరకు ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మంథని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ అస్మా జబీన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంథని మైనారిటీ గురుకుల బాలికల జూనియర్ కళాశాల ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ,బైపీసీ కోర్సులకు ధరఖాస్తు చేసుకోవచ్చని, ఎలాంటి ఫీజు లేకుండానే ఫిబ్రవరి 6లోపుఆన్‌లైన్‌లో www.tmreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా ధరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 8096286629, 9154365025 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని అస్మాజబీన్ తెలిపారు.

బాలికా సాధికారత కార్యక్రమం

నవతెలంగాణ-గోదావరిఖని:



కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎన్టీపీసీ రామగుండం ఈడీ

శనివారం రామగుండం ఎన్టీపీసీలో నిర్వాసిత గ్రామాల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న బాలికలకు బాలికా సాధికారత కార్యక్రమం నిర్వహించారు. ఐదు రోజులపాటు జరిగే ఈ బాలిక సాధికారత శిక్షణ శిబిరాన్ని ఎన్టీపీసీ రామగుండం ఈడీ కేదారి రంజన్ పాండు సందర్శించారు. బాలికలకు ఔషధ మొక్కలపై అవగాహన, ఉపన్యాసం వివిధ కళా రంగాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఆర్ ఏజీఎం బిజయ్ కుమార్ సిక్దర్‌తోపాటు సీఎస్ఆర్ అధికారులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

నవతెలంగాణ-గోదావరిఖని:



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

ఇటీవల కల్తీ కల్లు తాగి మృతి చెందిన అడ్డగుంటపల్లి, ఎన్టీఆర్ నగర్లకు చెందిన మామిడి కుమార్, నవీన్ కుటుంబాలను శనివారం మాజీ శాసనసభ్యుడు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ పరామర్శించారు. కల్తీ కల్లు తాగి ఇద్దరు మృతి చెందడం దురదష్టకరమన్నారు. కార్పొరేటర్ కొమ్ము వేణు గోపాల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు అచ్చే వేణు, చెలకలపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాంసాహారాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-గోదావరిఖని టౌన్:



ఈ నెల 22న అయోధ్య శ్రీరామ మందిరంలో ప్రాణ ప్రతిష్టను పురస్కరించుకొని రామగుండం నగర పాలక సంస్థ పరిధిలో ఆరోజు జీవులను వధించకుండా, మాంసాహారాలను విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ రామగుండం నగర కమిషనర్‌కు విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ నాయకులు శనివారం వినతి పత్రాన్ని సమర్పించారు. వినతి అందించిన వారిలో విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ బాధ్యులు అయోధ్య రవీందర్, మ్యాడగోని రవీందర్, అడిగొప్పుల రాజు, మ్యాడగోని అరవింద్, కందుగుల ఆకాష్ కుమార్, పొనగంటి శశికాంత్, ఎరుకల సుధీర్ తదితరులున్నారు.

మహిళా సాధికారతకు ప్రతి ఒక్కరూ మద్దతు ఇవ్వాలి

జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

నవతెలంగాణ-పెద్దపల్లి టౌన్



ప్రతి మహిళా సాధికారత సాధించే అంశంలో ప్రతి ఒక్కరూ తమ వంతు మద్దతు అందించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఈ నెల 24న నిర్వహించు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్‌లు జే. అరుణశ్రీ, శ్యామ్ ప్రసాద్ లాల్‌లతో కలిసి పాల్గొని తమ వంతు పూర్తి మద్దతు తెలుపుతూ సంతకం చేశారు. అనంతరం మహిళా సాధికారత, బాలికా దినోత్సవం, బేటి బచావో బేటి పడావో గోడ ప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి రౌఫ్ ఖాన్, డీఆర్డీవో శ్రీధర్, డీపీవో చంద్రమౌళి, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్

ఆదివారం పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక ఓటరు క్యాంప్

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి


ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - భగత్‌నగర్ : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కరీంనగర్ వావిలాలపల్లిలో అల్ఫోర్స్, శ్రీ చైతన్య కళాశాలలో ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శనివారం, ఆదివారం అన్ని పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక క్యాంపును అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫామ్ 6 ద్వారా వారి దరఖాస్తును బీఎల్‌ఓ లకు అందించాలని తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ ఆర్‌డీఓ మహేశ్వర్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ సంధ్యారాణి, కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ రమేష్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశాలు షురూ..

- 6 - 10వ తరగతుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్..
- దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

నవతెలంగాణ - వీణవంక

జిల్లా వ్యాప్తంగా ఉన్న 11 మోడల్ పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 6వ తరగతి ఆంగ్ల మాధ్యమంలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నోటిఫికేషన్ ద్వారా ఆరో తరగతిలో ప్రవేశాలతోపాటు ఏడు నుంచి పదో తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లు భర్తీ కానున్నాయి. ఈ స్కూళ్లలో ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన ఉంటుంది. 6వ తరగతిలో అడ్మిషన్‌కు విద్యార్థులు 2023-24 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి చదువుతూ ఉండాలి. మిగలిన విద్యార్థులు 7వ, 8వ, 9వ తరగతులు చదువుతూ ఉండాలి. ఆగస్టు 31, 2024 నాటికి ఆరో తరగతికి పదేళ్లు, ఏడో తరగతికి పదకొండేళ్లు, ఎనిమిదో తరగతిని పన్నెండేళ్లు, తొమ్మిదో తరగతి పదమూడేళ్లు, పదో తరగతికి పద్నాలుగేళ్లు నిండి ఉండాలి. ఫిబ్రవరి 22వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.125, ఇతరులకు రూ.200ల చొప్పున పరీక్ష రుసుము చెల్లించవల్సి ఉంటుంది. తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్-2024 ద్వారా ఎంపిక ఉంటుంది.

ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. ప్రతి తరగతికి రెండు సెక్షన్‌లు ఉంటాయి. సెక్షన్‌కు 50 మంది చొప్పున మొత్తం 100 సీట్లు ఉంటాయి. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఐఐటీ, జేఈఈ, నీట్, ఎంసెట్, సీఏ, టీపీటీ, సీఎస్ తదితర పోటీపరీక్షలకు ఉచిత కోచింగ్ కూడా ఇస్తారు. ప్రతి తరగతిలో జనరల్ విద్యార్థులకు 50 శాతం సీట్లను, బీసీలకు 29 శాతం సీట్లను, ఎస్సీలకు 15 శాతం సీట్లను, ఎస్టీ విద్యార్థులకు 6 శాతం సీట్లను కేటాయిస్తారు.

ముఖ్యమైన తేదీలు..

- ఆన్‌లైన్ దరఖాస్తులకు ప్రారంభ తేదీ : జనవరి 12, 2024.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఫిబ్రవరి 22, 2024.
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: ఏప్రిల్ 1, 2024.
- తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్-2024 తేదీ: ఏప్రిల్ 7, 2024.
- ఫలితాల వెల్లడి తేదీ: మే 25, 2024.
- అడ్మిషన్ తేదీలు: మే 27 నుంచి 31 వరకు
- ఆన్‌లైన్ సైట్ : telanganaams.cgg.gov.in

ప్రవేశ పరీక్ష విధానం..

తెలంగాణ మోడల్ స్కూల్స్ ఎంట్రన్స్ టెస్ట్-2024 ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. మొత్తం 100 ప్రశ్నలకు 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. 2 గంటల సమయంలో పరీక్ష రాయవల్సి ఉంటుంది. ఇంగ్లిష్/ తెలుగు మాధ్యమాల్లో ప్రశ్నపత్రం ఉంటుంది.



ఘన్ముక్ల మోడల్ స్కూల్

మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్య



మోడల్ స్కూళ్లలో నాణ్యమైన విద్యాబోధన ఉంటుంది. ప్రతీ సంవత్సరం ఖాళీలకు మించి దరఖాస్తులు వస్తున్నవి. పదో తరగతి పరీక్షలల్లో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నాం. విద్యార్థులకు ఉచిత విద్య, పాఠ్యపుస్తకాలు అందజేయడంతో పాటు కొంత మంది విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిపులు వస్తున్నాయి. బాలికలకు ఉచిత హాస్టల్ సౌకర్యం కూడా లభిస్తుంది. కావున విద్యార్థులు అధిక సంఖ్యలో దరఖాస్తులు చేసుకోవాలి.

\- డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్, మోడల్ స్కూల్ ఘన్ముక్ల

గర్భిణుల నమోదు వందశాతం జరిగేలా చూడాలి

కరరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

నవతెలంగాణ - భగత్‌నగర్



జిల్లాలో గర్భిణుల నమోదు వందశాతం జరిగేలా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వైద్యశాఖ అధికారులతో గర్భిణుల నమోదు, ఆరోగ్య మహిళా కార్యక్రమాల ప్రగతిపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణుల నమోదును గర్భందాల్చిన మొదటి మూడు నెలల్లో నమోదు చేయాలని, ప్రతి గర్భిణికి ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ ప్రసవం జరిగేలా ప్రోత్సహించాలని అన్నారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా ఉండటానికి స్థానికంగా దొరికే ఆహార పదార్థాలను స్వీకరించేలా ప్రోత్సహించాలన్నారు. అదేవిధంగా ఐరన్ ఫోలిక్ మాత్రలు వేసుకునే విధంగా చూడాలని సూచించారు. ఆరోగ్యమహిళ కార్యక్రమంలో ప్రతి మంగళవారం క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలన్నారు. అదనపు పరీక్షలకు జిల్లా ప్రధాన ఆస్పత్రికి పంపించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా వైద్యాధికారి లలితాదేవి, డిప్యూటీ వైద్యాధికారి జువేరియా, డిటిసిఓ డాక్టర్ రవీందర్‌రెడ్డి, డిఐఓ సుజాత, ఇతర డాక్టర్లు, ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన జిల్లా జడ్జి



నవతెలంగాణ - కరీంనగర్ రూరల్

కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను కరీంనగర్ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి బి.ప్రతిమ ప్రారంభించారు. కార్యక్రమంలో ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి శ్రీవాణి, ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీ, ఏసీబీ జడ్జి వివేక్, డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి వెంకటేష్, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు బి.రఘునందన్‌రావు, లింగంపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఎంపీపీ లింగాల మల్లారెడ్డి

నవతెలంగాణ - గన్నేరువరం

బాలబాలికల పరిరక్షణ, సమస్యలపై ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మండల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ 0 నుంచి 18 ఏండ్ల బాల బాలికల హక్కులు, పరిరక్షణ, బాల్య వివాహాలు, డ్రాప్ అవుట్ పిల్లలు, దత్తత, బిక్షాటన, బాల కార్మికులు, అనాథ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించారు. మండలంలోని అన్ని గ్రామాలలో ఇలాంటి సమస్యలు ఉంటే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వాతి, సిడిపిఓ సబిత, తహసీల్దార్ బిక్షపతి, ఎస్సై చందా నరసింహారావు, ఏఎల్ఓ నజీర్ అహమ్మద్, ఆపరేషన్ స్మైల్ సభ్యులు అన్వర్, సాయి కిరణ్, రమేష్, ప్రియాంక, పుష్పలత, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉపేంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఇస్రత్ సుల్తానా, సర్పంచులు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఎంపీడీవో కు సర్పంచుల వినతి

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్



కరీంనగర్ రూరల్ ఎంపీడీఓ దివ్య దర్శన్‌రావు, ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డికి శనివారం సర్పంచులు వినతిపత్రం అందజేశారు. సర్పంచుల పదవికాలం పెంచాలని, పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, స్పెషల్ ఆఫీసర్ గా సర్పంచులనీ కొనసాగించాలని కోరారు.

విద్యార్థిని సన్మానించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ - గన్నేరువరం : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థి విష్ణువర్ధన్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక అవ్వడం గర్వకారణమని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం పాఠశాల ఆవరణలో క్రీడాకారుడు విష్ణువర్ధన్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె.రామయ్య, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.రాజబాబు, ఎస్ఎంసి చైర్మన్ బుర్ర మల్లేష్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

జయశంకర్ విగ్రహ ధ్వసంపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ - వీణవంక

హైదరాబాద్‌లో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదారపు నరసిహాచారి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమ సిద్ధాంత కర్త, రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే ఫణంగా పెట్టిన యోధుడి విగ్రహాన్ని ధ్వసం చేయడం సరైంది కాదని పేర్కొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషిచేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ

అక్షర హైస్కూల్లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ

నవతెలంగాణ - రామడుగు : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పిన మార్గాలను అనుసరించి ముందుకు సాగి లక్ష్య సాధనకు కృషిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.ప్రతిమ విద్యార్థులకు సూచించారు. మండలంలోని గుండి అక్షర హైస్కూల్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చిన్న వయసులోనే లక్ష్యాలను నిర్దేశించుకుని నిరంతరం వాటికోసం కృషిచేయాలని అన్నారు. సోషల్ మీడియాకు దూరంగా వుండాలన్నారు. పలు చట్టాల గురించి వివరించారు. వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసారు. అనంతరం కరీంనగర్ న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కే.వెంకటేష్ మాట్లాడుతూ న్యాయ సేవాధికార సంస్థ సేవలను గ్రామీణ ప్రజలు వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో చొప్పదండి సీఐ గోపతి రవీందర్, రామడుగు ఎస్ఐ నేరెళ్ళ రమేష్‌గౌడ్, సర్పంచ్ గుండి మానసప్రవీణ్, న్యాయవాదులు, అల్ఫోర్స్, శ్రీ ప్రగతి, జెడ్పీహెచ్ఎస్ గుండి, జెడ్పీహెచ్ఎస్ గోపాలరావుపేట విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరణ




నవతెలంగాణ - సైదాపూర్ : కార్మికులకు, కర్షకులకు, ప్రజలకు అండగా ఉండే పత్రిక నవతెలంగాణ దినపత్రిక అని ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ మంజుల, ఎస్ఐ ఆరోగ్యం అన్నారు. శనివారం వారి కార్యాలయాల్లో నవతెలంగాణ దినపత్రిక క్యాలెండర్ ఆవిష్కరించి మాట్లాడారు. నిజాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, అన్యాయానికి వ్యతిరేకంగా నవతెలంగాణ పోరాడుతుందన్నారు.కార్యక్రమంలో ఏఎస్ఐ కొమురయ్య, డీటీ మల్లేశం, కార్యాలయ సిబ్బంది, నవతెలంగాణ మండల విలేకరి చంద్రమౌళి, ఏడీపీటీ ఇన్‌చార్జి రాజేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి మేళాకు రుక్మాపూర్ విద్యార్థిని ఎంపిక

నవతెలంగాణ - చొప్పదండి : కరీంనగర్ జిల్లాస్థాయి వర్చువల్ విజ్ఞానశాస్త్ర మేళాలో మండలంలోని రుక్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని పిరిశెట్టి హర్షవల్లిక జూనియర్ విభాగంలో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయుడు రఘు కిషోర్ తెలిపారు. స్మార్ట్ రోటి మేకర్ యూజింగ్ సోలార్ ఎనర్జీ ఎగ్జిబిట్ ప్రదర్శించి జిల్లాస్థాయిలో 262 ప్రదర్శనలో ఎంపిక అవ్వడం పట్ల ప్రధానోపాధ్యాయుడితోపాటు సైన్స్ ఉపాధ్యాయిని శ్రీవాణి, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రశాంతంగా జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష

7105 విద్యార్థులకు 5226 మంది హాజరు



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయ 2024-25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి ప్రవేశ పరీక్ష కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం ప్రశాంతంగా జరిగినట్లుగా విద్యాలయ ప్రిన్సిపాల్ పడమటి మంగతాయారు తెలిపారు. నవోదయ విద్యాలయంలో ఆరోతరగతిలో ప్రవేశానికి 80సీట్ల భర్తీకి మొత్తం7105 విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 5226 మంది పరీక్షకు హాజరయ్యారు. 73శాతం నమోదైంది. జవహర్ నవోదయ ప్రవేశ పరీక్ష ప్రిన్సిపాల్ పరిశీలించారు.

నవతెలంగాణ - హుజురాబాద్ : జవహర్ నవోదయ అర్హత ప్రవేశ పరీక్షలు హుజురాబాద్‌లో ప్రశాంతంగా జరిగినట్లు బ్లాక్ లెవెల్ అబ్జర్వర్, ఎంఈఓ కేతిరి వెంకట నరసింహారెడ్డి తెలిపారు. హుజురాబాద్ పట్టణంలో నవోదయ ప్రవేశ పరీక్ష కోసం రెండు కేంద్రాలను ఏర్పాటు చేయగా 375 మందికి 262మంది హాజరయ్యారని తెలిపారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

నవతెలంగాణ - కరీంనగర్ రూరల్ : నగునూర్ ప్రతిమ హాస్పిటల్, లయన్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఉచిత సూపర్ స్పెషాలిటీ మెగా వైద్య శిబిరం ఈ నెల 21న కరీంనగర్‌లో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సమాచారం కోసం ఫోన్ నెంబర్స్ 9441164416, 8074551172 ద్వారా సంప్రదించాలని సూచించారు.

బొడిగె గాలన్నకు ఎమ్మెల్యే నివాళి



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ భర్త బొడిగె గాలన్న అనారోగ్యంతో మృతిచెందగా శనివారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరామర్శించారు. గాలన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట నాయకులు పుల్కం నరసయ్య, బండపల్లి యాదగిరి, వీర్ల నరసింహారావు, గంగన్న, కర్ర విద్యాసాగర్‌రెడ్డి, సత్తు కనకయ్య, తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేలకు వినతి కార్యక్రమం జయప్రదం చేయండి..

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి


యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ - కరీంనగర్

సీఐటీయూ జిల్లా ఆఫీస్ ముకుందలాల్ మిశ్రాభవన్‌లో తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కరీంనగర్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆసోద రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ గౌరవ అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, చట్టాలను మారుస్తూ నిరంకుశంగా వ్యవహరిస్తుందని, దానికి నిరసనగా దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 16వ కార్మికవర్గం దేశవ్యాప్త సమ్మె చేయాలని నిర్ణయించిందన్నారు. సమ్మెలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమ్మె జయప్రదం చేయాలని వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేయాలని కోరారు. సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనగాం రాజమల్లు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని, చేసిన పనికి సరైన వేతనాలు లేక కుటుంబాలు అప్పుల ఊబిలో కురుకుపోతున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికులకు రూ.21000 అమలు చేస్తున్నారని, కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం కూడా మన తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులకు 21000 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అమలుకు ఈనెల 23 తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఈ కార్యక్రమం కరీంనగర్ జిల్లాలో కూడా విజయవంతం చేయాలని కోరారు. అనంతరం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కమిటీ ముద్రించిన 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముక్కెర బుజ్జమ్మ రాష్ట్ర కమిటీ సభ్యుడు కవ్వంపెల్లి రవి, కార్పొరేషన్ కమిటీ అధ్యక్షుడు దాసరి రాజమల్లయ్య, ఎండీ అజ్జు, రసపెల్లి సరోజ, వినోద, బండెల తిరుపతి, శంకర్, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

శిక్షణ కోసం మధురానగర్ చేరిన మిలటరి అధికారులు



నవతెలంగాణ - గంగాధర : కొత్తగా ఎంపికైన మిలటరి ఇంజనీరింగ్ అధికారులు అయిదుగురు శిక్షణ కోసం గంగాధర మండలం మధురానగర్ జీపీ చేరగా వారికి స్థానిక సర్పంచ్ వేముల లావణ్యఅంజి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల స్థితిగతులు, పల్లెల్లో చేపట్టిన అభివృద్ధి పనుల ప్రగతి, పనుల తీరుపై అధ్యాయనం చేయడానికి వీలుగా మిలటరీ ఇంజనీరింగ్ అధికారులుగా ఇక్కడికి చేరారు. కరీంనగర్ జిల్లాకు మిలటరి ఇంజనీరింగ్ అధికారులుగా ఎంపికైన 30 మంది రాగా, ఆరు గ్రూపులుగా విడిపోయి అయిదుగురు చొప్పున పలు జీపీలకు చేరారు. అయితే ఇక్కడికి చేరిన మిలటరి అధికారుల్లో పర్వేంద్ర సింగ్, హీరాలాల్ యాదవ్, మధన్‌లాల్ బెనివెల్, సిద్ధార్థ్ సింగ్, అనిరుధ్ సద్ది ఉన్నారు. వీరికి సర్పంచ్ లావణ్యతోపాటు ఎంపీడీవో మల్హోత్ర, ఎంపీవో జనార్ధన్‌రెడ్డి, గ్రామ కార్యదర్శి రాజు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

షానగర్ సబ్‌స్టేషన్ సెక్షన్‌గా ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ - రామడుగు : షానగర్ సబ్‌స్టేషన్ సెక్షన్‌గా ఏర్పాటు చేయాలని దేశరాజుపల్లి సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కోల రమేష్ అన్నారు. ఈ మేరకు కరీంనగర్ లోని ఎలక్ట్రికల్ ఎన్పీడీసీఎల్ ఎస్సీకి వినతిపత్రం శనివారం అందజేసి మాట్లాడారు. మండలంలోని ఎన్పీడీసీఎల్ ఎలక్ట్రికల్ గుండి సెక్షన్ ఒక్కటే ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రామడుగు మండల పర్యటనలో భాగంగా విన్నవించారు. కరీంనగర్ దరఖాస్తు సమాచారాన్ని వరంగల్ ఎంపీడీసీఎల్ సీఎండీకి పంపించినట్లు తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెరవేణి తిరుపతి ముదిరాజ్ ఉన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే


నవతెలంగాణ-గంగాధర : గంగాధర మండలం కొండన్నపల్లి ఉపసర్పంచ్ నిమ్మనవేణి ప్రభాకర్‌పై దాడి చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ డిమాండ్ చేశారు. నాలుగు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఉపసర్పంచ్ నిమ్మనవేని ప్రభాకర్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరచగా, ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరిన అతన్ని సుంకె పరామర్శించారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాగి మహిపాల్ రావు, సర్పంచ్ వేముల దామోదర్, నాయకులు ఉప్పుల గంగాధర్, రామిడి సురేందర్, ముద్దం నగేష్, తదితరులు ఉన్నారు.

గొర్రెలు మేకల పెంపకదార్ల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ - గన్నేరువరం : గొర్రెలు, మేకల పెంపకదార్ల సంఘం మండల అధ్యక్షుడు మీసం రాములు యాదవ్ అధ్వర్యంలో కరీంనగర్ జిల్లా క్యాలెండర్‌ను తహసీల్దార్ బిక్షపతి శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గొర్రెల మేకల పెంపకదార్ల సంఘం నాయకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాల్వ సురేష్ యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు జీల ఎల్లయ్య యాదవ్, మండల అధ్యక్షుడు సంబు రాజయ్య కురుమ, బండి తిరుపతి యాదవ్, మాదాపూర్ యాదవ సంఘం అధ్యక్షుడు గొడుగు రాజయ్య యాదవ్, హన్మాజిపల్లి సొసైటీ అధ్యక్షుడు తమ్మనవేణి శ్రీనివాస్ యాదవ్, జీఎంపిఎస్ మండల నాయకులు పాశం వేణు యాదవ్, పెంకర్ల ప్రశాంత్ యాదవ్, ముడికే అజయ్ యాదవ్ పాల్గొన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాలకు పాలాభిషేకం



నవతెలంగాణ - చొప్పదండి : చొప్పదండి మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద లెదర్ పార్క్ సాధన చర్మకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌కు తెలంగాణలోని లెదర్ ఇండస్ట్రియల్ నిర్మాణం కోసం వినతిపత్రం ఇచ్చిన సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రియల్ సాధన, చర్మ ఉత్పత్తిదారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రమేష్, జిల్లా కన్వీనర్ ఆరెల్లి నరసయ్య, మండల కన్వీనర్ చిలుముల రాజయ్య, ఉప కన్వీనర్లు రామగిరి శేఖర్, ప్రకాష్, ఆశపాక రమేష్, ఆరెల్లి సంపత్, రాజేష్, చంద్రయ్య, మహిళా విభాగం శ్యామలత, సత్య రాధ పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమంతప్పకుండా హాజరయ్యేలా చూడాలి

నవతెలంగాణ - రామడుగు


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ కర్ర సత్యప్రసన్నవెంకటరాంరెడ్డి

విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని గోపాలరావుపేట సర్పంచ్ కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి సూచించారు. గ్రామంలోని జెడ్పీహైస్కూల్‌ను శనివారం సందర్శించి మాట్లాడారు. అనంతరం మధ్యహ్న భోజనాన్ని పరిశీలించారు. హైస్కూల్ చైర్మన్ సాయిలు, ప్రధానోపాధ్యాయుడు వేణుకుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

Our client Mr K.S.Suresh chander Rao & others intended to purchase a open plot area 200 sq.yds East: Thota Mallesham, West: joga rao House, South: Kalyan & others, North: 30' feet road in Sy.no.1198 & in Part of house no.10-1-539, santhosh nagar, Karimnagar from Mr. N.Srinivas & others and entered into purchase agreement paid amount in advance. Any person or persons having any rights, title or intrest by way of inheritance or claims in writing to the undersigned along with documentry evidence in support of the said claim. Thereof within **(15) days** of publication of the said notice,failing which claim if any shall be deemed to have been waived.

Sd.
P.MURAHARI RAO& others
Advocates,
Flat.303, Reddy complex,
Ambedkar chowrasta,
Karimnagar. Cell No.9391153435

In the Court of the Hon'ble II Additional Junior Civil Judge : KARIMNAGAR
OS. No. 782 of 2022

Between :
1. Gunda Mallesham
2. Gunda Satyanarayana
3. Gunda Murali Krishna
4. Gunda Srinivas
S. Gunda Raman
6. Gonda laxman

... Plaintiffs 1 to 6

AND

1. The Thahesildar, karimnagar.
2. To whom so ever it may concerned

... Defendends 1 to 2

To
The Thahesildhar, Karimnagar

Where as the above named persons/ Petitioners were filled above petition for declaration that the plantiffs 1 to 6 were filled the legal heirs at the deceased "Gunda Anandam" who died on date: 19-07-2021 and "Gunda Laxmi" who predecesed of Gunda Anandam, Plantiff under order VII rules 1&2 R/Sec 26CPC. If anybody have any objection regarding to grant of for declaration that the plaintiffs 1 to 6 are the legal heirs of the decesed Gunda Anandam who died on dt: 19-07-2021.

In this As per order of the Hon'ble Court issued notices to the D1 i.e, The Thahesildhar Karimnagar several times through court & R.P., but the defendent No.1 managed to returned the notices. So it is therefore you have to attend before this Hon'ble court on **dt: 11-03-2024 time 10.30a.m.** for apperance through in person or through a pleader.

In default of your appearance the matter will be heard and determind in your absence.

Sd/-
MEKALA OMPRAKASH
ADVOCATE
H.No.8-3-137/1, Bhagathnagar,
KARIMNAGAR-505001.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 63,050	▲	100
22 క్యారెట్లు	- 57,800	▲	100
కిలో వెండి	- 77,000	▼	200



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ.	97
రిటైల్ (లైవ్)	రూ.	119
స్కిన్‌తో	రూ.	173
స్కిన్‌లెస్	రూ.	196

మిగిలింది పది రోజులే..!

2022-23 వానాకాలం సీఎంఆర్ చెల్లింపునకు ఈనెలాఖరే..

- మిల్లుల వారీగా సేకరిస్తున్న అధికారులు
- జాప్యం చేస్తున్న మిల్లులకు హెచ్చరికలు
- పది రోజులుగా సీరియస్‌గా దృష్టి కేంద్రీకరణ
- ఇప్పటివరకు మిల్లుల నుంచి వసూలైన సీఎంఆర్ 88.78శాతం
- పూర్తిస్థాయిలో సేకరిస్తామని అధికారుల దీమా



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి ఇచ్చే సీఎంఆర్ విషయంలో కొత్తగా కొలువుదీరిన సర్కారు లెక్కలు తేల్చే పనిలో పడింది. నాలుగైదు ఏండ్ల నుంచి మిల్లర్లు చేస్తున్న మాయాజాలంపై దృష్టి కేంద్రీకరించింది. పౌరసరఫరాల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఈ విషయంలో సీరియస్‌గా ఆరా తీస్తున్నారు. గత రెండు సీజన్లకు సంబంధించి ఆయా మిల్లులు ఎఫ్‌సీఐకి ఎంత బియ్యం ఇచ్చాయి.. ఇంకా ఇవ్వాల్సిన బియ్యం లెక్క ఎంత?, ఇచ్చిన గడువు.. పొడిగిస్తున్న తీరుపై ఇటీవల సమీక్షించారు. ఈనెల (జనవరి) 31లోగా మొత్తం బియ్యాన్ని మిల్లుల నుంచి రాబట్టాలని పౌరసరఫరాల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో జిల్లా యంత్రాంగాలు కూడా సీరియస్‌గా దృష్టి కేంద్రీకరించాయి. జాప్యం చేసే మిల్లులకు హెచ్చరికలు జారీ చేస్తూ ఎప్పటికప్పుడూ సీఎంఆర్‌ను ఎఫ్‌సీఐకి పంపుతున్నాయి. గడువులోపు పూర్తిస్థాయిలో ఎఫ్‌సీఐకి అప్పగిస్తామని అధికారులు దీమా వ్యక్తం చేస్తున్నారు.

2022-23 వానాకాలం సీఎంఆర్ బకాయిలు ఉన్న మిల్లర్లు ఈనెల 31లోపు తిరిగి ఇవ్వాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తప్పవని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హెచ్చరించిన విషయం తెలిసిందే. అందుకు తగినట్టుగానే పౌరసరఫరాల క్షేత్రస్థాయి సిబ్బంది రోజువారీ లక్ష్యం ప్రకారం మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీ చేయించే పనిలో నిగమ్నుయ్యారు. ఎప్పటికప్పుడూ జిల్లా అధికార యంత్రాంగానికి నివేదికలు సమర్పిస్తున్నారు. ఎఫ్‌సీఐ అధికారులు గోదాముల్లో సీఎంఆర్ నిల్వల కోసం అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలని, వచ్చే బియ్యాన్ని దిగుమతి చేసుకునేందుకు సరిపడా హమాలీలను సమకూర్చుకోవాలన్న సర్కారు ఆదేశాలతో చర్యలు చేపడుతున్నారు.

ఇంకా రావాల్సిన బియ్యం 22433.790 మెట్రిక్ టన్నులు

కరీంనగర్ జిల్లాలో 2022-23 వానాకాలం సీజన్‌కు సంబంధించి మొత్తం 296900.440 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో జిల్లా పరిధిలో 278516.760 మెట్రిక్ టన్నుల ధాన్యం రాగా, ఇతర జిల్లాల నుంచి 18383.680 ధాన్యాన్ని కొనుగోలు చేశారు. ఈ మొత్తం ధాన్యాన్ని జిల్లా పరిధిలోని మిల్లులకు కేటాయించారు. ఈ క్రమంలో వానాకాలం పంటకు సంబంధించిన ధాన్యం నుంచి క్వింటాకు 67కిలోల బియ్యం మిల్లుల నుంచి రావాల్సి ఉంటుంది. ఈ లెక్కన 1,99,901.890మెట్రిక్ టన్నుల బియ్యం కస్టమ్ మిల్లింగ్ రైస్ కింద ఎఫ్‌సీఐకి చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో ఇప్పటివరకు 1,77,468 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మిల్లులు తిరిగి చెల్లించాయి. అయితే పది రోజుల కిందటి వరకు 1.50లక్షల మెట్రిక్ టన్నులే వచ్చింది. కాగా అధికార యంత్రాంగం పట్టుతో పది రోజుల్లో శనివారం వరకు ఏకంగా 28వేల మెట్రిక్‌టన్నులు వసూలైంది. ఇంకా 22433.790 సీఎంఆర్ సేకరించాల్సి ఉండగా.. గడువులోపూ ఎట్టి పరిస్థితుల్లోనూ వసూలు చేస్తామని సివిల్ సప్లయ్ అధికారులు చెబుతున్నారు. మొత్తంగా ఇప్పటివరకు 88.78శాతం సీఎంఆర్ సేకరణ పూర్తి కాగా.. 12శాతం మిగిలి ఉండటం గమనార్హం.

ఏదేమైనా ఏండ్లుగా మిల్లులు చేస్తున్న మాయాజాలానికి ఇక నుంచి అయినా అడ్డుకట్ట వేయాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. మిల్లర్లు సీజన్ నుంచి మరో సీజన్ వచ్చే వరకు ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మర ఆడించి బయట అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటూ రూ.కోట్లలో అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఎఫ్‌సీఐకి ఇవాల్సిన బియ్యాన్ని తిరిగిచ్చే పనిలో మిల్లులు పడటం ప్రభుత్వ సొమ్ముకు కొంత గండిపడకుండా ఉండే అవకాశం కనిపిస్తోంది.

గడువులోపు సేకరిస్తాం రజనీకాంత్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ కరీంనగర్ జిల్లా మేనేజర్

ఈనెల 31లోపు 2022-23 వానాకాలం సీజన్ ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్‌ను సేకరిస్తాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడూ అప్రమత్తంగా బియ్యం సేకరించే పనిలో ఉన్నారు. ఇప్పటివరకు 90శాతం మేర సీఎంఆర్ వసూలు అయింది. మిగిలిన మొత్తాన్ని గడువు లోపు సేకరిస్తాం.

బిజినెస్

యూనియన్ బ్యాంక్ ఫలితాలు అదుర్స్

- క్యూ3 లాభాల్లో 60 శాతం వృద్ధి



హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం అక్టోబర్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో మొండి బాకీలకు కేటాయింపులు తగ్గడం, వడ్డీ ఆదాయంలో పెరుగుదలతో 60 శాతం వృద్ధితో రూ.3,590 కోట్ల నికర లాభాలు సాధించింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.2,249 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.24,154 కోట్లుగా ఉన్న బ్యాంక్ మొత్తం ఆదాయం.. క్రితం క్యూ3లో రూ.24,154కు చేరింది. బ్యాంక్ వడ్డీ ఆదాయం ఏకంగా రూ.25,363 కోట్లకు చేరింది. 2022-23 ఇదే క్యూ3లో రూ.20,883 కోట్ల వడ్డీ ఆదాయం చోటు చేసుకుంది. 2023 డిసెంబర్ 31 నాటికి యూనియన్ బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ) 4.83 శాతానికి తగ్గాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి 7.93 శాతానికి జీఎన్‌పీఏ చోటు చేసుకుంది. ఇదే సమయంలో నికర నిరర్థక ఆస్తులు 2.14 శాతంగా ఉండగా.. 2023 డిసెంబర్ ముగింపు నాటికి 1.08 శాతంగా చోటు చేసుకున్నాయి.

భారీగా తగ్గిన ఐడీబీఐ బ్యాంక్ ఎన్‌పీఏలు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన తృతీయ త్రైమాసికం (క్యూ3)లో ఐడీబీఐ బ్యాంక్ 57.3 శాతం వృద్ధితో రూ.1,458 కోట్ల నికర లాభాలు సాధించింది. కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసి కీలక వాటాలు కలిగిన ఈ బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 17.4 శాతం పెరిగి రూ.3,434.60 కోట్లకు చేరింది. 2023 డిసెంబర్ ముగింపు నాటికి బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు ఏకంగా 4.69 శాతానికి దిగివచ్చాయి. ఇంతక్రితం ఏడాది ఇదే కాలానికి ఏకంగా 13.82 శాతం జీఎన్‌పీఏ చోటు చేసుకుంది. 2023 సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలోని 4.90 శాతం స్థూల ఎన్‌పిఎలతో పోల్చితే.. గడిచిన క్యూ3లో తగ్గుదల చోటు చేసుకుంది. నికర నిరర్థక ఆస్తులు 1.08 శాతం నుంచి 0.34 శాతానికి తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభాలు 60 శాతం పెరిగి రూ.4,006 కోట్లుగా, నికర వడ్డీ ఆదాయం 29 శాతం వృద్ధితో రూ.10,499 కోట్లుగా నమోదయ్యింది.

కొటాక్ మహీంద్రా బ్యాంక్‌కు రూ.3,005 కోట్ల లాభాలు

కొటాక్ మహీంద్రా బ్యాంక్ 2023 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో 7.63 శాతం వృద్ధితో రూ.3,005.01 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. 2022 ఇదే త్రైమాసికంలో రూ.2,791.88 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో సంస్థ నికర వడ్డీ ఆదాయం రూ.5,653 కోట్లుగా ఉండగా.. గడిచిన త్రైమాసికంలో 16 శాతం వృద్ధితో రూ.6,554 కోట్లకు చేరాయి. బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తులు 1.90 శాతం నుంచి 1.73 శాతానికి తగ్గాయి. నికర నిరర్థక ఆస్తులు 0.43 శాతం నుంచి 0.34 శాతానికి పరిమితమయ్యాయి.

ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్, ఏఎంఎస్‌టీ ఏవియేషన్ మధ్య ఒప్పందం




హైదరాబాద్ : ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్, ఆస్ట్రియా దేశానికి చెందిన ఏఎంఎస్‌టీ ఏవియేషన్ సంస్థలు పరస్పరం ఒప్పందాలను కుదుర్చుకున్నాయి. పైలట్ శిక్షణకు సంబంధించి హైదరాబాద్‌లో జరుగుతున్న వింగ్స్ ఇండియా 2024 ప్రదర్శనలో భాగస్వామ్యాన్ని ప్రకటించాయి. ఈ ఒప్పందం ద్వారా పైలట్ శిక్షణ కోసం ఎఎంఎస్‌టి ఏవియేషన్ సంస్థ మూడు అత్యాధునిక ఎ320నియో, బి737 మాక్స్ 2024 ఎయిర్ ఫాక్స్ ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్‌ల ట్రైనింగ్ సర్వీస్ లను ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్‌కి అందిచనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా మెరుగైన పైలట్ శిక్షణను అందిస్తూ.. దేశంలోనే అగ్రగామిగా నిలిచేందుకు ఈ ఒప్పందం దోహదం చేయనుందని ఆర్బిట్ ఫ్లైట్ ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ కౌశిక్ మానెపల్లి తెలిపారు.

ద్రవ్యోల్బణ కట్టడే లక్ష్యం : ఆర్‌బీఐ గవర్నర్

న్యూఢిల్లీ : ద్రవ్యోల్బణాన్ని కట్టడి చేయడమే రిజర్వ్ బ్యాంక్ తొలి ప్రాధాన్యతని గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆ తర్వాతే వడ్డీ రేట్ల తగ్గింపు యోచన ఉంటుందన్నారు. వడ్డీ రేట్లను ఇప్పట్లో తగ్గించే ఆలోచనేమీ లేదన్నారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతానికి తగ్గించడంపైనే దృష్టి కేంద్రీకరించామన్నారు. వడ్డీ రేట్ల తగ్గింపుపై చర్చ కూడా జరగడం లేదన్నారు.

ఎన్‌కోర్-ఆల్కమ్ సీఎండీకి ప్రశంసలు

- ఆకర్షిస్తున్న సంస్థ ఉత్పత్తులు



హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్ వేదికగా జరుగుతున్న ఏస్‌టెక్ ట్రేడ్ ఫెయిర్‌లో ఎన్‌కోర్-ఆల్కమ్ ఉత్పత్తులు ఆకటు్టకుంటున్నాయి. ఆ సంస్థ స్టాల్‌ను శనివారం అదానీ పోర్ట్స్, లాజిస్టిక్స్ కార్పొరేట్ అఫైర్స్ ఎపి, తెలంగాణ హెడ్ పి అంజి రెడ్డి, రిలయన్స్ కార్పొరేట్ అఫైర్స్ ప్రతినిధి రవినాథ్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఎన్‌కోర్-ఆల్కమ్ ఫౌండర్, సిఎండి అవుతు శివ కోటి రెడ్డి, ఆల్కమ్ డైరెక్టర్ జయంతి భాయ్ మనుభాయ్, ఎన్‌కోర్ డైరెక్టర్లు అవుతు పవన్ కుమార్ రెడ్డి, శ్రీ హర్షను వారు అభినందించారని ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. స్టాల్ లో 1.8 టన్నుల బరువున్న 18 అడుగుల ఎత్తైన విండోను ప్రదర్శిస్తున్నామని అవుతు శివ కోటి రెడ్డి తెలిపారు. కంపెనీ తయారు చేస్తున్న విభిన్న, వినూత్న ఉత్పత్తులు ఇక్కడ కొలువుదీరాయన్నారు.

రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలను నియంత్రించాలి

- అక్రమ వెంచర్లపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేసి నియంత్రించాలనీ, అక్రమ వెంచర్లపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.నాగయ్య, ఆర్.వెంకట్రాములు డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లో ఈ మేరకు రెరా చైర్మెన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం బృందం వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసైన్డ్, చెరువు శిఖం, టెనెంట్ భూములు, లిటికేషన్ భూములను రైతుల నుంచి మార్కెట్ కన్నా తక్కువ ధరలకు కొంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాటి ధరలను కోట్ల రూపాయలకు పెంచి పేదల సొమ్మును కొల్లగొడుతున్నారని విమర్శించారు. రెరా అనుమతులు లేకున్నా సినీహీరోలు, ఆర్టిస్టులు, సెలబ్రిటీలతో ఇష్టానుసారంగా ప్రకటనలు ఇస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న రియల్ ఎస్టేట్ సంస్థలపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఆ వ్యవస్థపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చటం వల్ల వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని వాపోయారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో పర్యావరణాన్ని, వ్యవసాయాన్ని, సహజసంపదను ధ్వంసం చేస్తున్న తీరును వివరించారు. రియల్ ఎస్టేట్ నయా భూస్వామ్య విధానాన్ని నియంత్రించాలనీ, లేనిపక్షంలో ఉద్యమాలను తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బి.ప్రసాద్, బి.పద్మ కె.జగన్, కె.మల్లేశ్, శ్రీను, కుమార్, సైదులు, పెంటయ్య బొల్లు యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

ఆ పులి కోసం మా దగ్గర బోనుంది

(మొదటిపేజీ తరువాయి)

అందరూ కలిసి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం ఆనందంగా ఉందన్నారు.

36 నెలల్లో థేమ్స్ తరహాలో మూసీ నది అభివృద్ధి

థేమ్స్ నది చూశాననీ, ఒకప్పుడు అక్కడ కలుషితమైన వాతావరణముండేదని రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల సహకారంతో దాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా, వ్యాపార కేంద్రంగా మారిందని గుర్తు చేశారు. తెలంగాణలో మూసీ నది కాలుష్యంతో మురికి కూపంగా మారిందన్నారు. థేమ్స్‌తో పోటీ పడేలా మూసీ ప్రాజెక్టును అభివృద్ధి చేయాలనీ, హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంతో పోటీ పడే విధంగా నడిపించాలని అన్నారు. 55 కిలోమీటర్ల మూసీ నదిని పూర్తిగా పునరుజ్జీవంగావించి ప్రజల ముందుంచాలనే గొప్ప లక్ష్యంతో ఈ పర్యటనకు వచ్చానని చెప్పారు. రాబోయే 36 నెలల్లో థేమ్స్ నదీ తరహాలో మూసీ నదిని అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రప్రంచంలోని పర్యాటకులందరూ మూసి నది అందాలను తిలకించడానికి హైదరాబాద్‌ను సందర్శించేలా చేస్తామన్నారు. గోల్కొండ, చార్మినార్, కులీకుతూబ్ షాహి టూంబ్స్‌ను చూడాలని కోరారు. నెక్లెస్‌రోడ్ మీద ఫోటోలు దిగాలనీ, మన చారిత్రక వారసత్వ సంపదను ప్రపంచానికి పరిచయం చేసే బాధ్యత తమ ప్రభుత్వం మీద ఉందని వివరించారు. అందుకు ప్రజలే బ్రాండ్ అంబాసిడర్లుగా మారాలని విజ్ఞప్తి చేశారు.

కేసీఆర్ పాలనను బంగాళాఖాతంలో విసిరేశారు

రాష్ట్రంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో తండాలు, గూడాలు, మారుమూల పల్లెలు, పట్టణాలు, నగరాల నుంచి ఇతర దేశాలలో ఉన్న అభిమానులు, మిత్రులు, కార్యకర్తలు, వాళ్ల బంధువులు, కుటుంబ సభ్యులు, సానుభూతి పరులందరినీ సమన్వయం చేశామని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని పట్టి పీడిస్తున్న ఒక కుటుంబం చెరనుంచి తెలంగాణను విముక్తం చేశామన్నారు. తెలంగాణ తల్లికి విముక్తి కల్పించేందుకు అందరూ కృషి చేశారని చెప్పారు. అందుకే ఒక దశాబ్ద కాలం పీడ కలగా మారిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) పాలనను బంగాళఖాతంలో విసిరేశారని అన్నారు.

రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

20 ఏండ్లు ప్రతిపక్షంలో, ప్రజల్లో ఉంటూ సమస్యలమీద పోరాటం చేస్తూ నిత్యం వాటి పరిష్కారం కోసం అందరి మధ్యలో ఉన్నానని రేవంత్‌రెడ్డి చెప్పారు. అందుకే ప్రజలు గుండెల్లో పెట్టుకుని, భుజాలమీద మోసి తెలంగాణ ముఖ్యమంత్రిగా తనకు అవకాశమిచ్చారని అన్నారు. పునర్నిర్మాణంలో అందరి భాగస్వామ్యం తప్పనిసరి అని చెప్పారు. సముచితమైన నిర్ణయాలు తీసుకుంటూ తెలంగాణకు పెట్టుబడులను తేవాలన్న లక్ష్యంతో అధికారుల బృందంతో దావోస్‌కు వెళ్లానని వివరించారు. 48 గంటల్లో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చి రాష్ట్ర ప్రభుత్వం మీద అంతర్జాతీయ సంస్థలకు, పెట్టుబడిదారులకు ఒక నమ్మకం, విశ్వాసం కలిగించామని చెప్పారు. పెట్టుబడులకు కేంద్రంగా తెలంగాణను నిలబెట్టామని అన్నారు.

ప్రపంచంలోనే హైదరాబాద్ ప్రసిద్ధి

ఈ దేశంలోనే కాదు ప్రపంచంలోనే హైదరాబాద్ నగరం ప్రసిద్ధి గాంచిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. ఈ అభివృద్ధిలో ఇందిరాగాంధీ కృషి ఎంతో ఉందన్నారు. హైదరాబాద్ సరిహద్దుల్లో బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, డైనమిక్ లిమిటెడ్, ఐడీపీఎల్ ఇలా ఎన్నో సంస్థలను ఆమె నెలకొల్పారని గుర్తు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌కు అప్పుడే గుర్తింపు వచ్చిందన్నారు. దేశానికి కంప్యూటర్లు పరిచయం చేసింది అప్పటి ప్రధాని రాజీవ్‌గాంధీ అని అన్నారు. సంక్షేమానికి నందమూరి తారకరామారావు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఆరాధ్యులని వారి సేవలను కొనియాడారు. ఐటీ, అధునాతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ రంగం చూసినా ఆనాటి నాయకులు చేసిన అభివృద్ధికి, దానికి సహకరించిన విధానాలను కొనసాగించాలనే ఆలోచనతో అడుగులేస్తున్నామని వివరించారు. మంచి ఎవరు చేసినా ఆ పనులకు ఎవరు పునాది రాయి వేసినా వాటిని పాటించడానికి, కొనసాగించడానికి తమ ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి భేషజాల్లేవన్నారు.

ఆర్థిక సంక్షోభం నుంచి అభివృద్ధి పథంవైపు తెలంగాణ

కొంతమంది కుటుంబం కోసం రాష్ట్రాన్ని ఫణంగా పెట్టి లక్షలాది కోట్ల రూపాయలు దోపిడీ చేసి ఇప్పుడు అభివృద్ధి గురించి చర్చలే జరగొద్దంటున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ప్రజలకు వివరించొద్దంటూ మాట్లాడుతున్నారని చెప్పారు. 60 ఏండ్లలో 16 మంది ముఖ్యమంత్రులు తెచ్చిన అప్పు రూ.72 వేల కోట్లయితే, ఒకే ఒక్క కుటుంబం ఈ పదేండ్లలోనే రూ.ఏడు లక్షల కోట్లు అప్పు చేసిందని వివరించారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల ఊబిలో ముంచిందని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు జీతభత్యాలు ఇవ్వలేని పరిస్థితి తెలంగాణలో ఉందన్నారు. ప్రతి నెల మొదటి వారం ఐదో తేదీలోపు జీతాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉంటే, 25 వరకు కూడా జీతాలు ఇవ్వలేని పరిస్థితి ఉండేదని అన్నారు. తెలంగాణ ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోతే తాను సీఎం అయ్యాక ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొదటి నెలలోనే ఐదో తేదీలోపు జీతాలు చెల్లించామన్నారు. ఈ ఆర్థిక సంక్షోభం నుండి తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపిస్తామని చెప్పారు.

వందరోజుల్లో ఆరు గ్యారంటీల అమలు

ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారు. గతనెల తొమ్మిదిన అసెంబ్లీ మొదలు పెట్టిన మొదటి రోజే గ్యారంటీలు ఎప్పుడు అమలు చేస్తారంటూ బిల్లా రంగాలు (కేటీఆర్, హరీశ్‌రావు) మాట్లాడారని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ఆ పార్టీనీ ఆ నాయకులను బొక్కబోర్ల పడేసి బొక్కలు ఇరగ్గొట్టినా బుద్ధి రాలేదన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో చూసుకుందామని బీఆర్ఎస్ నేతలకు ఆయన సవాలు విసిరారు. 26వ తేదీ తర్వాత ఇంద్రవెల్లిలో మొదలు పెట్టి రాష్ట్రం నలుమూలలా సుడిగాలి పర్యటన చేస్తానని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నిషాన్ లేకుండా వంద మీటర్ల గోతి తీసి పాతిపెడతానని అన్నారు.

సామాన్య రైతు కుటుంబం నుంచి వచ్చా...

ఎన్నికలప్పుడే రాజకీయం, మిగతా సమయంలో పరిపాలనా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని రేవంత్‌రెడ్డి చెప్పారు. అభివృద్ధి, సుపరిపాలన వైపు రాష్ట్రాన్ని నడిపాలంచాలన్న ఆలోచనతో అందరినీ సమన్వయం చేసుకుని ముందుకు వెళ్తుంటే కొందరు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. తాను సామాన్యమైన రైతు కుటుంబం నుంచి వచ్చినవాణ్నేనని అన్నారు. నల్లమల అడవిలోంచి రైతు బిడ్డగా అతి సామాన్యమైన కుటుంబం నుంచి కార్యకర్తగా మొదలై ఇన్నేండ్లలో ముఖ్యమంత్రి హోదాకు చేరుకున్నానని వివరించారు. తాను ఆషామాషీగా సీఎం కాలేదన్నారు. అయ్యో, బాబో ఇస్తే ఇది రాలేదనీ, అయ్య పేరు చెప్పుకుని మంత్రి అయి విలాసవంతమైన జీవితాన్ని గడిపేటందుకు రాలేదని కేటీఆర్‌నుద్దేశించి ఎద్దేవా చేశారు.

ప్రపంచంతోనే పోటీ

కర్నాటకో, తమిళనాడో, ఆంధ్రప్రదేశో, ఒడిశాతోనో పోటీ పడాలని రాలేదనీ, అది తన లక్ష్యం కాదని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ ప్రపంచంతోనే పోటీ పడాలనే ఆలోచనతో ఉన్నానని చెప్పారు. ప్రపంచంతోనే పోటీ పడే ఐటీ హబ్ హైదరాబాద్‌కు ఉందనీ, లక్షలాది మంది ఐటీ నిపుణులున్నారని వివరించారు. ప్రపంచానికే వ్యాక్సిన్లను ఎగుమతి చేసి వాటిని కనిపెట్టిన సంస్థలు తెలంగాణ గడ్డ మీద ఉన్నాయని చెప్పారు. రాహుల్ గాంధీ కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు నాలుగు వేల కిలోమీటర్లకుపైగా పాదయాత్ర చేశారని అన్నారు. అందరి బాధలు విన్నారని చెప్పారు. కర్నాటక, తర్వాత తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలో అందరి సహకారంతో లాల్ ఖిలాపై కాంగ్రెస్ జెండా ఎగరవేయబోతున్నామని అన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కసీటూ రాదు

- కృష్ణా జలాలపై ఢిల్లీకి అఖిలపక్షాన్ని ఎందుకు తీసుకుపోలేదు?
- బీజేపీ మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్కసీటు కూడా రాదనీ, కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీశ్‌రావు, సంతోశ్‌కుమార్ పోటీచేసినా ఓటమి తప్పదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎం.రఘునందన్‌రావు ఎద్దేవాచేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కృష్ణా జలాల్లో 299 టీఎంసీల వాటాకు ఒప్పందం చేసుకుంది కేసీఆరేననీ, ఒకవేళ తెలంగాణకు అన్యాయం జరిగితే అఖిలపక్షాన్ని ఢిల్లీకి ఎందుకు తీసుకుపోలేదని ప్రశ్నించారు.

తెలంగాణకు 299 టీఎంసీలు చాలని కృష్ణా జలాల పంపకాల సమావేశంలో కేసీఆర్ సంతకం పెట్టింది వాస్తవం కాదా? ఈ విషయం ఆనాడు నీటిపారుదల శాఖ మంత్రిగా ఉన్న హరీశ్‌రావుకు తెలియదా? అని ప్రశ్నించారు. ఎన్నికలు వస్తే బీజేపీని బద్నాం చేసేందుకు ప్రచారం మొదలుపెడుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ ప్రజలకు ఏం లాభం జరిగిందో అమరవీరుల స్థూపం వద్దకు వచ్చి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో అందరికంటే ఎక్కువ స్థానాలను తమ పార్టీ గెలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఉద్యమకారులు, కార్యకర్తలకు కనీసం గౌరవించకపోవడం వల్లనే నేడు ఆ పార్టీకి ఇలాంటి దుస్థితి దాపురించిందని విమర్శించారు.

పార్లమెంటు ఎన్నికల్లో వందలకోట్లు సమర్పించుకున్న వారికే బీఆర్ఎస్ టిక్కెట్లు అమ్ముకుంటారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్ రెడ్డి, రాణా ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

జలాశయాలలో సోలార్ విద్యుత్ కేంద్రాలు వద్దు!

- తెలంగాణ ఫిషరీస్ సొసైటీ అభ్యంతరం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని జలాశయాల్లో సౌరశక్తి ఆధారంగా నీటిపై తెలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రతిపాదనలను బేషరతుగా విరమించుకోవాలని తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మెన్ పిట్టల రవీందర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అన్ని జలాశయాలలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడాన్ని ఆయన ఒక ప్రకటనలో తప్పుపట్టారు. సర్కారు తీసుకునే నిర్ణయం వల్ల రాష్ట్రంలో లక్షలాదిమంది మత్స్యకారుల ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎంపిక చేసిన కొన్ని జలాశయాలలో నీటిపై తేలియాడే సోలార్ విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాలను నెలకొల్పాలని ప్రతిపాదించిందనీ, దానితో ఉత్పన్నమయ్యే సామాజిక, పర్యావరణ సంబంధమైన సమస్యలపై తమ సంస్థ వ్యక్తం చేసిన అభిప్రాయాలను మన్నించి వాటి నిర్మాణాన్ని పక్కకు పెట్టిందని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలోని 130 రిజర్వాయర్లలో దాదాపు రెండు లక్షల మంది మత్స్యకారులు జీవనోపాధిని పొందుతున్నారనీ, ఫ్లోటింగ్ సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల చేపల వేటకు తీవ్రమైన ఆటంకాలు తలెత్తుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ ప్రతిపాదనలు విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అయోధ్యలో కొత్త మసీదు నిర్మాణం మేలో ప్రారంభం

- పూర్తవటానికి మూడు నుంచి నాలుగేండ్ల సమయం
- ఐఐసీఎఫ్ డెవలప్‌మెంట్ కమిటీ హెడ్ వెల్లడి

న్యూఢిల్లీ : యూపీలోని అయోధ్యలో కొత్త మసీదు నిర్మాణం మేలో ప్రారంభం కానున్నది. ఈ మేరకు ఈ విషయాన్ని మసీదు నిర్మాణాన్ని పర్యవేక్షిస్తున్న ఇండో-ఇస్లామిక్ కల్చరల్ ఫౌండేషన్ (ఐఐసీఎఫ్) హెడ్ హాజీ అర్ఫాత్ షేక్ వెల్లడించారు. పవిత్ర రంజాన్ మాసం తర్వాత మసీదు నిర్మాణం మొదలవుతుందని చెప్పారు. మసీదు నిర్మాణాన్ని పూర్తి చేయటానికి మూడు నుంచి నాలుగేండ్లు పడుతుందని తెలిపారు. కాగా, అయోధ్యలోని బాబ్రీ మసీదును 1992లో హిందూత్వ శక్తులు కూల్చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి న్యాయస్థానంలో ఈ వివాదం పెండింగ్‌లో ఉండగా.. 2019, నవంబర్ 9న భారత అత్యున్నత న్యాయస్థానం అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి అనుకూలంగా తీర్పును వెలువర్చింది. దీంతో అయోధ్యలోని సదరు వివాదాస్పద ప్రదేశంలో రామ మందిర నిర్మాణం జరుగుతున్న విషయం విదితమే. బదులుగా, ముస్లిం పక్షానికి న్యాయస్థానం అయోధ్యలో ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని ఆదేశాలు ఇచ్చింది. దీంతో ప్రస్తుత అయోధ్య రామాలయానికి 25 కిలోమీటర్ల దూరంలో ఐదెకరాల స్థలంలో మసీదు నిర్మాణం జరగనున్నది.

ఎంపీ కాంగ్రెస్‌లో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు

- 150 మంది నాయకులకు నోటీసులు

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ పార్టీలో పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినందుకు 150 మంది నాయకులకు నోటీసులు జారీ అయ్యాయి. గతేడాది నవంబర్‌లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహించారని స్థానిక నాయకులు కొందరిపై ఆరోపణలు వచ్చాయి. అయితే, ఈ విషయంపై స్పందించిన మధ్యప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ సమావేశమైంది. అనంతరం ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ నాయకులకు నోటీసులు జారీ చేసింది. పదిరోజుల్లో తగిన సమాధానం తెలపాలని ఆదేశించింది. సంతృప్తికరమైన సమాధానం లేకపోతే పార్టీ నుంచి తొలగిస్తామని సదరు నాయకులను కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ నోటీసుల్లో హెచ్చరించింది. ఈ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చీఫ్, ఎంపీసీసీ కోశాధికారి అశోక్ సింగ్ తెలిపారు. కాగా, గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఓటమి చెందగా.. బీజేపీ మరోసారి అధికారంలోకి వచ్చిన విషయం విదితమే. 230 సీట్లకు గానూ బీజేపీ 163 స్థానాలను గెలుచుకోగా.. కాంగ్రెస్ కేవలం 66 నియోజకవర్గాలకు మాత్రమే పరిమితమైంది.

డీఎంకే ఏ మతానికీ వ్యతిరేకం కాదు

- మసీదు కూల్చివేతను మాత్రం ఒప్పుకోదు : తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్

చెన్నై : అయోధ్యలో బాబ్రీ మసీదు నిర్మాణాన్ని కూల్చివేసి, రాముని గుడిని నిర్మించటంపై డీఎంకే కీలక నాయకుడు, తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. డీఎంకే పార్టీ ఏ మతానికీ వ్యతిరేకం కాదనీ, మసీదు కూల్చివేతను మాత్రం సమర్థించదని అన్నారు. "మేము (డీఎంకే) ఏ మతానికి గానీ, మత విశ్వాసానికి గానీ వ్యతిరేకం కాదని కలైంజర్(కరుణానిధి) ఎప్పుడో చెప్పారు. కానీ మసీదును కూల్చివేసి ఆ ప్రదేశంలో గుడిని నిర్మించటాన్ని మేము ఒప్పుకోం. మా పార్టీ కోశాధికారి టి.ఆర్. బాలు చెప్పినట్టే రాజకీయాలను, ఆధ్యాత్మికతను కలపకూడదన్న విషయంలో మేము స్పష్టంగా ఉన్నాం" అని ఉదయనిధి స్టాలిన్ అన్నారు.



మహనీయుడు కోరిన మహిళా ఉద్యమం

'ప్రతి వంటగత్తె ఓ రాజకీయవేత్త కావాలి' అని సోవియట్ కమ్యూనిస్ట్ విప్లవ వీరుడు లెనిన్ ఏనాడో కలలు కన్నాడు. కానీ నేటికీ మన దేశంలో చాలా మంది మహిళలు ఇంకా వంటగదికే పరిమితం చేయబడుతున్నారు. ముఖ్యంగా గత పదేండ్లుగా మనువాదుల పాలనలో దేశం మగ్గిపోతున్నది. మహిళల పరిస్థితి మరింత దిగజారిపోతున్నది. ఎన్నో పోరాటాలు చేసి నాలుగ్గోడలు దాటి అడుగు బయట పెట్టిన ఆమెను తిరిగి గదిలో బంధించే ప్రయత్నం మతోన్మాదుల కనుసన్నల్లో తీవ్రంగా జరుగుతుంది. ఇటువంటి నేపథ్యంలో మహిళా అభ్యున్నతిని కలలు కన్న ప్రపంచ కమ్యూనిస్టు వైతాళికుడైన లెనిన్ మహాశయుని శత వర్ధంతి జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా ఆయన కోరిన మహిళా ఉద్యమం గురించి మననం చేసుకోవడం, ఆయన మార్గంలో నడవడం నేటి మహిళా లోకానికి అత్యవసరం.

1933 నాటికి మహిళా ఉద్యమ నేత క్లారాజెట్కిన్‌కు డెబ్బై ఐదేండ్లు నిండాయి. ఊపిరి పీల్చుకోవడానికి ప్రతి నిమిషానికీ గిజగిజలాడి పోతున్న సమయం అది. అప్పటికే తన శక్తి నానాటికి ఉడిగి పోతున్నట్టు ఆమె గ్రహించింది. అయితే పని చేయడం మాత్రం మానుకోలేదు. మృత్యుశయ్యపై పరుండి ప్రపంచ మహిళలకు లెనిన్ ప్రసాదించిన హక్కుల పత్రాన్ని ఆమె రాసింది. దానిలోని చివరి వాఖ్యలు.. "ఒక మహోలక్ష్యం ప్రపంచాన్ని వెలుగొందజేస్తున్నది. ఈ చరిత్రాత్మక సమయంలో ఎడతెగని పోరాటం జరపవలసిన అవసరం ఎంతైనా ఉంది. కష్టపడి పని చేసే స్త్రీలందరూ తమ కర్తవ్యాన్ని గుర్తించి, తదనుగుణమైన పోరాటం సాగించ వలసిన తరుణం వచ్చింది. స్త్రీలలో గల స్వల్ప అంతరువులు ఈ పవిత్రమైన సమయంలో అడ్డు రాకూడదు. అజ్ఞాతంగావున్న ఊరూ-పేరూ లేని కోట్లాది వీరవనితల్లారా, మీరు విస్తృత ప్రాతిపదికపై పయనించండి. మీ లక్ష్యం తప్పక సిద్ధిస్తుంది. లెనిన్ ప్రసాదించిన హక్కుల పత్రాన్ని అమలు పరచే వారిలో మీ స్థానాన్ని తప్పక స్వీకరించండి. చిరస్మరణీయమైన ఆయన ఉపదేశాలను, రచనలను ప్రపంచమంతటా అమలులో పెట్టండి. లెనిన్ ఆశయాన్ని ఆచరణలోపెట్టే భాగ్యానికి మీరే నోచుకోండి. లెనిన్‌కు నిజమైన శిష్యురాండ్రుకండి" అంటూ రాశారు.

అత్యవసర భాగంగా...

క్లారా జెట్కిన్ అంటే లెనిన్‌కి చాలా అభిమానం. సమర్ధతగల విప్లవకారిణిగా, సంపూర్ణ మార్క్సిస్టుగా, రెండవ ఇంటర్నేషనల్లో అవకాశవాదానికి బద్ధశత్రువుగా ఆమెను లెనిన్ చాలా గౌరవించేవారు. అనేక విషయాలను గూర్చి ఆమెతో మనసువిప్పి మాట్లాడేవారు. ఆమెతో జరిపిన సంభాషణలు ఆయనకు ఆనందం కలిగించేవి. లెనిన్‌ని గూర్చి క్లారా స్మృతులు, ఆయనను గూర్చి ఆమె రాసిన వ్యాసాలు, ఇచ్చిన ఉపన్యాసాలు ఆయన పట్ల ఆమెకు ఎంతటి గౌరవభావం వుండేదో తెలియజేస్తాయి. 'మహిళల హక్కులను గురించిన సమస్యను లెనిన్ నాతో అనేక సార్లు చర్చించారు. మహిళా ఉద్యమం సాధారణంగా ప్రజా ఉద్యమంలో అత్యవసర భాగంగా ఉంటుందనీ, కొన్ని పరిస్థితుల్లో అది నిర్ణయాత్మక పాత్ర వహించ వచ్చుననీ ఆయన అభిప్రాయం. కనుకనే లెనిన్ మహిళా ఉద్యమానికి చాలా ప్రాముఖ్యతనిచ్చారు. స్త్రీలకు సమాన హక్కులనేది ప్రతి కమ్యూనిస్టుకు ప్రధానమైన నిర్వివాదమైన అంశమని లెనిన్ భావన' అంటారు క్లారా.

మహిళలు లేకుండా కష్టం

'అంతర్జాతీయ కమ్యూనిస్టు మహిళా ఉద్యమానికి బోల్షివిక్ పార్టీ మాత్రమే అమూల్యమైన, తర్ఫీదు పొందిన, కాకలు తీరిన కార్యకర్తలను అందజేసింది. అదే సమయంలో చరిత్రలో గొప్ప మార్గదర్శిగా కూడా ఉంది' అని క్లారా అంటే... లెనిన్ చిన్న మందహాసంతో 'అది పూర్తిగా నిజమే. శ్రామిక వర్గ మహిళలు పెట్రో గ్రాడ్‌లోనూ, మాస్కో లోనూ ఇంకా దూరంగా ఉన్న పట్టణాలు, పారిశ్రామిక కేంద్రాల్లోనూ విప్లవం కొనసాగుతున్నప్పుడు అద్భుతమైన కృషి చేశారు. వారు లేకుండా మనం విజయం సాధించగలిగి వుండే వాళ్ళం కాదు. లేదంటే ఉద్యమం విజయవంతం కావడం చాలా కష్టంగా మారేది. వారు పడుతున్న బాధలు, లేమిని సహించ డంలో వారి ఓర్పు ఎటువంటిదో ఒకసారి ఆలోచించండి. వారు సోవియట్‌ను రక్షించుకోవాలనుకొంటున్నారు. కాబట్టే స్వాతంత్ర్యాన్ని, కమ్యూనిజాన్నీ కోరుతున్నారు. కాబట్టే ఇవన్నీ సహించుతున్నారు' అన్నారు.



మహిళా ఉద్యమాన్ని తప్పక నిర్మించాలి

ఇంకా ఆమె లెనిన్‌ను గుర్తు చేసుకుంటూ "1920లో నన్ను మర్యాదకపూర్వకంగా పలకరించిన తర్వాత లెనిన్ నాతో మాట్లాడుతూ 'స్పష్టమైన నిశ్చితమైన సిద్ధాంత ప్రాతిపదికపై శక్తివంతమైన అంతర్జాతీయ మహిళా ఉద్యమాన్ని మనం తప్పకుండా నిర్మించాలి. మార్క్సిస్టు సిద్ధాంతం లేకుండా సరియైన ఆచరణ ఉండబోదు, ఇది స్పష్టం. దురదృష్టవశాత్తు రెండవ ఇంటర్నేషనల్ మహాసభ మహిళా సమస్యను చర్చించకుండా వదిలి వేసింది. ప్రస్తావించినా దీనిపై ఒక నిశ్చితమైన వైఖరి అవలంభించడానికి వ్యవధి లేకపోయింది. కమిటీ దశలోనే ఇది నిలిచిపోయింది' అన్నారు.

కమ్యూనిజం ద్వారానే మహిళా విముక్తి

మహిళా ఉద్యమ అవసరం గురించి క్లారాతో మాట్లాడుతూ లెనిన్ 'మొదట మీరు మహిళా ఉద్యమంలో పని చేసే కార్యకర్తల సమావేశంలో ఉపన్యసించి, తర్వాత దాని విషయంపై చర్చించడం మంచిది. దీనిపై ఒక థీసిస్ రాయండి. దాన్నొక కమిటీ పరిశీలిస్తుంది. మహిళల విముక్తి కమ్యూనిజం ద్వారానే సాధ్యమని మీ థీసిసులో నొక్కి చెప్పాలి. ఉత్పత్తి సాధనాలపై యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తులకున్నంత కాలం మహిళలు మానవ మాత్రులుగా, సమాజ సభ్యులుగా జీవించజాలరని స్పష్టం చేయాలి. ఈ రెంటికిగల సంబంధం పరిష్కార సాధ్యం కాదని విశదీకరించాలి. మహిళల విముక్తికై సాగే బూర్జువా ఉద్యమాల నుండి మన ఉద్యమాన్ని వేరు చేసుకోవాలి. ఆ విధంగా మహిళా సమస్యలను సామాజిక సమస్యల్లో, కార్మిక వర్గ సమస్యల్లో భాగంగా పరిశీలించడానికి పునాది ఏర్పరచిన వారమవుతాం. తద్వారా దాన్ని శ్రామికవర్గపోరాటంతో, విప్లవంతో దృఢంగా బంధించబడే వీలుపడుతుంది. మహిళా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజా ఉద్యమంగా వుండాలి. మొత్తం ప్రజా ఉద్యమంలో అదొక భాగంగా ఉండాలి. ఒక్క శ్రామికోద్యమంలో భాగంగానేగాక, పీడిత ప్రజలందరి ఉద్యమంలో, అణచబడిన వారందరి ఉద్యమంలో, పెట్టుబడిదారీ విధానానికి బలి అయ్యే వారందరి ఉద్యమంలో భాగంగా మహిళా ఉద్యమం ఉండాలి. కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడం శ్రామికవర్గ చారిత్రాత్మక కర్తవ్యం. ఈ వర్గపోరాటంలో మహిళా ఉద్యమ ప్రాముఖ్యత చాలా వుంది. మన పోరాటంలో ముఖ్యంగా కమ్యూనిస్టు నిర్మాణంలో పట్టణాలలోని, పల్లెలోని శ్రామిక మహిళలను లక్షల సంఖ్యలో సమీకరించాలి. మహిళలు లేకుండా నిజమైన ప్రజా ఉద్యమం ఉండజాలదు.


క్లారాజెట్కిన్‌తో లెనిన్

మహిళా కమ్యూనిస్టు ఉద్యమం ప్రజా ఉద్యమంగా వుండాలి. మొత్తం ప్రజా ఉద్యమంలో అదొక భాగంగా ఉండాలి. ఒక్క శ్రామికోద్యమంలో భాగంగానేగాక, పీడిత ప్రజలందరి ఉద్యమంలో, అణచబడిన వారందరి ఉద్యమంలో, పెట్టుబడిదారీ విధానానికి బలి అయ్యే వారందరి ఉద్యమంలో భాగంగా మహిళా ఉద్యమం ఉండాలి. కమ్యూనిస్టు సమాజాన్ని నిర్మించడం శ్రామికవర్గ చారిత్రాత్మక కర్తవ్యం.

ప్రత్యేక సంఘాలు అవసరం

నిర్మాణ రంగంలో మనం చేసే కార్యాలు మన సిద్ధాంత అవగాహన నుండి ఉద్భవిస్తాయి. స్త్రీలైనా, పురుషులైనా కమ్యూనిస్టు పార్టీలో సమాన హోదాగల సభ్యులే. వారందరికీ సమానమైన విధులు, హక్కులు ఉంటాయి. ఈ విషయంలో అభిప్రాయ భేదాలు లేవు. మహిళలను చైతన్యవంతం చేయడం, పార్టీతో వారికి సాన్నిహిత్యం కలిగించి పార్టీ పలుకుబడి కిందికి వారిని తీసుకురావడానికి కమ్యూనిస్టులు క్రమబద్ధంగా పని చేయాలి. నిస్తబ్ధత నుండి బయటపడి కార్యరంగంలో ప్రవేశిస్తున్న మహిళలలో



బోధనా కార్యక్రమం తీసుకురావాలి. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన జరిగే శ్రామిక వర్గ పోరాటాల్లో వారిని సమీకరించి విజ్ఞానవంతుల్ని చేయాలి. మిల్లుల్లో పని చేసే స్త్రీలు, తమ కుటుంబాలకు వంటవండే శ్రామిక మహిళలు మాత్రమే కాదు నా దృష్టిలో ఉన్నది. రైతు స్త్రీ, మధ్యతరగతిలో కింది శ్రేణికి చెందిన వివిధ తరగతుల మహిళలు కూడా నా మనసులో ఉన్నారు. వీరంతా పెట్టుబడిదారీ విధానానికి బలౌతున్నవారే. అయితే వారికి రాజకీయాల్లో అభిరుచి ఉండదు. సమాజ వ్యతిరేక మనస్తత్వం, వెనుకబడిన మనస్తత్వం వీరిలో ఎక్కువగా కనిపిస్తుంది. వీరి కార్యకలాపాలు బహుపరిమితమైనవి. వారి జీవిత విధానంలోనూ ప్రత్యేకత ఉంటుంది. కాబట్టి ఇలాంటి మహిళలతో పని చేయడానికి ప్రత్యేక సంఘాలుండాలి. ప్రత్యేక ఆందోళనా పద్ధతులు అవసరం. అంతేగాక నిర్మాణంలో ప్రత్యేక రూపాలు అవసరం. ఇది బూర్జువా 'స్త్రీ జనోద్ధరణ' కాదు. ఆచరణలో విప్లవానికి అత్యావశ్యకమైన విషయం' అంటూ పంచుకున్నారు.

లెనిన్ శత వర్ధంతి స్మృతిలో...
(మహిళా ఉద్యమం పట్ల లెనిన్ దృక్పథం గూర్చి క్లారాజెట్కిన్ జ్ఞాపకాలు)

ప్రాణ ప్రతిష్ట రోజు సెలవెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటనకు సంబంధించిన ఏ విధానమైనా అధికారంలో ఉన్న రాజకీయ పార్టీ ఇష్టాలపై ఆధారపడి ఉండకూడదని వారు తమ పిటిషన్‌లో వాదించారు. దేశభక్తి కలిగిన లేదా చరిత్రకు సంబంధించిన వ్యక్తిని గుర్తు చేసుకునేందుకు సెలవు ప్రకటించవచ్చునని, కానీ సమాజంలో ఓ వర్గాన్ని లేదా మతాన్ని సంతృప్తి పరచడానికి సెలవు ఇవ్వరాదని తెలిపారు. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం ప్రకారం సెలవులు ప్రకటించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు కట్టబెడుతూ 1968 మే 8న హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన నోటిఫికేషన్‌ను కూడా న్యాయ శాస్త్ర విద్యార్థులు సవాలు చేశారు. 'విద్యా సంస్థల్ని మూసివేస్తే చదువులకు నష్టం వాటిల్లుతుంది. బ్యాంకింగ్ సంస్థల్ని మూసివేస్తే ఆర్థిక నష్టం జరుగుతుంది. ప్రభుత్వ కార్యాలయాలను మూసివేస్తే పరిపాలనకు సంబంధించిన పనులు నిలిచిపోతాయి' అని పిటిషనర్లు వివరించారు. 'సెలవులు ప్రకటించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారాన్ని కల్పించే చట్టం ఏదీ లేదు. లౌకిక స్వభావం కలిగిన మార్గదర్శకాలూ లేవు. ఇలాంటి పరిస్థితుల్లో మెజారిటీ సమాజాన్ని...అది కూడా రాజకీయ ఉద్దేశాల కోసం...ప్రసన్నం చేసుకునేందుకు ఇలాంటి ప్రకటనలు చేయడం అధికార దుర్వినియోగమే అవుతుంది. అది భారత లౌకిక స్వరూపాన్ని నాశనం చేస్తుంది' అని తెలిపారు. రామ మందిర ప్రాణ ప్రతిష్ట కోసం సెలవు ప్రకటించడం ప్రభుత్వ ఖజానాకు ఖర్చే తప్ప మరోటి కాదని, ఇలాంటి వాటిని రాజ్యాంగంలోని 27వ అధికరణ నిషేధిస్తోందని పిటిషనర్లు వాదించారు.

ఆరు గ్యారంటీల అమలు కోసం పోరాడుతాం : కాసం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆరు గ్యారంటీల అమలు కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల పక్షాన పోరాడుతామని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల ముందు ఏవేవో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఎందుకు ఆదేశించడం లేదు? కాంట్రాక్టర్ల నుంచి కమీషన్లు గుంజడం కోసమా? కేసీఆర్ కుటుంబాన్ని అవినీతి నుంచి రక్షించడం కోసమా? అని ప్రశ్నించారు. జ్యుడీషియల్ విచారణ పేరుతో కాలయాపన చేసేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన విషయంలో దశదిశా లేదనీ, పదవుల మోజులో రాజకీయం చేద్దామనే ఆలోచనలో ఆ పార్టీ నేతలున్నట్టు కనిపిస్తున్నదని విమర్శించారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో అవినీతి జరిగిందని మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంటి వారే ప్రకటిస్తున్నారనీ, అలాంటప్పుడు బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అదానీది అవినీతి సొమ్ము అయితే తెలంగాణలో పెట్టుబడుల కోసం అతని కంపెనీతో ఎలా ఒప్పందం చేసుకున్నారని రేవంత్‌రెడ్డిని నిలదీశారు.

కొమురవెల్లిలో కొత్త రైల్వే స్టేషన్

- రైల్వే మంత్రికి ధన్యవాదాలు తెలిపిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కొమురవెల్లి దేవాలయానికి వెళ్లే భక్తుల కోసం కొమురవెల్లిలో రైల్వే స్టేషన్ ఏర్పాటు చేసేందుకు రైల్వే శాఖ ఆమోదం తెలపడం పట్ల కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ రైల్వే స్టేషన్ ఏర్పాటులో ప్రత్యేక చొరవ తీసుకున్న రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈమేరకు శనివారం కిషన్‌రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. కొమురవెల్లి రైల్వే హాల్ట్ స్టేషన్ కోసం పలుమార్లు లేఖ రాశాననీ, ఈ అంశాన్ని ప్రత్యేకంగా రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లానని పేర్కొన్నారు. మనోహరాబాద్ - కొత్తపల్లి మధ్యన నిర్మిస్తున్న కొత్త రైల్వే మార్గంలో లక్డారం - దుద్దెడ స్టేషన్ల మధ్యన కొమురవెల్లిలో కొత్త హాల్ట్ స్టేషన్ నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. కొమురవెల్లి మల్లన్న భక్తులకు మోడీ ప్రభుత్వం ఇచ్చిన కానుక ఇది అని పేర్కొన్నారు.

మేడారం జాతరకు మరో రూ.30 కోట్లు

(మొదటిపేజీ తరువాయి)

చేయడానికి అవసరమైన నిధులు, ఉన్న అడ్డంకులు, ఫారెస్టు క్లియరెన్స్‌లు, అవసరమైన భూసేకరణపై అధికారులతో చర్చించామన్నారు. నీటిపారుదల శాఖ, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పురోగతి, పేరుకుపోయిన బిల్లుల పరిష్కారంపై ఆరాతీశామన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి దేవాదుల తదితర ప్రాజెక్టుల పనులు పూర్తి కాలేదని, ప్రధాన కాలువల నిర్మాణం పూర్తి చేయకుండానే లక్షలాది ఎకరాలకు సాగునీరిచ్చినట్టు గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేసుకుందని తెలిపారు.

మిషన్ భగీరథ పథకం కింద గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సైతం తాగునీరందడం లేదని చర్చల్లో తమ దృష్టికి వచ్చినట్టు చెప్పారు. వేసవి కాలం వస్తున్న నేపథ్యంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించినట్టు తెలిపారు. గత ప్రభుత్వం జారీ చేసిన 59 జీవోతో ప్రభుత్వ భూములు కబ్జా అయ్యాయని, వాటిపై దృష్టి సారించి ఆ భూములు పేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ప్రజా అవసరాల మేరకు మాస్టర్‌ప్లాన్‌లో సవరణలు చేసి అమలు చేస్తామని ఒక ప్రశ్నకు వివరణనిచ్చారు.

మూడు నెలల్లో 'కాళోజీ' పూర్తి

కాళోజీ కళాక్షేత్రాన్ని పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వంలో మరో 3 నెలల్లో పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జిల్లాల పునర్విభజన సున్నితమైన అంశమని, ప్రజాభిప్రాయం మేరకే మార్పులుంటాయన్నారు. నాడు వైఎస్ఆర్ నిర్మించిన ఇందిరమ్మ ఇండ్లకు తగ్గకుండా కొత్తగా ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తామని తెలిపారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్టుగానే 200 యూనిట్లలోపు వారికి కరెంటు బిల్లులు మాఫీ చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే నెలలో మేడారం జాతర ఉన్న నేపథ్యంలో ఈనెల 30న మేడారం వచ్చి అక్కడ ఏర్పాట్లను పరిశీలించనున్నట్టు తెలిపారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించిందని, ఒక్కో నియోజకవర్గంలో రూ.300 కోట్ల మేరకు శంకుస్థాపనలు చేసి పనులు చేయకుండా వదిలేసిందని మంత్రి కొండా సురేఖ విమర్శించారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో 40 మంది సర్పంచ్‌లు ఆత్మహత్యలు చేసుకున్నారని విప్ డాక్టర్ రామచంద్రునాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్‌లకు బిల్లులు చెల్లించని నాటి మంత్రి కేటీఆర్ ఇప్పుడు సర్పంచ్‌ల బిల్లుల గురించి మాట్లాడడం విడ్డూరమన్నారు. విలేకరుల సమావేశంలో పరకాల, భూపాలపల్లి, వరంగల్ పశ్చిమ, పాలకుర్తి, వర్ధన్నపేట, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, నాయిని రాజేందర్‌రెడ్డి, యశస్వినీరెడ్డి, కె.ఆర్ నాగరాజు, డాక్టర్ మురళీనాయక్, ఆయా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆవిర్భావం

మార్చి3,4,5 తేదీల్లో ఖమ్మంలో ఆలిండియా మహాసభ : సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా కార్యదర్శి పోటు రంగారావు వెల్లడి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మూడు విప్లవ పార్టీలైన సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా, పీసీసీ సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్) రివల్యూషనరీ ఇన్షియేటివ్ కలిసి సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీగా ఏర్పడాలని నిర్ణయించాయని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి, ఐక్యతా సమావేశ ఆర్గనైజింగ్ సెక్రటరీ పోటురంగారావు తెలిపారు. సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ఆవిర్భావం సందర్భంగా ఖమ్మంలో మార్చి 3,4,5 తేదీల్లో ఆలిండియా మహాసభను జరుపుతామని తెలిపారు. మూడోతేదీ బహిరంగ సభ ఉంటుందనీ, నాలుగు, ఐదు తేదీల్లో 300 మంది ప్రతినిధులతో మహాసభ జరుగుతుందని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని మార్క్స్‌భవన్‌లో మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ..ఆర్ఎస్ఎస్, బీజేపీ దేశాన్ని మత ప్రాదిపదికన చీల్చాలని చూస్తున్నాయని విమర్శించారు. మోడీ సర్కారు ఓవైపు దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నదనీ, మరోవైపు ప్రజలను మతం పేరుతో విభజిస్తున్నదని వివరించారు. నేడు దేశంలో లౌకిక, ప్రజాస్వామ్య విలువలకు పెను ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను సాధించడం కోసం రాముడినీ, మతాన్నీ పెద్ద ఎత్తున బీజేపీ వాడుకుంటున్నదని విమర్శించారు. మతసామరస్యాన్ని కోరుకునేవారంతా బీజేపీ రాజకీయ కోణాన్ని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య భారత దేశం కోసం, సోషలిస్టు



వ్యవస్థ స్థాపన కోసం తాము కృషిచేస్తామన్నారు. ఇతర విప్లవ శక్తులను కలుపుకుని బలమైన విప్లవోద్యమాన్ని నిర్మిస్తామని చెప్పారు. సీపీఐ(ఎంఎల్)ఆర్ఐ రాష్ట్ర కార్యదర్శి గడ్డం సదానందం మాట్లాడుతూ.. శత్రువులంతా ఒక్కటవుతుంటే కమ్యూనిస్టు పార్టీలు మాత్రం చీలిపోతుండటం ఆందోళన కరమన్నారు. విప్లవం కోసం పనిచేస్తున్న వారంతా ఒకే పార్టీగా ఐక్యంగా కావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, సీపీఐ(ఎంఎల్)ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కేజీ.రామచందర్, కె.రంగారెడ్డి, కె.రమ, వి.కృష్ణ, ఆర్.చంద్రశేఖర్, చంద్ర అరుణ, ఎం. అన్వేశ్, ఎస్-ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

రెండు దేశాల ఏర్పాటే శాశ్వత పరిష్కారం

(మొదటిపేజీ తరువాయి)

తీవ్ర విమర్శలు, ఖండనలు వెల్లువెత్తిన తరుణంలో జై శంకర్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రస్తుతం గాజాలో నెలకొన్న పరిస్థితులు ఎలా వున్నాయో మనందరికీ తెలుసు, ఆ మానవతా సంక్షోభాన్ని పరిష్కరించేందుకు అరకొర చర్యలు సరిపోవు, అక్కడి బాధితులకు తక్షణమే ఉపశమనం కలిగించగల శాశ్వత పరిష్కారం అవసరమని' జై శంకర్ స్పష్టం చేశారు. తీవ్రవాదం, బందీలుగా నిర్బంధించడం కూడా ఎంత మాత్రమూ ఆమోదయోగ్యం కాదని మనం స్పష్టం చేయాల్సి వుందన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌లోని సంక్షోభాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. ఆధునిక కాలంలో ఎక్కడ, ఏ సమయంలో ఘర్షణలు చెలరేగినా వాటి పర్యవసానాలు అన్ని చోట్లా వుంటాయని చెప్పారు. స్వేచ్ఛాయుత పాలస్తీనా దేశం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. సురక్షితమైన సరిహద్దుల మధ్య పాలస్తీనియన్లు ప్రశాంతంగా జీవించేలా రెండు దేశాల ఏర్పాటు ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా మనందరం ఉమ్మడిగా కృషి చేయాలని కోరారు. ఏ పక్షం తీరును కూడా జై శంకర్ ఖండించలేదు. పాలస్తీనాకు భారత్ అందించిన మానవతా సాయం గురించి మాత్రమే పునరుద్ఘాటించారు. ఇప్పటివరకు భారత్ 70టన్నుల సాయాన్ని అందించిందన్నారు. వాటిలో 16.5 టన్నుల ఔషధాలు, వైద్య సామాగ్రినే వున్నాయన్నారు. ఇటీవల టెహరాన్‌లో పర్యటించిన జై శంకర్ ప్రాంతీయ పరిస్థితులపై, ఎర్ర సముద్రంలో భద్రతకు ఎదురవుతున్న ముప్పులపై ఇరాన్ నేతలతో చర్చించారు. గాజా యుద్ధం ఆరంభమైనప్పటి నుండి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోడీలు పశ్చిమాసియా ప్రాంత నేతలతో మాట్లాడుతునే వున్నారు. శుక్రవారం బహ్రైన్, ఈజిప్ట్ విదేశాంగ మంత్రులతో జై శంకర్ భేటీ అయ్యారు. పశ్చిమసియాలో నెలకొన్న పరిస్థితులపై వారి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం క్యూబా ఉపాధ్యక్షుడు సాల్వడార్ వాల్డెస్ మీసా నామ్ సదస్సులో మాట్లాడుతూ, గాజాపై ప్రస్తుతం ఇజ్రాయిల్ సాగిస్తున్న యుద్ధం ఇప్పటివరకు చరిత్రలో నమోదైన అత్యంత దారుణమైన మారణహోమాల్లో ఒకటని అన్నారు.

కరెంటు బిల్లులు కట్టొద్దు

(మొదటిపేజీ తరువాయి)

పక్కనబెట్టి ముందు మీరు వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను అమలు చేయండి...' అని హితవు పలికారు. రేవంత్ అహంకారంతో మాట్లాడుతున్నారనీ, అలాంటి వారిని బీఆర్ఎస్ తన ప్రస్థానంలో కొన్ని వేల మందిని చూసిందని వ్యాఖ్యానించారు. మఖలో పుట్టి పుబ్బలో పోయే పార్టీ అంటూ అనేక మంది తమ పార్టీని అవమానించారనీ, కానీ రెండున్నర దశాబ్దాలుగా నికరంగా నిలబడి, రేవంత్ లాంటి అనేక మందిని అది మట్టికరిపించిందని హెచ్చరించారు. తెలంగాణ జెండా (బీఆర్ఎస్)ను ఎందుకు బొందపెడ్తవ్..? తెలంగాణను తెచ్చి, అభివృద్ధి చేసినందుకా..? మీ దొంగ హామీలను ప్రశ్నించినందుకా..? అని నిలదీశారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలు కలిసి పోయాయనీ, రానున్న పార్లమెంటు తర్వాత కూడా అవి ఇదే రకంగా వ్యవహరిస్తాయని విమర్శించారు. కాంగ్రెస్‌కు రేవంత్ ఒక ఏకనాథ్ షిండేలా మారటం ఖాయమని చురకలంటించారు. ఆయన రక్తమంతా బీజేపీదేనని ఘాటుగా వ్యాఖ్యానించారు. రేవంత్ ఒక చోటా మోడీలా మారిపోయారు, గతంలో అదానీ గురించి అడ్డగోలుగా మాట్లాడిన ఆయన... ఇప్పుడు రోజూ అదే అదానీ వెంట పడుతున్నారని విమర్శించారు. డబుల్ ఇంజిన్ అంటే అదానీ, ప్రధాని అని పేర్కొన్న సీఎం... ఇప్పుడు వారికి ట్రిపుల్ ఇంజిన్‌గా మారారని దుయ్యబట్టారు. స్విట్జర్లాండ్‌లో అదానీ, రేవంత్ అలయ్ బలయ్ చేసుకున్నారని అన్నారు. వారి ఒప్పందాల అసలు లోగుట్టును బయటపెట్టాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

కిషన్... ఐదేండ్లలో ఏం ఒరగబెట్టారు...?

సికింద్రాబాద్ నుంచి ఎంపీగా ఎన్నికై కేంద్ర మంత్రి పదవిని చేపట్టిన కిషన్‌రెడ్డి... గత ఐదేండ్ల నుంచి రాష్ట్రానికి ఏం ఒరగబెట్టారని కేటీఆర్ ప్రశ్నించారు. ప్రపంచంలోనే అతి పెద్ద ఎత్తిపోతల పథకాన్ని కేసీఆర్ కడితే, కిషన్‌రెడ్డి మాత్రం సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్‌లోని లిఫ్టులను జాతికి అంకితం చేశారని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రిగా ఇదే ఆయన చేసిన అతి పెద్ద పనంటూ విమర్శించారు. రాష్ట్రంలో బీజేపీని నిలువరించేది, అడ్డుకునేది ముమ్మాటికీ బీఆర్ఎస్సేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఆ పార్టీతో తమకు గతంలో పొత్తు లేదు, భవిష్యత్తులోనూ ఉండబోదని స్పష్టం చేశారు.

సివిల్ సప్లయిస్‌ను నిర్వీర్యం చేశారు

(మొదటిపేజీ తరువాయి)

గొప్పలు చెప్పుకుందని ఆరోపించారు. ధనిక రాష్టాన్ని కేసీఆర్ చేతుల్లో పెడితే అప్పుల కుప్పగా మార్చారని విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో 2.82 కోట్ల మంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసినప్పుడు కూడా సివిల్ సప్లయిస్ శాఖకు ఇంత అప్పుల భారం లేదని గుర్తు చేశారు. ఎంత భారం ఉన్నా లబ్ధిదారులకు ఇబ్బందులు రాకుండా బియ్యం పంపిణీ చేయడంతో పాటు రైతుల ధాన్యం కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. అలాగే విద్యార్థులకు సన్న బియ్యం కొనుగోలు చేసి సరఫరా చేస్తామన్నారు. పౌరసరఫరా శాఖలో జరిగిన ఆర్థిక అరాచకత్వం గురించి వాస్తవాలు ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందన్నారు.

ఖర్చు రూ.94 వేల కోట్లు, ఆయకట్టు 40 వేల ఎకరాలు

గత ప్రభుత్వం రూ. 94వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల 40 వేల ఎకరాల కొత్త ఆయకట్టు మాత్రమే సాగులోకి వచ్చిందని భట్టి విమర్శలు గుప్పించారు. వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూ.38వేల కోట్లతో ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు చేపడితే ఇప్పుడు 16లక్షల ఎకరాలకు సాగు నీరందుతుందని వ్యాప్కో సంస్థ తేల్చగా దాన్ని రీడిజైన్ చేసి కాళేశ్వరం పేరుతో రూ.లక్ష కోట్లకు పెంచారని ఆరోపించారు. మేడిగడ్డ డిజైన్‌లోనే భారీ లోపం ఉందని ప్రాథమికంగా గుర్తించామన్నారు. కృష్ణానది పై ఉన్న ప్రాజెక్టులను కేఆర్ఎంబీ బోర్డుకు ఈ ప్రభుత్వం అప్పగించలేదని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాతే సీలేరులోని ఏడు మండలాలు ఏపీకి పోయాయన్నారు. డిటెక్టివ్ మైండ్ సెట్ ఉన్నోళ్లే కరెంట్ బిల్లు కట్టొద్దని సూచిస్తారని మాజీ మంత్రి కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శించారు.

కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేరళ ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ధర్నాలో పాల్గొనాలన్న ఎల్‌డీఎఫ్ ఆహ్వానాన్ని కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ తిరస్కరించింది. యూడీఎఫ్ తీసుకున్న నిర్ణయంపై కేరళ రాజకీయ వర్గాల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది.

స్వైటెక్‌కు షాక్

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. మహిళల సింగిల్స్‌లో టైటిల్ ఫేవరేట్లు వరుసగా ఇంటి బాట పడుతున్నారు. వరల్డ్ నం.1, టాప్ సీడ్ ఇగా స్వైటెక్ (పోలాండ్)కు మూడో రౌండ్లో పరాజయం ఎదురైంది. చెక్ రిపబ్లిక్ అమ్మాయి లిండా నోస్కోవా మూడు సెట్ల పోరులో స్వైటెక్‌కు చెక్ పెట్టింది. అగ్రశ్రేణి క్రీడాకారిణీలు వరుసగా టోర్నీ నుంచి నిష్క్రమిస్తుండగా.. మహిళల సింగిల్స్‌లో మరోసారి కొత్త చాంపియన్‌కు మార్గం సుగమం అవుతోంది!. అలెగ్జాండర్ జ్వెరెవ్, కార్లోస్ అల్కరాజ్,డానిల్ మెద్వదేవ్‌లు మెన్స్ సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించారు.



- లిండా నోస్కోవా చేతిలో ఓటమి
- మూడో రౌండ్లో నిష్క్రమించిన టాప్ సీడ్
- మెద్వదేవ్, జ్వెరెవ్, అల్కరాజ్ ముందంజ

ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



మెల్‌బోర్న్ (ఆస్ట్రేలియా)

మహిళల సింగిల్స్‌లో వరల్డ్ నం.1కు చుక్కెదురైంది. టైటిల్ ఫేవరేట్‌గా మెల్‌బోర్న్‌లో అడుగు పెట్టిన పోలాండ్ స్టార్ ఇగా స్వైటెక్ వేట మూడో రౌండ్లోనే ముగిసింది. అన్‌సీడెడ్ చెక్ రిపబ్లిక్ అమ్మాయి లిండా నోస్కోవా మూడు సెట్ల సమరంలో స్వైటెక్‌పై సంచలన విజయం సాధించింది. 140 నిమిషాల మహా సమరంలో 3-6, 6-3, 6-4తో స్వైటెక్‌పై లిండా నోస్కోవా గెలుపొందింది. మహిళల సింగిల్స్ ప్రీ క్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించింది. పురుషుల సింగిల్స్‌లో డానిల్ మెద్వదేవ్ (రష్యా), అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ), కార్లోస్ అల్కరాజ్ (స్పెయిన్) అంచనాలను అందుకున్నారు. మూడో రౌండ్లో అలవోక విజయాలు నమోదు చేసి ప్రీ క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకున్నారు.

లిండా నోస్కోవా సూపర్

వయసు 19 ఏండ్లు. వరల్డ్ ర్యాంక్ 50. గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో ఎన్నడూ రెండో రౌండ్ దాటలేదు. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌కు చేరుకుంది. ప్రీ క్వార్టర్స్ రేసులో వరల్డ్ నం.1 ఇగా స్వైటెక్‌తో పోరు. చెక్ రిపబ్లిక్ యువ స్టార్‌పై ఎవరికీ పెద్దగా అంచనాలు లేవు. అందుకు తగినట్టుగానే తొలి సెట్ సాగింది. 6-3తో ఇగా స్వైటెక్ తొలి సెట్‌ను సొంతం చేసుకుంది. 1-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇక మరో సెట్ నెగ్గితే ప్రీ క్వార్టర్స్‌లో ప్రవేశం. కానీ రెండో రౌండ్లో మొదలైంది లిండా నోస్కోవా మెరుపుల్. 4 ఏస్‌లు, ఓ బ్రేక్ పాయింట్ సహా 14 విన్నర్లు సాధించిన లిండా నోస్కోవా.. స్వైటెక్‌కు చెమటలు పట్టించింది. 3-3తో ఉత్కంఠగా సాగుతున్న మ్యాచ్‌ను ఏకపక్షం చేసింది. 4-3తో ఆధిక్యంలో నిలిచిన లిండా నోస్కోవా.. స్వైటెక్ సర్వ్‌ను బ్రేక్ చేసి 5-3తో ముందంజ వేసింది. అలవోకగా తన సర్వ్‌ను నిలుపుకుని 6-3తో రెండో సెట్‌ను సొంతం చేసుకుంది. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో సెట్‌కు తీసుకెళ్లింది. చావోరేవో తేల్చుకోవాల్సిన మూడో సెట్‌లో లిండా నోస్కోవా జోరు కొనసాగించింది. ఆరంభంలోనే స్వైటెక్ సర్వ్‌ను బ్రేక్ చేసింది. 2-1తో ముందంజ వేసింది. స్వైటెక్ సైతం పుంజుకుని బ్రేక్ పాయింట్‌తో సమవుజ్జీగా నిలిచింది. ఈ సమయంలో స్వైటెక్‌ను ఒత్తిడిలో నెట్టి స్వేచ్ఛగా షాట్లు ఆడిన లిండా నోస్కోవా 5-3తో ముందంజ వేసింది. 4-5తో స్వైటెక్ పుంజుకునే ప్రయత్నం చేసినా.. సర్వ్‌ను నిలుపుకున్న లిండా నోస్కోవా సెట్‌తో పాటు ప్రీ క్వార్టర్స్ బెర్త్ దక్కించుకుంది. చెక్ రిపబ్లిక్ అమ్మాయికి ఓ గ్రాండ్‌స్లామ్ ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టడం ఇదే ప్రథమం. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో లిండా నోస్కోవా 10 ఏస్‌లు, మూడు బ్రేక్ పాయింట్లతో మెరిసింది. పాయింట్ల పరంగా 95-91తో పైచేయి సాధించింది. మూడు సెట్ల మ్యాచ్‌లో స్వైటెక్ 13 గేములు గెల్చుకోగా.. లిండా నోస్కోవా 15 గేములు సాధించింది. లిండా నోస్కోవా 35 విన్నర్లతో పైచేయి సాధించగా.. 33 అనవసర తప్పిదాలతో స్వైటెక్ మూల్యం చెల్లించుకుంది. మహిళల సింగిల్స్ ఇతర మ్యాచుల్లో ఊహించిన ఫలితాలే వచ్చాయి. 11వ సీడ్ జెలెనా ఒస్టాపెంకో 1-6, 5-7తో విక్టోరియా అజరెంక చేతిలో పరాజయం పాలైంది. అజరెంక 11 ఏస్‌లు, నాలుగు బ్రేక్ పాయింట్లతో సత్తా చాటింది. అమెరికా స్టార్ స్లోనె స్టిఫెన్స్ మూడు సెట్ల మ్యాచ్‌లో నిరాశపరిచింది. 7-6(10-8), 1-6, 4-6తో అనా కలిన్‌స్కాయకు ప్రీ క్వార్టర్స్ బెర్త్ కోల్పోయింది. ఎలినా స్విటోలినా 6-2, 6-3తో గోలుబిక్‌పై గెలుపొందింది. జాస్మైన్ పాలోని 7-6(7-1), 6-4తో అనా బ్లింకోవాను ఓడించింది. చైనా అమ్మాయిల పోరులో వాంగ్ యఫాన్‌పై 6-4, 2-6, 7-6(10-8)తో జెంగ్ గెలుపొందింది. ఫ్రాన్స్ అమ్మాయిల ఢీలో క్లారా బురెల్‌పై ఒసియనె డొడిన్ 6-2, 6-4తో విజయం సాధించింది. ఎమ్మా నవారో 2-6, 6-2, 1-6తో డయాన చేతిలో పరాజయం చెందింది.

అల్కరాజ్, మెద్వదేవ్ జోరు

పురుషుల సింగిల్స్‌లో స్టార్ ఆటగాళ్లు మెప్పిస్తున్నారు. ఓ ఎండ్‌లో నొవాక్ జకోవిచ్ దూసుకెళ్తుండగా, మరో ఎండ్ నుంచి యువ స్టార్స్ జోరు చూపిస్తున్నారు. రెండో సీడ్, స్పెయిన్ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ గార్పియ ప్రీ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. మూడో రౌండ్లో చైనా ఆటగాడు షాంగ్‌పై 6-1, 6-1, 1-0తో విజయం సాధించాడు. తొలి రెండు సెట్లను అలవోకగా నెగ్గిన అల్కరాజ్ మూడో సెట్‌లో 1-0తో ఉండగా.. చైనా ఆటగాడు వాకోవర్ ఇచ్చాడు. 3 ఏస్‌లు, ఆరు బ్రేక్ పాయింట్లతో మెరిసిన అల్కరాజ్.. పాయింట్ల పరంగా 59-25తో ఆధిపత్యం చూపించాడు. మూడో సీడ్, రష్యా ఆటగాడు డానిల్ మెద్వదేవ్ వెనక్కి తగ్గటం లేదు. మూడో రౌండ్ మ్యాచ్‌లో ఫెలిక్స్ ఆగర్‌పై 6-3, 6-4, 6-3తో వరుస సెట్లలో విజయం సాధించాడు. 8 ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లు సాధించిన మెద్వదేవ్.. 91-75తో పాయింట్ల పరంగా పైచేయి సాధించాడు. ఆరో సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ సైతం మూడు సెట్లలో గెలుపొందాడు. 6-2, 7-6(7-4), 6-2తో అలెక్స్ మైకల్‌సన్‌ను ఓడించాడు. 11 ఏస్‌లు సంధించిన జ్వెరెవ్.. ఐదు బ్రేక్ పాయింట్లతో ప్రత్యర్థిని చిత్తు చేశాడు. టైబ్రేకర్‌కు దారితీసిన రెండో సెట్‌ను 7-4తో సొంతం చేసుకుని సత్తా చాటాడు. గ్రిగర్ దిమిత్రివ్ మూడో రౌండ్లో నునో బోర్గెస్ చేతిలో ఓడాడు. 6-7(3-7), 6-4, 6-2, 7-6(8-6)తో నునో పైచేయి సాధించాడు. 11వ సీడ్ కాస్పర్ రూడ్‌కు పరాజయం తప్పలేదు. కామెరూన్ నోరీ 6-4, 6-7(7-9), 6-4, 6-3తో రూడ్‌ను మట్టికరిపించాడు. 9వ సీడ్ హబర్ట్ 3-6, 6-1, 7-6(7-4), 6-3తో విజయం సాధించి ప్రీ క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. ఆర్థర్ 6-3, 6-3, 6-1తో టాలన్‌పై వరుస సెట్లలో గెలుపొందాడు. టామీ పాల్ 4-6, 6-3, 6-2, 6-7(7-9), 0-6తో మియోమిర్ చేతిలో కంగుతిన్నాడు.



పకడ్బందీగా ఏర్పాట్లు

- 25వేల మంది స్కూల్ స్టూడెంట్స్‌కు ఉచితం
- ఉప్పల్ టెస్టుపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్

నవతెలంగాణ-హైదరాబాద్

జనవరి 25 నుంచి ఉప్పల్ స్టేడియంలో జరుగనున్న భారత్, ఇంగ్లాండ్ తొలి టెస్టు మ్యాచ్‌కు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు తెలిపారు. 'హెచ్‌సీఏ కొత్త అపెక్స్ కౌన్సిల్ ఎన్నిక అనంతరం జరుగుతున్న తొలి క్రికెట్ మ్యాచ్ ఇది. టెస్టు క్రికెట్‌ను పండుగలా నిర్వహించేందుకు హెచ్‌సీఏ సరికొత్త నిర్ణయాలు తీసుకుంది. ఐదు రోజుల పాటు 25 వేల మంది స్కూల్ స్టూడెంట్స్‌కు స్టేడియంలో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలి ప్రాధాన్యం ఇచ్చాం. స్టూడెంట్స్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా మధ్యాహ్న భోజనం, తాగునీరు ఉచితంగా అందిసున్నాం. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత సాయుధ దళాల కుటుంబ సభ్యులకు సైతం ఉచిత ప్రవేశ అవకాశం కల్పిస్తున్నాం. ఇందుకోసం హెచ్‌సీఏలో ప్రత్యేక విభాగం ఏర్పాటు చేశాం. డిజిటల్ యుగంలో ఆఫ్‌లైన్ టికెట్లు అమ్మకూడదని హెచ్‌సీఏ విధానపర నిర్ణయం. అందుకే టికెట్లు పూర్తిగా ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నాం. టికెట్ల కోసం అభిమానుల నుంచి అపూర్వ స్పందన లభించటం సంతోషకరం. స్టేడియం నలువైపులా పైకప్పు, నూతనంగా ఏర్పాటు చేసిన కుర్చీలు, భారీ ఎల్‌ఈడీ తెరలు, ఆధునాతన ఎల్‌ఈడీ ఫ్లడ్‌లైట్ల సొబగులు, దృశ్యరూపకమైన మైదానం టెస్టు మ్యాచ్ సందర్భంగా అభిమానులకు మరుపురాని అనుభూతులు అందిస్తుందని' జగన్‌మోహన్ రావు తెలిపారు. ఉప్పల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్‌సీఏ ఆఫీస్ బేరర్లు ఆర్. దేవరాజ్, బసవరాజు, శ్రీనివాసరావు, దల్జీత్ సింగ్ పాల్గొన్నారు.

హైదరాబాద్ హ్యాట్రిక్

సిక్కింపై ఇన్నింగ్స్ తేడాతో గెలుపు

నవతెలంగాణ-హైదరాబాద్ :

రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ హ్యాట్రిక్ విజయం సాధించింది. వరుసగా మూడో మ్యాచ్‌ను రెండు రోజుల్లోనే ముగించింది. బోనస్ పాయింట్ విజయంతో ప్లేట్ గ్రూప్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. తొలుత సిక్కిం తొలి ఇన్నింగ్స్‌లో 79 పరుగులకే కుప్పకూలింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 463/4 పరుగుల భారీ స్కోరు చేసింది. తన్మయ్ అగర్వాల్ (137), కెప్టెన్ తిలక్ వర్మ (103 నాటౌట్), రాహుల్ సింగ్ (83), రోహిత్ రాయుడు (75), చందన్ సహాని (54) రాణించారు. 384 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో డిక్లరేషన్ ప్రకటించిన హైదరాబాద్.. రెండో ఇన్నింగ్స్‌లో సిక్కిం కథను 48.3 ఓవర్లలో ముగించింది. సిక్కిం 186 పరుగులకే కుప్పకూలగా.. హైదరాబాద్ ఇన్నింగ్స్ 198 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు కూల్చిన తనయ్ త్యాగరాజన్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



ఆ బాధ్యతను యండమూరికి అప్పగించా : చిరు



'నా సినిమా కెరీర్ ప్రారంభంలో ఎక్కువగా యండమూరి వీరేంద్రనాథ్ రచనలే ఉన్నాయి. అవి నా కెరీర్‌కు ఎంతో దోహదపడ్డాయి. ఇప్పుడు అయన నా బయోగ్రఫీ రాస్తాను అని అనటం నాకు చాలా సంతోషంగా ఉంది' అని చిరంజీవి చెప్పారు. విశాఖపట్నంలో లోక్ నాయక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వర్ధంతి, ఏఎన్నార్ శత జయంతి కార్యక్రమం జరిగింది. దీనికి చిరంజీవి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో రచయిత యండమూరి వీరేంద్ర నాథ్‌కి సాహితీ పురస్కారంతో పాటు రెండు లక్షల రూపాయల నగదును బహూకరించారు.

యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ నిర్వహించిన ఈ వేడుకలో చిరంజీవి మాట్లాడుతూ, 'నా జీవిత చరిత్ర రాసే బాధ్యతను రచయిత యండమూరి వీరేంద్రనాథ్‌కి అప్పగించారు. నా ఎదుగుదలకి యండమూరి రాసిన రచనలు ఎంతో ఉపయోగపడ్డాయి. అటువంటి యండమూరి వల్లే నాకు మెగాస్టార్ అనే బిరుదు వచ్చింది. ఆయన రాసిన 'అభిలాష' నవల గురించి మొదట చెప్పింది మా అమ్మగారు. ఆ తరువాత నిర్మాత కెఎస్ రామారావు ఆ నవలని అదే పేరుతో సినిమాగా తీశారు. దానికి కోదండరామి రెడ్డి దర్శకత్వం, ఇళయరాజా పాటలు ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. ఆ సినిమా నా కెరీర్‌ని సుస్థిర పరుచుకోవడానికి ఎంతో ఉపయోగపడింది. ఆ తరువాత యండమూరి రాసిన ఇంకో నవల 'ఛాలెంజ్'ని కూడా సినిమాగా తీస్తే, అది అప్పటి యువకుల మీద ఎంతో ప్రభావం చూపించింది. ఎన్టీఆర్, ఏఎన్నార్ తెలుగు చిత్ర పరిశ్రమకి రెండు కళ్ళు లాంటివారు. వాళ్ళతో కలిసి నేను నటించటం నా అదృష్టంగా భావిస్తాను. ఎన్టీఆర్‌తో 'తిరుగులేని మనిషి' సినిమా చేస్తున్నప్పుడు నేను స్వయంగా పోరాట సన్నివేశాలు చేస్తుంటే, అది చూసి ఆర్టిస్టు జీవితం చాలా విలువైనది, రిస్క్ చెయ్యకూడదు, ఏదైనా జరిగితే నిర్మాత నష్టపోతాడు అని చెప్పారు. అప్పట్లో అన్నీ నేనే చెయ్యాలని అనుకుడేవాడిని, ఆ తరువాత 'సంఘర్షణ' సినిమా టైంలో గాయపడి, ఆరు నెలలు సినిమాలకి దూరంగా ఉన్నాను. పెద్దవాళ్ళు ఇలాంటివి ఊహించి ముందే చెప్తారు అని అప్పుడు అనుకున్నాను. అలాగే ఎన్టీఆర్ విలాసవంతమైన కార్లు, వస్తువులు కొనడం కన్నా ఇళ్ళు, ఇళ్ల స్థలాలు కొనమని సలహా ఇచ్చేవారు. ఆయన సలహాతో కొనుక్కున్న ఇళ్ళు, స్థలాలే ఈరోజు నా కుటుంబాన్ని కాపాడుతున్నాయి' అని చెప్పారు.

సమాజానికి స్ఫూర్తినిచ్చే కంచర్ల



కంచర్ల ఉపేంద్ర, మీనాక్షి జైస్వాల్

సమ సమాజం, నవ సమాజ నిర్మాణానికి స్ఫూర్తినిచ్చే సినిమాలు ఎన్నో వచ్చాయి. ఆ కోవకు చెందిన కథాంశంతో 'కంచర్ల' చిత్రాన్ని తెరకెక్కిస్తు న్నారు.ఎస్.ఎస్.ఎల్.ఎస్ క్రియేషన్స్ పతాకంపై కంచర్ల ఉపేంద్ర హీరోగా, మీనాక్షి జైస్వాల్, ప్రణీత హీరోయిన్లుగా రెడ్డెం యాదకుమార్ దర్శకత్వంలో కంచర్ల అచ్యుత రావు నిర్మిస్తున్న ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తిచేసుకుని త్వరలో విడుదలకు ముస్తాబు అవుతోంది.

నిర్మాత కంచర్ల అచ్యుత రావు మాట్లాడుతూ, 'ప్రస్తుతం పాటల చిత్రీకరణను కేరళ, గోవా, శ్రీకాకుళం, విశాఖపట్నం తదితర ప్రాంతాలలో జరుపుతున్నాం. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగుతున్నాయి. యువత రాజకీయాల్లోకి రావాలని, భూస్వాముల దగ్గర ఉన్న భూమి పేద ప్రజలకు పంచాలన్నది ఈ చిత్ర ప్రధానాంశం. దీనికి కమర్షియల్ అంశాలను మేళవించి, ప్రేక్షకులను అలరింపజేసేలా చిత్రాన్ని మలచడం జరుగుతోంది' అని చెప్పారు.

'ఇటీవల నేను నటించిన 'ఉపేంద్ర గాడి అడ్డా' చిత్రంతో ప్రేక్షకులకు దగ్గరైన నేను ఈ చిత్రం ద్వారా మరింత దగ్గరవుతాను అని నమ్మకంగా చెప్పగలను. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా మా నాన్నతీస్తున్న ఇంకో చక్కటి చిత్రమిది' అని హీరో కంచర్ల ఉపేంద్ర అన్నారు.

దర్శకుడు రెడ్డెం యాద కుమార్ మాట్లాడుతూ, 'సామాజిక స్పృహతో సమాజాన్ని జాగృతం చేసే అంశాలను ఇందులో పొందుపరిచాం' అని తెలిపారు.

సుమన్, అజయ్ ఘోష్, కాశీ విశ్వనాథ్, సుధ, రాజా రవీంద్ర, సుమన్ శెట్టి, దువ్వాసి మోహన్, జబర్దస్త్ దొరబాబు, ప్రకాష్ తదితరులు నటిస్తున్నారు.

నవచిత్రం

భిన్న కాన్సెప్ట్‌తో సరిపోదా శనివారం



నాని

నాని, వివేక్ ఆత్రేయ రెండోసారి కలసి పని చేస్తున్నారు. ఈ క్రేజీ కాంబినేషన్‌లో రాబోతున్న 'సరిపోదా శనివారం'లో నాని కంప్లీట్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో అలరించనున్నారు. డివివి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డివివి దానయ్య, కళ్యాణ్ దాసరి హై బడ్జెట్, భారీ కాన్వాస్‌తో ఈ ప్రాజెక్ట్‌ని నిర్మిస్తున్నారు.

ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ థియేట్రికల్ రైట్స్‌ను ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఎస్‌వీసీ సొంతం చేసుకుంది. రెండు తెలుగు రాష్ట్రాలలో చాలా గ్రాండ్‌గా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది.

ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో ఎస్ జే సూర్య కీలక పాత్రలో కనిపించ బోతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణలో ఆయన జాయిన్ అయ్యారు. ఈ చిత్రంలో ఆయన పాత్ర డైనమిక్‌గా ఉంటుందని చిత్ర బృందం తెలిపింది. ఇప్పటికే విడుదలైన 'సరిపోదా శనివారం' అన్‌చెయిన్డ్ వీడియోకు ట్రెమండస్ రెస్పాన్స్ వచ్చింది. ఇందులో నాని రగ్గడ్ అండ్ ఇంటెన్స్ లుక్‌లో కనిపించనున్నారు. ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తోంది. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ పాన్ ఇండియాలో చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, డీవోపీ: మురళి జి, ఎడిటర్: కార్తీక శ్రీనివాస్, ఫైట్స్: రామ్-లక్ష్మణ్.

థ్రిల్ చేసే గేమ్ ఆన్



గీతానంద్, నేహా సోలంకి జంటగా నటించిన చిత్రం 'గేమ్ ఆన్'. సీనియర్ నటులు మధుబాల, ఆదిత్య మీనన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రలు పోషించారు. కస్తూరి క్రియేషన్స్ అండ్ గోల్డెన్ వింగ్ ప్రొడక్షన్స్ బ్యానర్స్‌పై దయానంద్ దర్శకత్వంలో రవి కస్తూరి ఈ సినిమాను నిర్మించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా శనివారం ప్రసాద్ లాబ్స్‌లో ఈ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా నిర్మాత రవి కస్తూరి మాట్లాడుతూ, 'ఇది నా ఫస్ట్ ప్రాజెక్ట్. నేను ఆస్ట్రేలియాలో ఉంటాను. గీతానంద్ నా క్లాస్‌మేట్. మంచి కథతో ఈ సినిమాను స్టార్ట్ చేసాం. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా రూపొందించాం. ప్రేక్షకులను ఎంగేజ్ చేసేలా సినిమా ఉంటుంది. నవాబ్ గ్యాంగ్స్ అద్భుతమైన పాటలు ఇచ్చారు. అవి అందర్నీ ఆకట్టుకునేలా ఉంటాయి. ఇలాంటి కథ ఇప్పటివరకు తెలుగు తెరపై రాలేదు' అని చెప్పారు.

'కమర్షియల్ స్క్రిప్ట్‌ని రా అండ్ రస్టిక్‌గా చిత్రీకరించాను. పూరి జగన్నాథ్ ఫ్యాన్‌గా ఈ సినిమాను డైరెక్ట్ చేశాను. ఈ చిత్రంలో పాత్రలన్నీ గ్రే షేడ్‌లో ఉంటాయి. ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది. తన జీవితాన్ని చాలించాలనుకునే ఓ వ్యక్తి రియల్ టైమ్ సైకలాజికల్ గేమ్‌లోకి ఎలా ప్రవేశించాడు?, గేమ్‌లోని టాస్క్‌ను ఎలా స్వీకరించాడు?, అసలు ఆ గేమ్ ఎంచుకోవడానికి కారణం ఏమిటి?, ఈ గేమ్ ఎవరు ఆడిస్తున్నారు? అనే అంశాలతో ఈ సినిమా తెరకెక్కింది. యాక్షన్, రొమాన్స్, ఎమోషన్స్ ఆకట్టుకుంటాయి. కచ్చితంగా మా సినిమా ప్రేక్షకులకు కొత్త ఎక్స్‌పీరియన్స్ ఇస్తుంది' అని దర్శకుడు దయానంద్ అన్నారు. నేహా సోలంకి మాట్లాడుతూ, 'ఇలాంటి పాత్రను గతంలో నేనెప్పుడూ చేయలేదు. మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాం' అని తెలిపారు.

అవన్నీ తీపి జ్ఞాపకాలే..



కాలభైరవ

హనుమంతుని కథలు మన బాల్యంలో ఒక భాగంగా ఉన్నాయి. అంతేకాదు అవి తరతరాలకు స్ఫూర్తినిస్తాయి. డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ది లెజెండ్ ఆఫ్ హనుమాన్ కోసం హనుమాన్ చాలీసా అన్ష్ వంటి అత్యంత శక్తివంతమైన శ్లోకాల్లో ఒకదానికి జీవం పోస్తూ, ఆస్కార్-విజేత, సంగీత దర్శకుడు, గాయకుడు కాల భైరవ తన తెరవెనుక క్షణాల గురించి, ఈ కొత్త సంవత్సరంలో పాట పాజిటివిటీ ధైర్యాన్ని ఎలా తీసుకొస్తుంది అనే దాని గురించి మాట్లాడారు.

'ప్రారంభ కంపోజింగ్ దశ నుండి పూర్తి అయ్యే వరకు ట్రాక్‌లో పని చేస్తూ మేము చాలా తీపి జ్ఞాపకాలను మిగుల్చుకున్నాం. అయినప్పటికీ ఇప్పటికే ఉన్న అన్ని పాటలు, చాలా మంది ఇష్టపడే జనాదరణ పొందిన వాటి నుండి మరింత ప్రత్యేకంగా ఉండే పాటకు కొత్త ట్యూన్‌ను రూపొందించడానికి ప్రయత్నించడం అతిపెద్ద సవాలుగా మారింది. అలాగే, హనుమాన్ చాలీసా అన్ష్ ఎల్లప్పుడూ చాలా మందికి బలం, ధైర్యం ఇస్తుంది. ఈ పాటతో 2024 సంవత్సరాన్ని ప్రారంభించడం ద్వారా ప్రజలు బలం, ధైర్యం స్ఫూర్తిని కోరుకునే ప్రదేశాలలో ఇది ఒకటిగా మారుతుందని నేను ఆశిస్తున్నాను' అని కాలభైరవ చెప్పారు.

హీరోకి శాపం ఉంటే?



యష్ పూరి హీరోగా నటించిన కొత్త సినిమా 'హ్యాపీ ఎండింగ్'. ఈ చిత్రంలో అపూర్వ రావ్ హీరోయిన్‌గా నటించింది. హమ్స్ టెక్ ఫిలింస్, సిల్లీ మాంక్స్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించాయి. యోగేష్ కుమార్, సంజయ్ రెడ్డి, అనిల్ పల్లాల నిర్మాతలు. కౌశిక్ భీమిడి దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 2న గ్రాండ్‌గా థియేటర్స్ ద్వారా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. శనివారం ఈ చిత్ర ట్రైలర్‌ను డైరెక్టర్ వేణు ఊడుగుల చేతుల మీదుగా రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ప్రొడ్యూసర్ అనిల్ పల్లాల మాట్లాడుతూ, 'ఇదొక కమింగ్ ఏజ్ మూవీ. సౌండ్, విజువల్, మేకింగ్..ఇలా ప్రతి అంశంలో ఈ సినిమా మీకు కొత్తగా అనిపిస్తుంది. ట్రైలర్‌లో మీకు కొంచెం అడల్ట్ కంటెంట్ కనిపించవచ్చు. కానీ సినిమా చూస్తే అది ఎందుకు ఉందో తెలుస్తుంది. సెక్స్ అనే విషయం గురించి ఇప్పటికీ మనదేశంలో ఓపెన్‌గా మాట్లాడుకోలేకపోతున్నాం. కానీ ఓపెన్‌గా మాట్లాడుకునే మైండ్ సెట్ రావాలి. సినిమా అవుట్‌పుట్ పట్ల మేము హ్యాపీగా ఉన్నాం' అని తెలిపారు.

హీరోగా నేను చేస్తున్న రెండో సినిమా ఇది. మీ ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి నిరభ్యంతరంగా మా సినిమా చూడొచ్చు. మాది చిన్న సినిమా కాదు మంచి సినిమా' అని హీరో యష్ పూరి చెప్పారు. డైరెక్టర్ కౌశిక్ భీమిడి మాట్లాడుతూ, 'మహాభారతం చదువుతున్నప్పుడు అందులో అనేక శాపాల గురించి ఉంటుంది. అలా ఒక శాపం హీరోకు ఉంటే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో మోడ్రన్ అప్రోచ్‌తో చేసిన సినిమా ఇది' అని చెప్పారు. హీరోయిన్ అపూర్వ రావ్ మాట్లాడుతూ, 'మనకు సాధారణంగా కనిపించే విషయాలు హీరోని భయపెడుతుంటాయి. అతనో అమ్మాయిని కలుస్తాడు. ఆమే తన ప్రేయసి అవుతుంది. ఈ భయాల మధ్య ఆ అమ్మాయితో తన ప్రేమను ఎలా కొనసాగించాడు అనేది ఈ సినిమా కథ. ఈ సినిమాలో బోల్డ్ పర్‌ఫార్మెన్స్ చేయలేదు. కథే బోల్డ్‌గా ఉంటుంది' అని అన్నారు.

Printed And Published By Nandayala Narsimha Reddy On Behalf Of Navatelangana Printers Private Limited, Printed At Nava Telangana Printers Private Limited Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State, Published At Navatelangana Printers Private Limited, Near Manair Hanuman Temple, Godavarikhani Bypass Road, Housing Board Colony, Karimnagar-505001, Telangana State. Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60887.